www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 193
బుధవారం 03-01-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

అందరికీ సంక్షేమ ఫలాలు



- ఇక నుండి వికలాంగులకు ట్రైసైకిళ్ళకు బదులు మోటార్ సైకిళ్ళు
- రెండంకెల వృద్ధితో దేశంలోనే అగ్రస్థానం
- పండుగలా జన్మభూమి, మా ఊరు కార్యక్రమాలు: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో :
రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగిపోవాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి దక్కాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సారి జన్మభూమి, మా ఊరు కార్యక్రమాన్ని వినూత్న పద్దతిలో 9 రోజులపాటు పటు నిర్వహించనున్నామని చెప్పారు. మంగళవారం నాడు 5వ విడద జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజులపాటు నిర్వహించనున్న జన్మభూమి కార్యక్రమంలో రోజుకొక అంశంపై చర్చించడం జరుగుతుందన్నారు. గ్రామంలోనే అధికారులు ఉండి ప్రతి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజనలో హేతు బద్దత లేదని, రాష్ట్ర ప్రజల ఆమోదం లేకుండా విభజన జరిగిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను అమలు పరుస్తున్నామని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఇంకా కేంద్రం నుండి నిధులు రావాల్సి ఉందన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు డబ్బులు లేకపోయినా రూ. 24 కోట్లను రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు కరెంట్, ఎరువుల, సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోయినా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామని అన్నారు. కాంగ్రెస్ హయాంలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యంచేశారని, అందుకే

- మిగతా 2 లో



లైంగిక వేధింపుల కేసు...

గజల్ శ్రీనివాస్ అరెస్టు

- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- బెయిల్ పిటిషన్‌పై విచారణ నేడు



బాధితురాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ గాయకుడు, రచయిత గజల్ శ్రీనివాస్ అరెస్టయ్యారు. ఈ నెల 12వ తేదీ వరకు ఆయనకు నాంపల్లి కోర్టు జ్యుడీషియల్ రిమాండు విధించింది. తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ ఆధారాలతో ఓ యువతి డిసెంబరు 29వ తేదీన పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దానిపై మూడు రోజులుగా సమాచారాన్ని సేకరించిన పోలీసులు... మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో గంటకుపైగా విచారించారు. ఆ యువతి ఫిర్యాదులోని అంశాలు, విచారణ సమయంలో శ్రీనివాస్ చెప్పిన అంశాలు దాదాపు ఒకేరకంగా ఉండటంతో ఆయనను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు

- మిగతా 2 లో

అమరావతికి ప్రపంచ బ్యాంకు రుణం

- రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ
- ఇప్పటికే రూ.1500కోట్లు ఇచ్చాం : మంత్రి పొన్న రాధాకృష్ణన్



న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు నుంచి రుణం ఇచ్చే అంశం తమ పరిశీలనలో ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.3,324కోట్లు రుణం ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని చెప్పటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎంపీలు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం రాజ్యసభలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఈ విషయాన్ని తెలిపారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీ వేడిగా జరుగుతున్నా మంగళవారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశ్నోత్తరాల సమయం సాఫీగా జరగటంతో రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆనందం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రుణం మంజూరు విషయంలో ప్రపంచ బ్యాంకు ప్రారంభించిన అధ్యయనం, మదింపు ప్రాథమిక దశలో ఉందన్నారు. ప్రాజెక్టు మదింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత రుణానికి

- మిగతా 2 లో

ఏపీపీఎస్సీ సంక్షేమాధికారుల రాత పరీక్ష రివైజ్డ్ కీ

2లో

పార్టీల విరాళాలే టార్గెట్

- ఎలక్టోరల్ బాండ్స్‌పై నోటిఫికేషన్
- ఎస్బీలో లభ్యం, వడ్డీ ఉండదు
- విలువ వెయ్యి పది వేలు, లక్ష, పది లక్షలు, కోటి రూపాయలు..

11లో

రెండు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

11లో

డాక్టర్ల సమ్మె

- ఎన్ఎంసీ బిల్లుపై నిరసన వెల్లువ
- ఆస్పత్రులలో వైద్యసేవల నిలుపుదల



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) బిల్లును వ్యతిరేకిస్తూ మంగళవారం వైద్యులు రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు సమ్మె చేపట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపులో భాగంగా ఐఎంఏ ప్రతినిధుల బృందం, వైద్యులు 13 జిల్లాల్లోనూ నిరసన ర్యాలీలు

- మిగతా 2 లో

కొత్త వంగడం ముంచేసింది

రైతుల ఆశలను వమ్ము చేసిన ఆర్ఎన్ఆర్ 15048



- సామాజిక మాధ్యమాల ప్రచారంతో ఆశలు
- మధుమేహం దూరమన్నందుకు ప్రాధాన్యత
- స్థానిక అనుకూలతను నిర్ధారించుకోని రైతులు

విశాలాంధ్ర- నెల్లూరు :
ఆమాటా,ఈమాటా విని అధికోత్పత్తి సాధించవచ్చన్న నెల్లూరు జిల్లా రైతుల ఆశలను కొత్త వరి వంగడం ఆర్ఎన్ఆర్ 15048 వమ్ము చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఈ వంగడం మంచి దిగుబడులు ఇస్తోందన్న సామాజిక మాధ్యమం సమాచా రానికి స్థానిక రైతులు మొగ్గు చూపారు. మధుమేహాన్ని దూరం చేస్తుందన్న వార్తలకూ రైతులు అధిక ప్రాధాన్యతనిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఒకరు ఈ వంగ డాన్ని కనుగొన్నట్లు సమాచారం తెలంగాణలో దీని సాగు లాభదాయకంగా ఉందన్న సమాచారమూ స్థానిక రైతుల్లో ఆసక్తి నింపి ంది. కొత్త వంగడానికి స్థానికంగా సాగు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అనే అంశాన్నీ రైతులు నిర్ధారించుకోలేదు. దీనిపై వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాను, సాయాన్నీ తీసుకోలేదు. స్థానిక విత్తన విక్రేతలకు నేరుగా ఆర్డర్లిచ్చి విత్తనాలు కొనుగోలు చేశారు. వందలాది ఎకరాల్లో సాగుకు ఉపక్రమించారు. ఎకరాకు సరిపోయే బ్యాగును రూ.900లకుకొనుగోలు చేశారు. మనుబోలు, వెంకటగిరి, దక్కిలి, బలాయపల్లి, రాపూర్, నాయుడుపేట, ఓజిలి, చిల్లకూరు,కోట, చిత్తమూరు, వాకాడు తదితర మండలాల్లో ఆరెన్నార్ 15048వంగడం సాగు

- మిగతా 2 లో

చట్టాన్ని అమలు చేస్తారా ? లేదా?

కోడి పందేలపై హైకోర్టు సీరియస్

- వివరాలు 3 లో

ఇదీ లోకం!



ఈ ఏడూ డౌటే...

సాగర్ కుడి కాలువ కింద వరి సాగు ప్రశ్నార్థకం



- రిజర్వాయర్‌లో చాలీచాలని నీరు
- తాగు నీటికే సరి, రైతుల ఆందోళన

విశాలాంధ్ర, గుంటూరు:
నాగార్జున సాగర్ కుడి కాలువ కింద భూముల్లో వరి సాగు ఈ ఏడాది కూడా ప్రశ్నార్ధకంగానే కనిపిస్తోంది. నీటి కొరత సమస్యను అధిగమించేందుకు ఇరిగేటెడ్ డ్రై (ఐడీ) పంటలను పండించాలని రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నాగార్జున సాగర్ కుడి కాలువ కింద సుమారు 7.5లక్షల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది.

ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం 542అడుగులుగా ఉంది. రబీలో వరి సాగుకు ఈ నీటి నిల్వలు సరి పోవు. ఖరీఫ్ సీజనులో కుడి కాలువ కింద వరి సాగుకు అవసరమైన నీటిని గత మూడు సంవత్సరాలుగా అధికారులు విడుదల చేయలేదు. ఖరీఫ్‌లో మిరప, పత్తి, తృణధాన్యాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. మిర్చి ధరలు క్వింటాకు రూ.4,000ల నుంచి రూ.12,000లకు పతనమైన పరిస్థితి రైతులకు ఆందోళన కలిగిస్తోంది. దీని కారణంగా ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటున్న రైతాంగం గోడును ప్రభుత్వ యంత్రాంగం ఆలకించిన దాఖలాల్లేవు. కాగా రబీలోనూ వరి సాగుకు అవకాశాల్లేవని అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. వరి స్థానే మినుము విత్తనాలను 33శాతం సబ్సిడీకి, శెనగలను 50శాతం సబ్సిడీకి రైతులకు ఇవ్వజూపుతున్నామని గుంటూరు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నాగార్జున సాగర్ జలాశయంలో నీటి నిల్వలు ఆగస్టు, సెప్టెంబరు మాసాంతం వరకు తాగునీటి అవసరాలు తీర్చడానికే సరిపోయాయని ఇంజినీరింగ్ అధికారుల

- మిగతా 2 లో



బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామకృష్ణ, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, వనజ, దుర్గాభవానీ, దోనేపూడి తదితరులు

బర్దన్ స్ఫూర్తితో రాజ్యాంగ, లౌకికవాద పరిరక్షణ

ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేసిన రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
దేశంలో లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణకు సీపీఐ సీనియర్ నాయకులు అర్ధేందు భూషణ్ బర్దన్ (ఏబీ బర్దన్)ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రతిజ్ఞ చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఏబీ బర్దన్ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బర్దన్ చిత్రపటానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాయి. సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాగపూర్‌లో

- మిగతా 2 లో

బ్రెజిల్ జైలులో ఘర్షణ : 9మంది మృతి



సావోపాలో : బ్రెజిల్‌లోని గొయాస్ రాష్ట్రంలో కొలోనియా అగ్రో ఇండస్ట్రియల్ జైలులో ఖైదీల మధ్య జరిగిన ఘర్షణలలో 9 మంది చనిపోయారు. ఘర్షణలు జరిగే సమయంలో 127మంది జైలునుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి వారంతట వారే ఘర్షణ సద్దుమణిగిన తరువాత జైలుకు చేరుకున్నారు. సోమవారం జరిగిన ఈ ఘర్షణల్లో 9మంది చనిపోగా 14మంది గాయపడినట్టు బ్రెజిల్ అధికారవర్గాలు తెలిపాయి. ఖైదీలలో పరస్పర ప్రత్యర్థి గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉన్నది. ఇది తీవ్ర ఘర్షణగా మారింది. ఒక బ్లాక్‌లో నివసిస్తున్న ఖైదీలు మరో మూడు బ్లాకులపైన దాడులు చేశారు. చనిపోయిన ఖైదీలను కొంతమంది నిప్పుపెట్టి కాల్చివేసినట్టుగా తెలుస్తోంది. చనిపోయిన ఖైదీల సంఖ్యను అధికారులు ధృవీకరించారు. అయితే చనిపోయినవారు ఎవరైందీ ఇంకా గుర్తించవలసి వుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

ఇరాన్‌లో విదేశీ జోక్యం తగదు : రష్యా

మాస్కో: ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనల నేపథ్యంలో విదేశీ జోక్యం ఆమోదనీయం కాదని రష్యా వ్యాఖ్యానిస్తు అధికారికంగా ప్రకటన జారీ చేసింది. రష్యా విదేశాంగశాఖ జారీ చేసిన ప్రకటనలో ఆ దేశంలో జరుగుతున్న నిరసన ప్రదర్శనలు ఆంతరంగిక సమస్య. అందువల్ల విదేశీ జోక్యాన్ని నివారించాలి. ఇరాన్ వ్యవహారాలపై అమెరికా చేసిన ప్రకటన నేపథ్యంలోనే రష్యా ఈ ప్రకటన జారీ చేసింది. ఇరాన్‌లో మార్పులు అవసరమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానిస్తూ అక్కడి ప్రభుత్వం భావప్రకటన స్వేచ్ఛను అనుమతించాలని కోరింది. ఇరాన్‌లో జరుగుతున్న నిరసన ప్రదర్శన హింసాయుతంగా మారరాదని, రక్తపాతం జరగరాదని రష్యా విదేశాంగశాఖ సూచించింది. సిరియా ప్రజల విజ్ఞప్తులను వక్రీకరిస్తూ ఇక్కడ జరుగుతున్నది సైనిక చర్యలని అమెరికా అభివర్ణించింది. సిరియాలో కృత్రిమంగా అంతర్యుద్ధానికి అమెరికా చర్యలు కారణమయ్యాయి. అందువల్ల ఇరాన్ విషయంలో అమెరికా జోక్యం చేసుకోరాదని రష్యా పరోక్షంగా హెచ్చరించింది. ప్రజలు తమ అసంతృప్తిని శాంతియుతంగా ప్రకటించే హక్కు రాజ్యాంగంలోనే ఉందని ఇరాన్ ప్రభుత్వం పేర్కొంది. అయితే చట్టాన్ని ఉల్లంఘించరాదని తెలిపింది.

విశాలాంధ్ర ప్రపంచం

ఇరాన్‌లో నియంతృత్వంపై పోరాటం

ప్రజా ప్రదర్శనలపై టుడే పార్టీ వ్యాఖ్య



టెహరాన్ : అణచివేత, హింస, అధికధరలు, ఆశ్రిత పక్షపాతం, నియంతృత్వం తదితర చర్యలకు విసిగిపోయిన ప్రజలు పోరాటాన్ని ప్రారంభించారని ఇరాన్ టుడే పార్టీ (టిపిఐ) సెంట్రల్ కమిటీ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. ఈ ప్రజాపోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు దేశవిదేశీ ప్రతీఘాత శక్తుల ప్రయోజనాలకోసం దుర్వినియోగం చేసేందుకు అనుమతించరాదని టుడే పార్టీ కోరింది. ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటన ఇలా ఉంది : ప్రభుత్వంలో అంతర్గత సంఘర్షణలు, శక్తివంతమైన గ్రూపుల మధ్య తగాదాలు మున్నెన్నడూలేని విధంగా ఉన్నాయి. వీటికారణంగానే ఆర్థిక సంక్షోభం గాఢమైంది. ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయింది. ప్రభుత్వంపై బయటశక్తుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఇవన్నీ కలిసి ఇరాన్ సమాజంలో ప్రజ్వలిత పరిస్థితిని క్లిష్టదశకు చేర్చాయి. అధిక ధరలు, అణచివేత, ప్రభుత్వ విభాగాల న్యాయ విరుద్ధ చర్యలను నిరసిస్తూ విస్తృతంగా కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు అనేక నగరాలలో ప్రదర్శనలు ప్రారంభించారు. ప్రభుత్వ విభాగాలు గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకే అణచివేత చర్యలకు పూనుకుంటున్నాయి. దేశంలో ఇస్లామిక్ రిపబ్లిక్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల అసహనాన్ని, ఆగ్రహాన్ని తెలియజేసేందుకే ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ అనుకూల సంస్కరణవాదులు ఈ నిరసన కార్యక్రమాలన్నీ కుట్రలని చేస్తున్న వ్యాఖ్యలను టుడే పార్టీ తిరస్కరించింది. ప్రజా సమూహాల డిమాండ్లు ప్రస్తుత పాలనలో సర్దుబాటు అయ్యే చిన్నచిన్నవి కాదు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన మౌలికమైన అంశాలు గత రెండు దశాబ్దాలుగా ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తున్న అంశం ఇరాన్ ప్రజలకు తెలుసు. ప్రభుత్వ అనుకూల సంస్కరణవాదులు దేశంలో శక్తివంతమైన బ్రోకర్ల పాత్రను నిర్వహిస్తున్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలపై తమ ప్రభావాన్ని చూపేందుకు అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం, ఇజ్రాయిల్‌లోని నెతన్యాహు మితవాద ప్రభుత్వం ఇరాన్‌లో నిరంకుశ రాజకీయ గ్రూపులు ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుతంవున్న ప్రతీఘాత శక్తులతో కూడిన ప్రభుత్వం స్థానంలో మరో ప్రతీఘాత పాలనను తీసుకురావాలనేదే ఈ శక్తుల లక్ష్యం. అది కూడా విదేశీ సైనిక జోక్యంద్వారానే తీసుకురావాలని ఎత్తుగడ వేస్తున్నారు. ఇరాన్‌లోని పురోగమన, స్వాతంత్ర్యంపట్ల ప్రేమకల్గిన శక్తులు ప్రజాపోరాటాలలో పాల్గొని వారి న్యాయమైన డిమాండ్లను సాధించేందుకు సరైన మార్గదర్శకాన్ని ఇవ్వాలని ప్రస్తుతం దేశంలో పాలిస్తున్న అణచివేతప్రభుత్వాన్ని తొలగించేందుకు పూనుకోవాలని టుడే పార్టీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. సమాజంలోని అన్ని విభాగాలు సంయుక్త పోరాటం నిర్వహించడం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

సియోల్ ఒలింపిక్స్‌కు ఉత్తరకొరియా

దక్షిణకొరియాతో చర్చించే అవకాశం



పోంగ్‌యాంగ్ : దక్షిణకొరియాలో 2018లో జరగనున్న శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో తాము పాల్గొనే అవకాశంవుందని ఈ అంశంపై ఆదేశంతో మాట్లాడతామని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ -ఉన్ తెలిపారు. నూతన సంవత్సరం ప్రవేశం సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పై విధంగా అన్నారు. కొరియా ద్వీపకల్పంలో ఈ రెండు దేశాలకు ఈ ఏడాది ప్రాధాన్యత ఉంది. రెండు దేశాల 70వ వ్యవస్థాపక వార్షికోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దక్షిణకొరియాలో ఒలింపిక్స్ నిర్వహించడం ఎంతైనా సంతోషదాయకమని కిమ్ అన్నారు. ఒలిం పిక్స్ విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షిం చారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రెండు దేశాల మధ్య చర్చ లకు కూడా తాము సిద్ధంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు. దేశ వ్యవస్థాపక 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ఈ గొప్ప కార్యక్ర మాన్ని ఉత్సాహంతో నిర్వహించాలని అదే సమ యంలో దేశ గౌరవాన్ని, సత్తాను చాటాలని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య నిలిచిపోయిన సంబంధాలు తిరిగి పునరుద్ధరణ జరగాలని తద్వారా ఈ ఏడాది అర్థవంతమైనదిగా చరిత్రలో నమోదు కావాలని కిమ్ అన్నారు. రెండు కొరియాలది ఒకే రక్తం. అందువల్ల దక్షిణకొరియా నిర్వహిస్తున్న క్రీడ లకు సహకరించటం పొరుగునవున్న తమ కర్తవ్య మని ఆయన అన్నారు. ఫిబ్రవరిలో తమ దేశంలో జరగనున్న కార్యక్రమంలో సంయుక్త బృందం హాజ రుకావాలని ఆయన సూచించారు. రెండుదేశాల మధ్య నెలకొనివున్న సైనిక సంఘర్షణ ఉద్రిక్త వాతావరణం స్థానంలో శాంతియుతమైన వాతావరణాన్ని కల్పించేందుకు దోహదం చేయాలని కిమ్ కోరారు.

వెనిజులాలో 40 శాతం పెరిగిన వేతనాలు



కారకాస్ : వెనిజులాలో ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే కార్మికుల వేతనాలు 40 శాతం పెంచుతూ దేశాధ్యక్షుడు నికొలస్ మదురొ ప్రకటించారు. నూతన సంవత్సరం సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వేతనాలతోపాటు పదవీ విరమణ పెన్షన్లకు కూడా పెంచారు. ఆరోగ్యరంగంలో పనిచేసే కార్మికులు, ఇతర వృత్తి నిపుణులకు, టీచర్లకు, సైన్యంలో పనిచేసే సిబ్బందికి తక్షణం వేతనాలు పెరుగుతాయి. ఆహార ఓచర్ల కార్యక్రమం కింద మరింతమంది పౌరులు ప్రయోజనం పొందుతారని, వారికి అందే ఓచర్ల విలువ కూడా పెరుగుతుందని మదురొ ప్రకటించారు. పెన్షన్లు కూడా 40 శాతం పెరుగుతాయి. నెలరోజుల్లో నూతన ద్రవ్య వ్యవస్థను ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక సుస్థిరత, సామాజిక శాంతికి దోహదం చేసే ద్రవ్యవ్యవస్థను అమలుచేస్తామని అన్నారు. నూతన ద్రవ్య వ్యవస్థను రూపొందించడంలో కృషి చేసిన జాతీయ రాజ్యాంగ అసెంబ్లీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమమైన ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించినప్పటికీ మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు హ్యూగొ ఛావెజ్ ప్రారంభించిన 21వ శతాబ్ది సోషలిజం నమూనాను మరింత ముందుకు తీసుకువెళ్లగలిగామని అన్నారు.మున్సిపల్, రాష్ట్రస్థాయిలో అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో పాలక యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఘనమైన విజయం సాధించి దేశ సుస్థిరతకు తోడ్పడిందని ఆయన అన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, సాంకేతికత సాధించామని, అయితే వీటన్నిటినీ దేశంలోని తిరోగమన శక్తులు అంతర్జాతీయ పెట్టుబడిదారి శక్తులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని మదురొ హెచ్చరించారు. దౌత్యపరమైన సంబంధాలు అంతర్జాతీయ రంగంలో వెనిజులా స్థాయి పెరిగాయని, రష్యా, చైనా, భారత్, టర్కీ, ఇరాన్ తదితర దేశాలతో రాజకీయ, ఆర్థిక సంబంధాలు సుస్థిరంగా ఉన్నాయని మదురొ తెలిపారు.

రైల్వే ఛార్జీల పెంపుపై నిరసన

లండన్ : బ్రిటన్ అంతటా రైల్వే ఛార్జీల పెంపును నిరసిస్తూ విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. 2013 తరువాత రైల్వే ఛార్జీలు 3.4 శాతం పెరిగాయి. ఈ చర్యను నిరసిస్తూ 40 రైల్వే స్టేషన్లలో ప్రదర్శనలు జరపాలని ప్రయాణీకుల సంఘాలు నిర్ణయించాయి. సీజన్ టిక్కెట్లు సైతం 100 పౌండ్లకు పెంచారు. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఛార్జీలను పెంచినట్లు రవాణాశాఖ దేశవ్యాప్తంగా అన్ని రైల్వే మార్గాలను పెంచిన ఛార్జీలు అమలు చేస్తారు. గత సంవత్సరం జులైలో చిల్లర ధరలను సూచి ఆధారంగా ఛార్జీలను నిర్ణయించినట్లు రవాణాశాఖ ప్రకటించింది. రైల్వే ఛార్జీల పెంపుదల కారణంగా మెరుగైన సేవలను అందించేందుకు వీలవుతుందని అలాగే పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కలుగుతుందని రైల్వేకి సంబంధించిన పారిశ్రామిక వాణిజ్య విభాగం తెలియజేసింది.

ముంచేసింది

(మొదటిపేజీ తరువాయి)

మొదలు పెట్టారు. అయితే స్థానిక వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు ఆశపడినట్లుగా పంట ఎక్కిరాలేదు. నాటిన 20వ రోజు నుంచి నష్టపోతున్న సంగతిని రైతులు గుర్తించగలిగారు. పంటలను సోకిన తెగుళ్లను ఎన్ని రకాలుగా ప్రయత్నించినా అదుపు చేయలేకపోవడంతోనే ఎక్కువ పంట నష్టం వాటిల్లినట్లు రైతుల మాటగా ఉంది. సగటున ఒక ఎకరాకు రూ.25వేల వంతున నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. పశువుల మేతకు తప్ప మరే ఇతర ఉపయోగమూ కానరావడం లేదంటున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు తగిన వంగడాలను రైతులు ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చినపుడు ప్రయోగాత్మకంగా కొద్ది భూమిలో సాగు చేసి చూడమని రైతులకు సలహా ఇచ్చినట్లు కొందరు నిపుణులు చెబుతున్నారు. తమ మాటను రైతుల ఆలకించ లేదంటున్నారు. శాస్త్రవేత్తల, నిపుణుల సాయం తీసుకోకుండా నేరుగా సాగుకు దిగితే ఇలాంటి నష్టదాయక పరిస్థితే ఎదురవుతుందని రైతులు గమనించాలి.

గజల్ శ్రీనివాస్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

రిమాండు విధించింది. వివరాల్లోకి వెళితే...పంజాగుట్టలోని వెంకటరమణ కాలనీలో సప్తగిరి టవర్స్‌లో పండుగలు, హిందూ ధర్మానికి సంబంధించిన వివరాలు అందించే వెబ్ రేడియో విజయవాణి కార్యాలయం శ్రీనివాస్‌కు ఉంది. సేవ్ టెంపుల్స్ ఆర్గనైజేషన్ పేరిట ఈ కార్యాలయం నడుస్తోంది. గత జూన్‌లో కుమారి అనే ఒక యువతి రేడియో జాకీగా అందులో ఉద్యోగంలో చేరింది. రెండు మాసాలుగా తనను లైంగికంగా శ్రీనివాస్ వేధిస్తున్నారని ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వేధింపులకు సంబంధించిన సెల్‌ఫోన్‌లోని ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, వీడియోలను పంజాగుట్ట పోలీసులకు ఆమె అందించింది. తనను చిత్రహింసలు పెట్టి లోబరుచుకునేందుకు శ్రీనివాస్ యత్నించారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. లైంగిక కోరికలు తీర్చాలని వేధిస్తున్నారని, తనకు సహకరిస్తే ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, సహకరించకపోతే ఉద్యోగంలో నుండి తీసేస్తానని శ్రీనివాస్ బెదిరిస్తున్నాడని ఆ యువతి పేర్కొంది. దీనిపై పంజాగుట్ట ఏసీపీ విజయ్‌కుమార్ నేతృత్వంలో మూడు రోజులుగా పోలీసులు ఆమె ఇచ్చిన ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అవి వాస్తవమేనని తేలడంతో శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. శ్రీనివాస్‌పై ఐపీసీ 354, 354ఏ, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఆరోపణల్లో నిజం లేదు : శ్రీనివాస్

తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని గజల్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆ అమ్మాయి తనపై ఎందుకు తప్పుడు ఫిర్యాదు చేసిందో అర్థం కావడం లేదన్నారు. తనకు ఇటీవల యాక్సిడెంట్ అయ్యిందని, భుజానికి దెబ్బ తగిలితే ఆమె మందు రాసిందని, వద్దని చెప్పినా వినలేదన్నారు. తాను ఆమెతో మసాజ్ చేయించుకున్నానన్న ఆరోపణలు నిరాధారమన్నారు. తనకు రోజూ ఫిజియోథెరఫీ జరుగుతుందన్న, సోమవారం ఫిజియోథెరఫిస్టు రాకపోవడంతో భుజానికి కుమారి మందు రాసిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. బాధితురాలు అందజేసిన సాక్ష్యాలలో ఇంట్లో పని మనిషితో గజల్ శ్రీనివాస్ మసాజ్ చేయించుకుంటున్న వీడియో ఉంది. గజల్ ఆఫీస్‌లో యాంటీరూమ్‌లో బెడ్‌ను సైతం ఏర్పాటు చేసుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలను కుమారి పోలీసులకు అందజేసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు పనిమనిషి పార్వతి స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. పార్వతిని ఏ-2గా చేర్చారు.

చంచల్‌గూడ జైలుకు...

గజల్ శ్రీనివాస్‌ను పోలీసులు మంగళవారం మధ్యాహ్నం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన మేజిస్ట్రేట్... గజల్ శ్రీనివాస్‌కు 14 రోజుల రిమాండు విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గజల్ శ్రీనివాస్‌ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

న్యాయమూర్తి రిమాండు ప్రకటించిన వెంటనే శ్రీనివాస్ తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయమూర్తి బుధవారానికి వాయిదా వేశారు. మరోవైపు గజల్ శ్రీనివాస్‌ను మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు చెప్పారు.

డాక్టర్ల సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు.ఆస్పత్రుల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకూ వైద్యసేవలను నిలిపివేసిన డాక్టర్లు, అత్యవసర వైద్యసేవలకు మాత్రమే మినహాయింపునిచ్చారు.విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి నగరాలలోని వైద్యులు, జూనియర్ డాక్టర్లు సమ్మెలో పాల్గొన్నారు. విజయవాడ పీబీ సిద్దార్థ వైద్యకళాశాల నుంచి వైద్యవిద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు.ఎన్ఎంసీ బిల్లును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. విజయవాడలో నిరసన కార్యక్రమానికి ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ పీవీ రమణమూర్తి, విజయవాడ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్‌సీ బోస్, జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ స్వామి తది తరులు నాయకత్వం వహించారు. ఐఎంఏ కార్యాల యం దగ్గర అసోసియేషన్ నేతలు భేటీ అయ్యారు. నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుతో వైద్య విద్యార్థులకు. నాణ్యమైన వైద్యవిద్య అందదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం తమ విధి విధానాల్ని మార్చుకోవాలని, లేకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్టాండింగ్ కమిటీ ఎదుట బిల్లు పెట్టాలి: పీసీసీ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ అంబటి

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎన్ఎంసీ బిల్లును చట్ట రూపంలోకి తెచ్చే ముందు స్టాండింగ్ కమిటీ ఎదుట ప్రవేశపెట్టాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగిన వైద్యుల అనుమానాల్ని నివృత్తి చేయాలని డిమాండు చేశారు.

మార్చి2016లో 92పేజీల నివేదికను స్టాండింగ్ కమిటీ ఇచ్చిందని వివరించారు. ఇందులో కొన్నింటినే పొందుపరచి బిల్లుకు చట్టబద్ధత తెచ్చే ప్రయత్నాల్ని విరమించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతిపాదిత బిల్లును యథాతథంగా చట్టరూపంలోకి తెస్తే..వైద్యులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.స్టాండింగ్ కమిటీ ఎదుట ఈ బిల్లును ప్రవేశపెట్టి అభ్యంతకర విషయాలను తొలగించాలని కోరారు.

ఈ ఏడూ డౌటే...

(మొదటిపేజీ తరువాయి)

వాదనగా ఉంది. వేసవిలో తాగునీటి అవసరం, వినియోగం ఎక్కువని గుర్తు చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి తాగునీటి ట్యాంకులన్నిటినీ నింపాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఖరీఫ్ సీజనులోనైనా సాగు అవసరాలు తీర్చేందుకుగాను అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాజ్యాంగ, లౌకికవాద పరిరక్షణ

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని అనేక కష్టనష్టాలను ఎదుర్కొని విద్యార్థి, యువజనుల్లో వామపక్షభావాల్ని పెంపొందింపచేసేందుకు బర్ధన్ కృషి చేశారన్నారు. తన పూర్తి జీవితాన్ని పార్టీ నిర్మాణం, అభ్యున్నతికి అంకితం చేశారని కొనియాడారు. సీపీఐ-సీపీఎం ఐక్యతను ఆకాంక్షిస్తూ, కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ కోసం పరితపించారన్నారు. దేశంలో లౌకివాదాన్ని పరిరక్షించేందుకు అనేక పోరాటాలు చేయడమే కాకుండా కష్టజీవుల కోసం అహర్నిశలూ కష్టించారన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్నే మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, సాక్షాత్తు కేంద్రమంత్రులే అంబేద్కర్‌ను అవమానపరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో లౌకికవాదానికి పెనుముప్పు ఏర్పడుతోందన్నారు. ఒకవైపు కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ మరోవైపు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అవినీతి, లంచగొండితనం విచ్చలవిడిగా పెరిగిపోతోందన్నారు రాజకీయ విలువలను కాపాడేందుకు, ప్రజాతంత్రవాదాన్ని బలపరచే పద్ధతుల్లో కార్యక్రమాలను కొనసాగిస్తామని రామకృష్ణ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఏపీ రైతు సంఘం నేతలు కేవీవీ ప్రసాద్, ఎం యలమందరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవానీ, సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, సహాయ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, నగర సహాయ కార్యదర్శి జి కోటేశ్వరరావుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సంక్షేమాధికారుల రాత పరీక్ష రివైజ్డ్ కీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీపీఎస్సీ నిర్వహించిన బీసీ,ఎస్సీ,ఎస్టీ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ల(నోటిఫికేషన్ నంబరు 34/2016) రాత పరీక్షల రివైజ్డ్ కీను మంగళవారం విడుదల చేశారు.

ఈ మూడు విభాగాల రాత పరీక్షలకు సంబంధించిన తొలివిడత పేపర్-1, పేపర్-2, పేపర్-3 పరీక్షల కీను సెప్టెంబరు 2017న వెల్లడించారు.దీనిపై కొందరి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో కమిషన్ కార్యాలయం రివైజ్డు కీను వెల్లడించింది. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే.. ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీలోగా(మూడు పని దినాల్లో) ఏపీపీఎస్సీ కార్యాలయం, ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ సముదాయం, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదుట, విజయవాడ-ఆంధ్రప్రదేశ్ కార్యాలయానికి రాత పూర్వకంగా పంపాలి. తపాలలో జాప్యానికి కమిషన్ బాధ్యత వహించబోదని స్పష్టం చేసింది.

అమరావతికి ప్రపంచ బ్యాంకు రుణం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన సంప్రదింపులు ప్రారంభమవుతాయని, కేంద్రం, ప్రపంచ బ్యాంకుల మధ్య సంప్రదింపుల ప్రక్రియ ముగిసిన తర్వాత రుణం మంజూరు అవుతుందని వివరించారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం జనరల్ కేటగిరి రాష్ట్రాలు ప్రపంచ బ్యాంకు వంటి బహుముఖ ఆర్థిక సంస్థలు నుంచి పొందే ఆర్థిక సహాయం ప్రాజెక్టు వ్యయంలో 70శాతం మించకూడదన్నారు. మిగిలిన 30శాతం రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచే సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత జరిగే ఖర్చును రుణంలో భాగంగా ప్రపంచ బ్యాంకు నియమిత కాలపరిమితి ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తూ వస్తోందని వివరించారు. ప్రపంచ బ్యాంకు రుణం ఇంకా ఆమోదం పొందనందున ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధులు, వాటి వినియమ పత్రాలు సమర్పణ ప్రసక్తే లేదని మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి అరుణ్ జెట్లీ సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే రూ.1500కోట్లు మంజూరు చేసిన విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్ను రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఏపీ విభజన చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నూతన రాజధాని నగరంలో సదుపాయాల కల్పనలో భాగంగా ప్రత్యేక సహాయం కింద నిధులు విడుదల చేసిందన్నారు. రాజ్‌భవన్, అసెంబ్లీ భవనాల నిర్మాణంకోసం 2014-15లో రూ.500కోట్లు, 2015-16లో నూతన రాజధాని నిర్మాణానికి రూ.350కోట్లు, మౌలిక సదుపాయల కల్పనకు రూ.200కోట్లు, 2016-17లో రూ.450కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. కేంద్రం ఇప్పటి వరకు విడుదల చేసిన రూ.1,500కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు సమర్పించిందన్నారు. ఆయా నిర్మాణాల కోసం రూ.1,583 కోట్లు ఖర్చు చేసినట్లు నీతి అయోగ్ వినియమ పత్రాలు సమర్పించిందని కేంద్ర మంత్రి పొన్ను రాధాకృష్ణన్ రాజ్యసభలో వెల్లడించారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

(మొదటిపేజీ తరువాయి)



డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రుణమాఫీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నూటికి 60 శాతం మందికి రేషన్ కార్డుల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పంచదారను రద్దు చేసినా జనవరి నుండి రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి కార్డుకు అరకేజీ పంచదారను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1.42 కోట్ల మందికి రేషన్ కార్డులు ఉన్నాయని, జన్మభూమి సందర్భంగా మరో 4.5 లక్షల మందికి రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెన్షన్‌లను రూ. 200 నుండి రూ.1000, రూ.1500 చేసిన ఘనత మన ప్రభుత్వందేనన్నారు. జన్మభూమి కార్యక్రమంలో మరో 5 లక్షల మందికి కొత్త పెన్షన్‌లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దీపం పథకం క్రింద ప్రతి మహిళకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వంట గ్యాస్ పంపిణీలో దేశంలోనే 1వ స్థానంలో ఉందన్నారు. చంద్రన్న బీమాతో ప్రమాదంలో మరణించిన ప్రతి వ్యక్తికి రూ. 5 లక్షలు, 50 సంవత్సరాలలోపు సహజ మరణానికి రూ. 2 లక్షలు, వికలాంగులకులైతే రూ. 3.50 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలు పెళ్ళిళ్ళు చేసుకొనేందుకు ఆర్థికంగా వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఎస్టీలకు రూ. 50 వేలు, ఎస్సీలకు రూ. 40 వేలు, బీసీ, మైనార్టీలకు రూ. 35 వేలు పెళ్ళిఖర్చుల నిమిత్తం ఇస్తున్నట్లు తెలిపారు. 75 యూనిట్లలోపు కరెంటు వినియోగించే వారికి ప్రభుత్వమే కరెంట్ బిల్లు చెల్లిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వికలాంగులకు ఇస్తున్న ట్రై సైకిళ్ళకు బదులు ఇక నుంచి ట్రై మోటార్ సైకిళ్ళు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో 200 ఇన్నోవా కారులను, 500 పైగా ట్రాక్టర్లను పంపిణీ చేసినట్లు ప్రకటించారు. అన్ని పండుగలకు ముస్లిం తోఫా, క్రిస్మస్, సంక్రాంతి కానుకలు ఇస్తున్నామని వెల్లడించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తోపాటు విదేశాల్లో చదువుకొనేందుకు రూ. 10 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్రంలో 19 లక్షల ఇళ్ళు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగంలేని యువతీ యువకులు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండేందుకు నిరుద్యోగ బృతి ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలకంటే మెరుగైన జీవన ప్రమాణాలు అందిస్తున్నామని అన్నారు. 2022 కల్లా దేశంలోని మూడు అగ్ర రాష్ట్రాల్లో ఒకటిగా ఉండాలని. 2029 కల్లా రాష్ట్రాన్ని ఆనందాల ఆంధ్రప్రదేశ్‌గా చేస్తానని అన్నారు.

సంక్రాంతి పండుగంటే జూదం ఆడటం కాదని, పెద్దలు ఇచ్చిన వారసత్వాన్ని, సంపదను కాపాడటం తప్ప జూదంలా చూడకూడదని పేర్కొన్నారు. కుల , మతాలకు అతీతంగా అన్ని పండుగలను అందరు జరుపుకొని సమైక్యతను చాటుకోవాలని సూచించారు. త్వరలో ప్రతి పంచాయితీకి స్టార్‌లను కేటాయించి ఆయా పంచాయితీలలో జరుగుతున్న అభివృద్ధిపై ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడిలాంటిదని, ఆ ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానం చేసి రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

జన్మభూమి, మా ఊరు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర అటవీశాఖామంత్రి శిద్ధా రాఘవరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి. నారాయణ, జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్, ఎమ్మెల్సీ కరణం బలరామక్రిష్ణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు మహిళలు వేసిన రంగ వల్లులు, కోలాటాలను తిలకించిన అనంతరం ముఖ్యమంత్రి విద్యార్థుల మధ్య జరిగిన కబ్బడ్డీ, ఖోఖో పోటీలను చూసి అభినందించారు.

చట్టాన్ని అమలు చేస్తారా? లేదా?

కోడిపందేలపై హైకోర్టు సీరియస్

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ కోడిపందేలకు సిద్ధమవుతుండడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. చట్టాన్ని అమలు చేస్తారా? లేదా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అడ్డుకోవాలన్న పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కోడిపందేలకు మంత్రులు అనుకూల ప్రకటనలు చేయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వీటి నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని ప్రధాన కార్యదర్శి, డీజీపీ, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. గతేడాది కూడా సంక్రాంతి సమయంలో కోడి పందేలు నిర్వహించరాదని ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలను హైకోర్టు జారీ చేసింది. ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లనూ ఆదేశించింది. ప్రభుత్వం కూడా జరగకుండా చూస్తామని పలుమార్లు ప్రకటించింది. అయితే, సంప్రదాయమైన కోడి పందేలను కొనసాగించి తీరుతామంటూ పలువురు మంత్రులు, అధికార పార్టీకి చెందిన శాసనసభ్యులు, స్థానికులు పేర్కొంటూ గతేడాది వాటిని కొనసాగించారు. పోలీసులు చూస్తూ మిన్నకుండిపోయినట్లు వార్తలు వెలువడ్డాయి. హైకోర్టు ఆదేశాలు ఎక్కడా అమలు కాలేదని సర్వత్రా వినవచ్చింది. ఈ ఏడాది కూడా కోడి పందేలకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు.

సైన్యంలోకి ప్రైవేటు కంపెనీలు

బెంగుళూరు : రక్షణ శాఖలోకి ప్రైవేటు కంపెనీలు రాబోతున్నాయి. భారతీయ ఆర్మీకి చెందిన ఆర్మీ బేస్ వర్క్‌షాపు (ఏబీడబ్ల్యూ)లను నిర్వహించేందుకు ప్రైవేటు కంపెనీలకు రక్షణశాఖ అనుమతినిచ్చింది. దేశంలోని ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది నగరాల్లోని ఏబీడబ్ల్యూలను ప్రైవేటు కంపెనీలు నడపనున్నాయి. 'ప్రభుత్వ ఆస్తిని కాంట్రాక్టర్ నిర్వహించే మోడల్' కింద రక్షణ శాఖ దీన్ని ఆమోదించింది. ఈ మోడల్‌లో ప్రైవేటు కంపెనీలు రక్షణ శాఖలో ఎలాంటి పెట్టుబడులు పెట్టవు. కానీ, కంపెనీలకు కావలసిన భూమి, వస్తువులు, యంత్రాలు తదితర వనరులను ప్రభుత్వమే సమకూర్చుతుంది. నిపుణుల కమిటీ(సీఓఈ) సూచనలతోనే రక్షణ శాఖ ఈమేరకు నిర్ణయించినట్టు తెలిసింది. ఆర్మీ సామర్థ్యాన్ని పెంచడం, రక్షణ శాఖ వ్యయాన్ని అదుపులో ఉంచడం తదితరాల దృష్ట్యా సీఓఈ ఈ సూచనలు చేసినట్లు సమాచారం. ఎల్లప్పుడూ యుద్ధం కోసం ఆయుధాలను సిద్ధంగా ఉంచేందుకు ఏబీడబ్ల్యూలను రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆరంభించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఓ వైపు ఆయుధాలను పర్యవేక్షించేందుకున్నా.. భారతీయ ఆర్మీ ఎన్నడూ దానిపై ఆధారపడలేదు. ఢిల్లీ, కోల్‌కతా, పూనె, బెంగుళూరు తదితర కీలక నగరాల్లో ఏబీడబ్ల్యూలున్నాయి.

ఎర్రచందనం ఇ-వేలానికి ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : తొమ్మిదవ దశలో భాగంగా 965.494 మిలియన్ టన్నుల ఎర్రచందనాన్ని గ్లోబల్ ఇ-టెండర్ కం ఇ-వేలం వేసేందుకు ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ పాలనాపరమైన ఆమోదాన్ని తెలిపింది. ఈమేరకు ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి అనంతరాము మంగళవారం జీవోను జారీ చేశారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ 8,584.1363 మిలియన్ టన్నుల ఎర్ర చందనాన్ని అక్రమ రవాణాదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీనిని 2019 ఏప్రిల్ 30లోపు గ్లోబల్ ఇ-వేలం ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 9వ దశలో 965.494 మిలియన్ టన్నులను వేలం వేసేందుకు ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌ను నియమించింది. ఈ సంస్థ ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా వేలం నిర్వహించనుంది. పూర్తి పారదర్శకంగా ఈ వేలం వేసే విధానాన్ని పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఏపీఎఫ్‌డీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పర్యవేక్షించనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరగనుంది. మొదటి దశలో జనవరి 24,27వ తేదీలు, 29, 31 తేదీలు, ఫిబ్రవరి 2వ తేదీ, 5వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ వేలం నిర్వహిస్తారు. టెండర్ నోటిఫికేషన్‌కు సంబంధించిన పత్రాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖతోపాటు చైనా, జపాన్, మలేసియా, సింగపూర్, యూఏఈ, థాయిలాండ్, ఇండోనేషియాతోపాటు ఇండియన్ ఎంబసీలకు పంపించనున్నారు.

ఏపీఎఫ్‌డీసీ వీసీగా ప్రతీప్‌కుమార్

ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఏపీఎఫ్‌డీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్ ప్రతీప్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ కార్యదర్శి జి అనంతరాము మంగళవారం జీవోను విడుదల చేశారు.

అసలైన పేదలకు న్యాయం జరగట్లేదు

పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : కోట్లాది రూపాయలతో ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమం టీడీపీ జాతరను తలపిస్తోందని, అసలైన పేదలకు న్యాయం జరగడం లేదని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ విమర్శించారు.పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పింఛన్లు, రేషన్‌కార్డులు ఇప్పించేందుకు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందినంత వరకూ సొమ్ములు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రచారం కోసమే జన్మభూమి పేరుతో ప్రభుత్వం హడావిడీ చేస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని తెలిపారు.

పాలిటెక్నిక్ లెక్చరర్లకు పదోన్నతులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేదీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.తిరుపతి, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఆదోని, ఆదోని పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్లకు కేటగిరీల వారీగా పదోన్నతులు కల్పించారు.

దళితులను ఆదుకుంటాం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ సభ్యులు



విశాలాంధ్ర - రుద్రవరం(కర్నూలు) : మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో గ్రామ బహిష్కరణకు గురైన దళిత కుటుంబాలకు పూర్తి రక్షణ కల్పించి, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ సభ్యుడు నరహరి ప్రసాద్ గ్రామ దళితులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని నక్కలదిన్నే గ్రామాన్ని సందర్శించానన్నారు. ఈ సందర్భంగా డిసెంబర్ 31న గ్రామంలోని అగ్రవర్ణాలకు వెట్టిపనులు చేయడంలేదనే నెపంతో దళితులను బహిష్కరించారని, ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ బృందాన్ని పంపి గ్రామంలో విచారణ జరిపిందని వెల్లడించారు. పూర్వం నుంచి దళితులు అగ్రవర్ణాలకు వెట్టి పనులు చేసేవారని, గ్రామంలోని రెండు కుటుంబాలు వలన వెళ్లడంతో మరో రెండు కుటుంబాల వారు వెట్టి పనులు చేసేందుకు నిరాకరించారని, దీంతో గ్రామంలోని అగ్రవర్ణాలు 14 దళిత కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారన్నారు. దళితులు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, గ్రామ బహిష్కరణకు బాధ్యులైన 11 మందిని అదుపులోకి తీసుకున్నామని ఆయన వివరించారు. దళితులకు అన్ని సదుపాయాలను తక్షణమే కల్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సంఘటన వివరాలు నివేదికగా తయారు చేసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్‌కు అందజేస్తామన్నారు. ఆయన వెంట నంద్యాల ఆర్డీఓ రామసుందర్ రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ చక్రవర్తి, రుద్రవరం తహశీల్దార్ శివరాముడు, సీఐలు యుగంధర్ బాబు, దస్తగిరి బాబు, ఎస్సైలు హనుమంతయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా పనిచేసేవారికి సత్కారాలు

జన్మభూమిలో పవిత్ర సేవాభావంతో పాల్గొనాలి

టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జన్మభూమి-మా ఊరు కార్యక్రమం పవిత్ర యజ్ఞం వంటిదని, దీని విజయవంతం కోసం ఒకరికొకరు పోటీబడి పనిచేయాలని సీఎం చంద్రబాబు కోరారు. ఇప్పటివరకు జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని 4విడతలుగా నిర్వహించాం. ఐదో విడత కార్యక్రమాన్ని కూడా ఇదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. మంగళవారం తన నివాసం నుంచి 5వ విడత జన్మభూమి నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రాష్ట్రవ్యాప్తంగా 10రోజులపాటు 13వేల గ్రామాలు,3వేల వార్డులలో జన్మభూమి సభలు జరపాలి.ప్రతి ఆర్టీజి సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశాం. 175నోడల్ ఆఫీసర్లను నియమించాం.జన్మభూమిపై ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తాను. సమర్థంగా పనిచేసిన ఉద్యోగులు,స్వచ్ఛాంధ్ర సభ్యులకు అవార్డులు ఇచ్చి సత్కరిస్తాం" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. వార్డు,గ్రామ సభల్లో ముందుగా ప్రార్థన, సీఎం సందేశం,ప్రతిజ్ఞ,అజెండాపై చర్చ జరపాలని, ఫిర్యాదుల పరిష్కార నివేదిక చదివి వినిపించాలని, లబ్దిదారులకు పింఛన్లు,ఇతర ప్రయోజనాలను పంపిణీ చేయాలని సూచించారు. ఉచిత ఆరోగ్యశిబిరాలు, పశువైద్య శిబిరాలు అన్నింటినీ వరుసగా నిర్వహించాలన్నారు.గ్రామీణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను పండుగ వాతావరణంలో వేడుకగా జరపాలన్నారు. "ప్రజల భాగస్వామ్యం ఉంటే రియల్ టైమ్ వండర్స్ చేయవచ్చు. గ్రామ,వార్డు సభల్లో ప్రజలను భాగస్వాములను చేయాలి. గ్రామాభివృద్ధిలో ఎన్నారైలు పార్టనర్లుగా ముందుకు రావాలి. అభివృద్ధి, సంక్షేమంలో ప్రజా భాగస్వామ్యానికే పెద్దపీట వేస్తున్నామని ముఖ్య మంత్రి తెలిపారు. గ్రామీణ క్రీడల నిర్వహణకు ప్రతి జిల్లాకు రూ.3లక్షలు సప్లిమెంటరీ ఫండ్ ఇస్తున్నామంటూ వాటితోపాటు పంచాయితీ నిధులను కూడా అవసరాన్ని బట్టి వినియోగించాలన్నారు. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. సాధికార మిత్రల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామ,వార్డు సభల్లో సాధికారమిత్రలను పరిచయం చేయాలన్నారు. సంచార జాతుల్లో అర్హులైన అందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపం పూర్తిగా నివారించాలని సూచించారు. గ్రామాలు, వార్డులకు టెన్ స్టార్ రేటింగ్ ఇస్తాం. ప్రతిఇంటికి ఆత్మగౌరవమైన మరుగుదొడ్డి నిర్మాణం, ప్రతిఇంటికి విద్యుత్, వంటగ్యాస్, ఫైబర్ నెట్ కనెక్టివిటీ, మంచినీటి కనెక్షన్‌లు, ప్రతి గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్, ప్రతిగ్రామానికి రోడ్ కనెక్టివిటీతోపాటు, ప్రతి కుటుంబానికి నెలకు రూ.10వేలు కనీస ఆదాయం,ప్రతి పాఠశాలకు కనీస సదుపాయాలు, ప్రతి తల్లి, బిడ్డకు పోషకాహారం" తదితర 10అంశాలపై రేటింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి అయ్యన్న పాత్రుడు, ప్రణాళికాశాఖ ఉన్నతాధికారులు సంజయ్ గుప్తా, చలపతిరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలనా శాఖల కమిషనర్లు రామాంజనేయులు, కృష్ణమోహన్, అరుణ్ కుమార్,వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా బీఎస్ఎస్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్‌గా బీఎస్ఎస్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు నోటిఫికేషన్‌ను ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ కార్యదర్శి జి అనంతరాము జీవోను మంగళవారం విడుదల చేశారు. ఈ బోర్డులో సభ్యులుగా ఈశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, ఆరోగ్య,వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, పరిశ్రమలశాఖ కమిషనర్, రవాణాశాఖ కమిషనర్, ఏపీ పరిశ్రమల మౌలిక సదుపాయాల కార్పోరేషన్ వైస్ చైర్మన్, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వైస్ చైర్మన్లు వ్యవహరిస్తారు. ఇంకా స్థానిక సంస్థల నుంచి గద్దె అనురాధ, మల్లెల రాజశేఖర్ గౌడ్, అబ్దుల్ అజీజ్, ప్రసాదుల రామకృష్ణ, డాక్టర్ రంగసింహ చక్రవాకం సభ్యులుగా ఉంటారు. అలాగే నాన్-అఫీషియల్ సభ్యులుగా పరుచూరి కృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, జి ఆదెన్న, మెంబర్ కన్వీనర్‌గా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ కార్యదర్శి వ్యవహరిస్తారు. ఈ బోర్డు కాల వ్యవధి మూడు సంవత్సరాలు ఉంటుంది.

సంపాదకీయం

రజనీ రాజకీయాల్లో రాణించేనా!

తమిళ సినీ రంగం సూపర్‌స్టార్ రజనీకాంత్ రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరదింపుతూ ఆదివారం రాజకీయ రంగ ప్రవేశం ప్రకటన చేశారు. తెల్లని కుర్తా, ప్యాంటు ధరించిన రజనీ తమిళ సూపర్‌హిట్ చిత్రం 'కబాలి'లో పంచ్ డైలాగ్ "నాన్ వందత్తేను సొల్లు" (నేనొచ్చానని వాళ్లకి చెప్పండి) అని లక్షలాది తన అభిమానులకు ఆదివారం ప్రకటించాడు. అలా చేసిన మెగాస్టార్‌లలో ఆయనే ప్రథముడుకాదు. ఎంజీ. రామచంద్రన్, జె. జయలలిత, కెప్టెన్ విజయకాంత్ వంటివారు, ఇతరులు అనేక మంది వున్నారు. డీఎంకే మాజీ ముఖ్యంత్రులు సి.ఎన్. అన్నాదురై, ఎం. కరుణానిధి కూడా తమిళ చిత్ర జగత్తు నుండి వచ్చినవారే. తమిళ రాజకీయాలు ప్రత్యేకమైనవి. వారికి నచ్చిన వారికోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి కూడా తమిళ ప్రజలు వెనుకాడరు. గతంలో అలా జరిగిన ఉదాహరణలు కూడా వున్నాయి. వ్యక్తి ఆరాధన రాజకీయాలకు ఆలవాలమైన తమిళనాడు రాష్ట్రంలో గతంలో మాదిరిగా ప్రజలను ఆకర్షించే స్థాయి గల నాయకులు ప్రస్తుతం లేరన్నది వాస్తవం. జయలలిత మృతి, కళైనార్ కరుణానిధి రాజకీయ చిత్రంలో లేకపోవడంతో తమిళ రాజకీయ దృశ్యం గణనీయంగా మారిపోయింది. కానీ ఇప్పటికీ రాజకీయ క్రీడ పోటాపోటీగానే వుంది. ఆ విషయం రజనీకి కూడా తెలియంది కాదు. అందుకే ఆయన ఇటీవల "అంధకూపం గురించి తెలిసినందువల్ల రాజకీయాల్లోకి రావడానికి నేను సంశయిస్తున్నాను. రాజకీయాలకు నేను కొత్తేమీ కాదు. వాటి లోతు పాతులు నాకు తెలుసు. 1996 నుండి సన్నిహితంగా రాజకీయాలను గమనిస్తున్నాను. నేను రాజకీయాల్లోకి ప్రవేశిస్తే తప్పక విజయం సాధించవలసి వుంటుంది." అని కూడా అన్నాడు. ప్రజాకర్షక నాయకుడు లేకపోవడంవల్ల తమిళనాడులో రాజకీయ శూన్యత నెలకొన్న విషయం నిజం. అయితే, క్రింది స్థాయి నుండి నిర్మాణం లేకుండా, కార్యకర్తలు లేకుండా కేవలం సినీ అభిమానుల మీద ఆధారపడి రాజకీయాల్లో రజనీ రాణించగలడా అన్నదే ప్రశ్న. రజనీ తమిళనాడులో విప్లవం సృష్టిస్తాడని, 2021లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఆయన ముఖ్యమంత్రి అవుతాడని కొందరు విశ్వసిస్తుండగా, శివాజీ గణేశన్, అమితాబ్ బచ్చన్, చిరంజీవి, ఇతరుల మాదిరిగానే రజనీ కూడా చేతులు కాల్చుకుంటారని భావించేవారూ వున్నారు. 1996లో ఆయన వయస్సులో వుండి, ఆరోగ్యం కూడా బాగున్నప్పుడు పార్టీ పెట్టి చేసి పోటీ చేసి వుండి వున్నట్లయితే, ఆయన విజయం సాధించి, ముఖ్యమంత్రి అయ్యేవాడని కొందరు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రజనీ తాను రాజకీయాల్లోకి వస్తానని గతంలో చాలాసార్లు సూచించారు. అయితే బహుశా తన అభిమానుల ఒత్తిడి, బీజేపీ కూడా ఆయనను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని భావిస్తున్నందున ఆదివారం రజనీ తన నిర్ణయం ప్రకటించి వుండవచ్చు. ఆయన దార్శనీకత ఏమిటన్నది తలెత్తే రెండవ ప్రశ్న. దాని గురించి ఇప్పటి వరకు ఏమీ ప్రకటించలేదు. ఆయన ఒక అపరిచిత పదప్రయోగం చేశారు. - "జాది మధామ్ ఇల్లాధా అన్మిగ అరసియల్" (మతోన్మాదం లేదా కులత్వం లేని ఆధ్యాత్మిక రాజకీయాలు). ద్రవిడియన్ రాజకీయాల ఆధిపత్యం గల రాష్ట్రంలో మతం, ఆధ్యాత్మికతలను రజనీ అతిగా వక్కాణించారంటే బీజేపీ నుండి ఆయన దారి మళ్లుతున్నాడా అన్న ఆశ్చర్యాన్ని కలిగించింది. ద్రావిడ సైద్ధాంతానికి కాకపోయినట్లయితే, ఆయన దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. పట్టలిమక్కల్ కచ్చి వంటి అనేక కుల ఆధారిత పార్టీలతో తమిళనాడు అస్థిత్వ రాజకీయాలకు పేరెన్నికగన్నది. నిబద్ధత గల కార్యకర్తలు, చెరొక 30 శాతం ఓటు బ్యాంకుతో పాతుకుపోయిన పార్టీలు డీఎంకే, ఏఐడీఎంకేలు. మూడవది, అతి ముఖ్యమైనది 2021 శాసనసభ ఎన్నికల్లో మొత్తం 234 స్థానాల్లో పోటీ చేస్తానని రజనీ ప్రకటించడం. 2019లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలు తన లక్ష్యం కాదని కూడా ఆయన స్పష్టం చేశాడు. ఎన్నికలు కోట్లాది రూపాయల వ్యయభరితంగా మారిన ప్రస్తుత కాలంలో భారీగా నిధులు సమకూర్చుకున్న డీఎంకే, ఏఐడీఎంకేలకు వ్యతిరేకంగా పోటీ చేసేందుకుగాను తన పార్టీ నిర్వహణకు, ఎన్నికల కొరకు నిధులు సేకరించే సామర్థ్యం ఆయనకి వుందా? ఒకవేళ ఎన్నికలపొత్తు వుంటే బీజేపీ ఆయన్ని ఆదుకోవచ్చని భావిస్తున్నారు.

ఈ నెల 15న ఆయన కొత్తపార్టీని ప్రకటించనున్నారు. ఆ పార్టీలో ఏరకమైన ప్రజలు చేరతారన్నది నాల్గవ ప్రశ్న. రాజకీయాల్లో అనుభవంలేని మరో సూపర్‌స్టార్ కమల్‌హాసన్ మినహా ఆయనకు మద్దతు యివ్వనున్నట్లు విశ్వసనీయమైన ఏ రాజకీయనాయకుడు ఇప్పటివరకు కనీసం సూచన ప్రాయంగా కూడా వెల్లడించలేదు. రాజకీయాల్లో రాణించేందుకు సమర్థవంతమైన రాజకీయ రక్షకుల గ్రూపు అవసరం కూడా ఆయనకుంది. కానీ, ఇప్పటికి రజనీకి వున్నది అభిమానులు మాత్రమే. వాళ్లనికూడా నిర్దిష్టంగా నిర్మితం చేయవలసివుంటుంది. కార్యకర్తలను సమకూర్చుకోవాల్సివుంది. ఆఫీసులను నెలకొల్పుకోవాలి. అన్నింటికీమించి, మచ్చలేని అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం ప్రధానం. ఎన్నికల్లో భారీ విజయం సాధించినప్పటికీ తగినంతగాను, విశ్వసనీయ కొత్త ముఖాలను ఆకర్షించలేకపోయిన ఆమ్ ఆద్మీపార్టీ నుండి ఆయన గుణపాఠం నేర్చుకోవాలి. కీలకమైన సామాజిక, ఆర్థిక సమస్యలను ఆయన ఎంతమేరకు అవగాహన చేసుకున్నారన్నది ఐదవప్రశ్న. ఆర్థిక, విదేశాంగ విధానంపై ఆయన అభిప్రాయలేమిటో ఎవరికీ తెలియదు. ఓట్లు రాబట్టుకొనేందుకు ఆయన నూతన వ్యూహం ఏమిటో కూడా ఆయన వెల్లడించలేదు. ఆయనకు పరిపాలనా సామర్థ్యం ఏమేరకు వుందో తెలియనిది. అందుచేత, పాలనాపరమైన సవాళ్లను ఆయన ఏ ప్రాతిపదికన అధిగమించగలరని ఎవరైనా ఏ విధంగా భావించగలరు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గత రెండు దశాబ్దాలుగా చేసిన విధంగా రజనీకి ఒక మంచి బృందాన్ని కనుగొనవలసివుంటుంది. "మూడేళ్లలో యిచ్చిన హామీలను నెరవేర్చకపోతే మేము రాజీనామా చేస్తాము" అనికూడా రజనీ ప్రకటించాడు. అది ఆచరణ సాధ్యమైనా అన్న సందేహం కూడా లేకపోలేదు. రజనీకి విపరీతంగా ప్రజల్ని రాబట్టే సామర్థ్యమైతేవుందిగానీ, దాన్ని ఓట్లుగా ఆయన మలుచుకోగలడా అన్నది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎంజీఆర్, జయలలితల్లాగా రజనీ విజయ సాధకుడు అవుతాడోలేదో వేచి చూడవలసిందే.

చురక

నిరంతర విద్యుత్తులతో
నిజం తెలంగాణ వెలుగు
రైతు పంట రేటు రాక
రక్షణ లేకుండ నలుగు

బావులన్నీ జలం లేక
బావురుమంటున్న నేడు
ఉచిత కరెంటెంతిచ్చిన
ఉపయోగం లేని మోడు

- వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

ఇరాన్‌పై మొసలి కన్నీరు


బుడ్డిగ జమిందార్

ఇరాన్‌లోని అనేక నగరాల్లో ప్రజా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఉద్యోగాలు కావాలి, ధరలు తగ్గించాలి అంటూ ఆందోళనకారులు గళమెత్తుతున్నారు. కొన్నిచోట్ల ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ప్రదర్శనకారులపై కాల్పులు జరిపింది. ఇప్పటివరకూ కాల్పుల్లో 22 మంది మరణించినట్లు సమాచారం. గడచిన మూడు సంవత్సరాల్లో నిరుద్యోగం 12.7 శాతానికి చేరుకొని కనిష్ఠస్థానంలో ఉందని ప్రపంచబ్యాంకు వెల్లడించింది. ద్రవ్యోల్బణం 10 శాతానికిపైగా ఉన్నట్లు ఇరాన్ సెంట్రల్ బ్యాంకు, టెహ్రాన్ టైమ్స్ పత్రిక వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. జర్మనీకి చెందిన అద్నాన్ టేబాట్‌బాయ్ ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, దేశాల సహకార సంబంధాల నిపుణుడుగా పరిశోధనలు జరుపుతున్నారు. తను ఒక ప్రకటన చేస్తూ 'ప్రస్తుత ప్రదర్శనలకు మూలకారణం సాంఘిక ఆర్థికపరమైన అంశాలు, వీటిల్లో రాజకీయ వాంఛలులేవు' అని అన్నారు. అల్‌జజీరా న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టెహ్రాన్ యూనివర్శిటీ ప్రొఫెసరు మహమ్మద్ మరాండీ 'ఇరాన్ ప్రజలు ప్రభుత్వ లోపభూయిష్ట పాలనతో విసుగుచెందారు, పనులు జరగనీయకుండా అమెరికా, మిత్రదేశాలు అడ్డుకొంటున్నాయి' అని వెల్లడించారు. దేశంలో ఆర్థిక సమస్యలున్నాయని యూఎస్, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్, యూకేలతో 2015లో జరిగిన అణు ఒప్పందం తర్వాత దేశంలో ఆర్థిక సమస్యల నుండి బయటకు పడతామని ఆశించారని కానీ ఇప్పటి వరకూ ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలు రద్దుకానీయటం లేదని, ట్రంప్ ఆంక్షలను కొనసాగిస్తున్నాడని, అణు ఒప్పందాన్ని అమలు కానీయటంలేదని ప్రొఫెసర్ మహమ్మద్ మరాండీ అంటున్నారు. ప్రదర్శనకారులు న్యాయసమ్మతమైన ఆర్థిక డిమాండ్లతో ఆందోళన చేస్తుండగా, వీరిలో అక్కడక్కడ కొంతమంది విదేశాంగ విధాన మార్పులపై ఒంటరిగా అరుస్తుండటం కనబడుతున్నదని అంటున్నారాయన. వీరి గొంతుకతో ప్రజల గొంతుక కలవటంలేదని అంటున్నారు. బ్రిటీషు ప్రభుత్వం నడుపుతున్న 'బీబీసీ పర్షియన్ న్యూస్ ఛానల్', అమెరికా ప్రభుత్వానికి చెందిన 'వాయిస్ ఆఫ్ అమెరికా' సంస్థలు, పశ్చిమదేశాల మీడియా ఏజన్సీలు వెస్ట్ నుండి ఆర్థిక సహాయం పొందుతున్న అనేక ఏజన్సీలు, సంస్థలు, క్లబ్‌లు ఇరాన్‌లోని ప్రదర్శనల వ్యాప్తికి పాల్పడుతున్నాయని టెహ్రాన్ ప్రొఫెసరు విశ్లేషిస్తున్నారు. 2009 అధ్యక్ష ఎన్నికల్లో అవకత వకలు జరిగాయని అప్పట్లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కంటే ఎక్కువగా జరుగు తున్నాయని వార్తాసాధనాలు తెలుపుతున్నాయి. దేశంలోని అశాంతులకు, మరణాలకు శత్రుదేశాలే కారణమని ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా కమేని అంటూ మొదటిసారిగా జనవరి2న ప్రకటించారు. "గడిచిన రోజుల్లో ఇరాన్ దేశ శత్రువులు ఇస్లామిక్ రిపబ్లిక్‌ను అస్థిరపరచడానికి ధనం, ఆయుధాలు, రాజకీయ ఎత్తుగడలు, ఇంటిలిజెన్స్ సర్వీసులను వాడుతు న్నారు" అని కమేనీ అధికారిక వెబ్‌సైట్ తెలిపింది.


నిరసనప్రదర్శకులు

ప్రజాస్వామ్యంలో ప్రజలు నిరసన తెలియజేసే హక్కు, ప్రదర్శనలు చేసే హక్కు కల్గి ఉంటారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తారు. ఇది వారి అంతరంగిక వ్యవహారం. ఈ హక్కులను ఆసరాగా తీసుకొని ఆందోళనకారుల్ని రెచ్చగొట్టేవిధంగా విదేశీ ప్రభుత్వాలు వారికి అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వాలు స్థాపనకోసం కృషి చేయటం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం దీనికి ఊపిరిపోసి రెచ్చగొట్టి ఆర్థిక సహాయం చేయటం ప్రపంచంలోని అనేక దేశాల్లో మనం చూస్తున్నాం. వెంటనే మానవ హక్కులకు భంగం కల్గుతుందని మేం చూస్తూ ఊరకోమని ప్రకటనలు గుప్పిస్తారు. ప్రభుత్వాల్ని పడగొడ్తుంటారు. అవసరమైతే సైనిక జోక్యం కూడా చేస్తుంటారు. అలనాడు 1950వ దశకంలో కొరియా నుండి 2014లో ఉక్రెయిన్‌ల మీదుగా నేటి ఇరాన్ వరకూ చరిత్రలో మనం అనేకం చదివాం, చూశాం. ఉన్నట్టుండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మానవ హక్కులు గుర్తుకొచ్చాయి. తన దేశంలోని నిరుద్యోగం, పేదరికం, వాల్‌స్ట్రీట్ ఉద్యమం తనకేమీ పట్టవు. యుద్ధాలకోసం, కార్పొరేట్ల లాభాలకోసం అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు, ఖర్చులు దేశ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్నాయనే విషయం తనకు తెలియంది కాదు. ఇరాన్ విషయానికి వచ్చేసరికి వెంటనే స్పందించి 'ఇరాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘనను చూస్తున్నాం, టెహ్రాన్ టెర్రరిజం కోసం వెచ్చిస్తున్న నిధులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు స్పందిస్తున్నారు' అని ట్వీట్ చేశారు. దీనికి ప్రతిస్పందించిన ప్రెసిడెంట్ రౌహానీ 'ఈ పెద్ద మనిషికి మా జాతి ప్రజలపై ఎనలేని సానుభూతి వచ్చింది. కానీ ఇదే పెద్దమనిషి కొన్ని నెలల క్రితమే మా జాతిని టెర్రరిస్టు జాతిగా వర్ణించిన విషయాన్ని మర్చిపోయాడనుకొంటాను' అని ట్రంప్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ట్వీట్ చేశాడు. నెత్తినుండి కాలిగోరు వరకూ అణువణువునా ఇరాన్ వ్యతిరేకైన ట్రంప్‌కు మా జాతిపై జాలిపడే హక్కు ఏకోశానాలేదని రౌహాని అన్నారు. టెర్రరిజాన్ని నిర్మూలించటానికే మేము పుట్టామని గొప్పలు చెప్పుకుంటున్న అమెరికా టెర్రరిజం పుట్టుకకు మూలకారణమనే విషయాన్ని ప్రపంచ ప్రజలు మర్చిపోరు. ఇటీవల రష్యా ఒక ప్రకటన చేస్తూ సిరియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా టెర్రరిజాన్ని పెంచి పోషించింది అమెరికానే అని ప్రకటించింది. తనదగ్గర ఆధారాలున్నట్లు వెల్లడించింది. యూఎస్ భూభాగమైన పోర్టోరికో దీవిలో నెలల క్రితం వచ్చిన హరికాన్ కారణంగా నేటికీ అక్కడ విద్యుత్తు లేక లక్షలాది మంది జనం అల్లాడిపోతున్నారు. ఇక్కడ అమెరికాకు మానవ హక్కులు కనబడటం లేదు. యూఎస్ అమెరికాలు చమురుపై ఆధిపత్యం కోసం యెమెన్‌పై చేస్తున్న యుద్ధం వలన వందలాది చిన్నారులు మరణిస్తున్నారు, 10 లక్షల మందికి కలరా సోకింది. త్రాగునీరు, వైద్య సదుపాయాలు లేవు. వీటన్నింటికీ కారణమైన అమెరికాకు, ట్రంప్‌కు మానవహక్కులు కనబడటంలేదు. అరబ్ దేశాలపై యుద్ధాల వల్ల కోట్లాదిమంది శరణార్థులకు కారణమైన అమెరికాకు అక్కడ మానవ హక్కులు జ్ఞాపకం రావు. ఎందుకంటే మానవ హక్కులకంటే అక్కడ చమురుపై ఆధిపత్యం ముఖ్యం గనుక, ప్రస్తుతం ఇరాన్‌లో మొసలి కన్నీరు కారుస్తూ కొంగజపం చేస్తున్నాడు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్.

ఇదిలావుండగా ఇరాన్‌లోని అంతర్గత వ్యవహారాలపై బయటి జోక్యాలను సహించబోమని రష్యా విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇరాన్‌లో అహింస, రక్తపాతానికి దూరంగా నిరసనలు ఉండాలని కూడా కోరింది. ఇరాన్‌ను బలహీనపర్చడం ద్వారా మధ్యప్రాశ్చ్యంలో ముడిచమురు దోపిడీ ఆధిపత్యానికి సులభమవ్వడం ఒక భాగంకాగా, షియా ముస్లింలను సౌదీ సున్నీ ముస్లింల ద్వారా అణగతొక్కటం మరొక వ్యూహం. ఈ క్రమంలో పాలస్తీనా సమస్యను తెరమరుగుగావించి పాలస్తీనా భూభాగాన్నంతా ఇజ్రాయిల్‌కు కట్టబెట్టడం మూడవ వ్యూహం. ఇరాన్‌ను బలహీనపర్చడం ద్వారా మధ్యధరా సముద్రానికి తూర్పున భూభాగమంతా ఇండియా వరకూ, అటు యూరోఆసియా దేశాల వరకు తమ గుప్పిట్లో తెచ్చుకుని చమురు ఆసియాను కైవసం చేసుకోవడమే సామ్రాజ్యవాదం నాల్గవ అంతిమ లక్ష్యం.

విశ్లేషణ

ఊసరవెల్లి రాజకీయాల్లో మోడీ దిట్ట

ఎం.సి. వెంకటేశ్వర్లు

గుజరాత్‌లో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోటానికి బీజేపీ ప్రత్యేకంగా ప్రధాని నరేంద్రమోడీ అనుసరించిన విధానం 2019లో లోక్‌సభకు జరిగే ఎన్నికల ముఖచిత్రాన్ని రేఖామాత్రంగా వివరించింది. అధికార దాహం తీర్చుకోవడానికి ఏ స్థాయికైనా దిగజారగలనని తనకు తాను నిరూపించుకున్నాడు. బీజేపీకి, కాంగ్రెస్‌కు, ఇతర ప్రాంతీయ బూర్జువా రాజకీయ పార్టీలకు తేడా ఏమి ఉండదని, అన్నీ ఒక తానులో ముక్కలేనని చెప్పకనే చెప్పాడు.

ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా అవి మినీ సాధారణ ఎన్నికలుగా, 2019 ఎన్నికలకు డ్రస్ రిహార్సల్స్‌గా వర్ణించడం, ప్రజలను మానసికంగా సిద్ధం చేయడం మీడియాకు, అధికార బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పరిపాటిగా మారింది. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేదరికం, అవినీతి కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ, యూపీఏ పాలన ప్రధాన కారణమన్న భావజాలాన్ని నిరంతరం ప్రచారం చేయటం ద్వారా ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించడమే నరేంద్రమోడీ ప్రధాన ఎజెండా. విదేశాలలో బడా పెట్టుబడిదారులు దాచుకున్న నల్లడబ్బును బయటకు తీసి ప్రజల బ్యాంకు ఖాతాల్లో వేస్తానని, సంవత్సరానికి యువతకు 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, రైతులకు 2022 నాటికి రెట్టింపు ఆదాయం చూపిస్తానని, అవినీతిరహిత భారత్ నిర్మాణమే తన లక్ష్యమని మోడీ 2014 ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు నీటి మూటలని మూడున్నర సంవత్సరాలపాలన రుజువు చేసింది. క్రమంగా మోడీపై భ్రమలు తొలుగుతున్నాయని గుజరాత్ ఎన్నికలు స్పష్టమైన సంకేతమిచ్చాయి.

మోడీ ఆకర్షణ, అభివృద్ధి ఎజెండా, వాక్చాతుర్యం, గుజరాత్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సునాయసమనుకున్న బీజేపీ శ్రేణుల భ్రమలు పటాపంచలయ్యాయి. కాంగ్రెస్ ముక్తభారత్ నినాదానికి గండిపడింది. బీజేపీ అధ్యక్షుడు పార్టీ శ్రేణులకు 150 సీట్లు లక్ష్యాన్ని నిర్దేశించినా 99తో సరిపెట్టుకోవలసి వచ్చింది. గెలుపుకు ఎదురేలేదనుకున్న ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ద్వయం రాజకీయ విలువలకు స్వస్తి చెప్పి, ఎన్నికల నిబంధనలను గాలికొదిలి, భిన్నత్వంలో ఏకత్వ భావనను పణంగా పెట్టి ముస్లిం వ్యతిరేక, గుజరాత్ ఆత్మగౌరవం, భావోద్రేకాలను రెచ్చగొట్టి బొటాబొటి మెజారిటీ సీట్లు గెలవవలసిన దుస్థితి ఏర్పడింది. ప్రధానమంత్రి స్థాయిని దిగజార్చి నేను మీ వాడిని, గెలిపించమని ప్రచారం చేసుకున్న ప్రధానిగా మోడీ చరిత్రలో నిలిచిపోయాడు.



గుజరాత్ ముఖ్యమంత్రిగా 2012లో మోడీ గెలుపొందిన నాటికి, నేటికి రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టడం, 2014 ఎన్నికల వాగ్దానాల వైఫల్యంతో మోడీ ప్రాభవం తగ్గింది. దేశ, విదేశాల్లో గర్వకారణంగా, దేశానికి నమూనాగా చెప్పుకున్న గుజరాత్ అభివృద్ధి మిథ్య అని తేలింది. బీజేపీ 22 సంవత్సరాల పాలనకు ప్రజా వ్యతిరేకత, హార్థిక పటేల్ నాయకత్వాన పాటీదార్ల రిజర్వేషన్ల ఉద్యమం, దళితులపై హిందూత్వ శక్తుల దాడులకు వ్యతిరేకంగా జిగ్నేష్ మేవాని నాయకత్వాన జరుగుతున్న దళిత ఉద్యమం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అల్పేష్ ఠాకూర్ నాయకత్వాన జరుగుతున్న ఓబీసీల ఉద్యమ రూపంలో వ్యక్తమైంది. ప్రధాని, ఆర్థిక శాఖా మంత్రి ఎంత బుకాయించినా పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు నిర్ణయాలు వ్యవసాయాన్ని, అసంఘటిత రంగాన్ని దెబ్బతీశాయి. చిన్న, మధ్య పరిశ్రమలు తీవ్ర నష్టాల పాలయ్యాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గండిపడింది. జీఎస్టీకి వ్యతిరేకంగా దేశంలో ఎక్కడా జరగనంత స్థాయిలో గుజరాత్‌లో దీర్ఘకాలం ఉద్యమం నడిచింది. అటు గుజరాత్, ఇటు దేశ ప్రజల్లో బీజేపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్న మాట వాస్తవం. ఊసరవెల్లి రాజకీయాలు నడపడంలో మోడీ దిట్ట. కాంగ్రెస్ నాయకులకు ఏమాత్రం తీసిపోరు. అవినీతి వ్యతిరేక పోరు, అభివృద్ధి మంత్రం ప్రజలు విశ్వసించరని పసికట్టిన ప్రధాని గుజరాత్ ఎన్నికల్లో ముస్లిం వ్యతిరేక విద్వేషాన్ని రెచ్చగొట్టడంతోపాటు, పాకిస్థాన్ బూచి చూపి ఓట్లు అడుక్కునే దుస్థితికి దిగజారాడు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌తో కలసి కుట్రలకు పాల్పడుతున్నాయని, తనను అంతం చేయడానికి కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ పాకిస్థాన్ వెళ్లి సుఫారి చెల్లించి వచ్చాడని, గుజరాత్‌కు ముస్లిం ముఖ్యమంత్రిగా అహమ్మద్ పటేల్‌ను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని నిరాధార, అసంబద్ధ, అసత్య ప్రచారాలకు పూనుకొని దేశానికి తలవంపులు తెచ్చాడు. అధికారం కోసం పాకిస్థాన్ రాజకీయ నాయకులు, సైనికాధికారులు భారత వ్యతిరేక భావోద్వేగాలను రెచ్చగొట్టడం సహజం. కాని గతంలో ఇందిరా గాంధీ ప్రతి విషయానికి విదేశీ భూతాన్ని చూపేది. నేడు మోడీ అదే తరహాలో పాకిస్థాన్ భూతాన్ని చూపడం జుగుప్స కలిగిస్తున్నది.

గుజరాత్ ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడారన్న దానికంటే జరిగిన ప్రచార సరళి గమనించినట్లయితే 2019 ఎన్నికల్లో ముస్లింలకు వ్యతిరేకంగా, హిందూ మత ఆధిపత్యవాద భావోద్రేకాలను రెచ్చగొట్టే సూచనలు స్పష్టంగా కనబడుతున్నాయి. ఐదు రోజులపాటు త్రిపుర పర్యటనకు వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగత్ ఆ రాష్ట్ర రాజధానిలోని స్వామి వివేకానంద మైదాన్‌లో మాట్లాడుతూ భారతదేశంలో నివసిస్తున్న వారంతా హిందువులేనని, భారతదేశం హిందూవులదని, హిందూత్వమంటే అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేయడమేనని ప్రకటన చేశాడు. సుమారు 20 కోట్ల మంది ముస్లింలు, 3 కోట్ల మంది బౌద్ధులు, జైనులున్న ఈ దేశం హిందూదేశమనటం భావ్యమా? వీరంతా హిందూ సంస్కృతి, సాంప్రదాయాలు అనుసరించడం సాధ్యమా? బహుళ మతాలు, కులాలు భాషలు, సంస్కృతులున్న మన దేశంలో హిందూత్వ ఆధిపత్యాన్ని నెలకొల్పటమంటే హిందూయేతర ప్రజలు ప్రత్యేకించి ముస్లింలపై హత్యాకాండ జరపడమేనన్నది నగ్న సత్యం. బీజేపీ ప్రభుత్వం, ఆరెస్సెస్ అల్ప సంఖ్యాకులకు, మతస్థులకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలను రెచ్చగొట్టి, రాబోవు ఎన్నికల్లో హిందూవుల ఓట్లను గంపగుత్తగ కొల్లగొట్టాలన్న ఆలోచన ప్రమాదకరం అనటంలో ఎలాంటి సందేహం లేదు. మోడీ ప్రచారం, మోహన్ భగత్ ప్రకటన కాకతాళీయంగా జరిగినవి కావు. పథకం ప్రకారం హిందూత్వ ఎజెండాను అమలు జరపటానికి చేస్తున్న ప్రయత్నాలు.

మోడీ ఇప్పటికే 2018-19 హిందూత్వ ఎజెండాను సిద్ధం చేశాడు. ముస్లిం మహిళల చట్ట సవరణ (1986). రామజన్మభూమి సమస్యలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. విడాకులు పొందిన మహిళకు రక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సవరణ చాలా సున్నితమైనది. ముస్లిం సాంప్రదాయం ప్రకారం మూడు తలాక్‌లు ఇచ్చి విడాకులు పొందుతున్నారు. అది దుర్వినియోగమవుతున్నమాట వాస్తవమే. కాని దీనిపై ముస్లింలలో చర్చ జరగాలి. కాని ఒకేసారి మూడు తలాక్‌లివ్వడం నేరంగా భావించి మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించే చట్ట సవరణ, చేయడం బీజేపీ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయం. రాజకీయ ప్రయోజనాలతో కూడుకున్నది. దీనిని ముస్లింలు వ్యతిరేకించగా, హిందువులు అభినందిస్తారు.

కాని ఇది రాజకీయంగా పార్లమెంటులో బలపరచడానికి ప్రతిపక్ష పార్టీలకు ఇబ్బందిని కలుగజేస్తుంది. బలపరిస్తే ముస్లింలను వ్యతిరేకించినట్లవుతుంది. వ్యతిరేకిస్తే ముస్లింలను బలపరిచినట్లవుతుంది. బీజేపీకి ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రం కానున్నది. రామజన్మభూమి విషయం కూడా ప్రతిపక్ష పార్టీలకు సంకట స్థితి కానున్నది. గుజరాత్ ఎన్నికల్లో రామజన్మభూమి సమస్యను 2019 ఎన్నికల అయ్యేంతవరకు విచారణ చేపట్టవద్దని ముస్లింల తరపు న్యాయవాది కపిల్ సిబాల్ (కాంగ్రెస్ నాయకుడు కూడా) ఎందుకు అడిగాడని మోడీ ప్రశ్నించి కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టాడు. అదే పరిస్థితి పునరావృతం కానున్నది. బాబ్రీ మసీదు కేసును ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుండి సుప్రీం కోర్టు ప్రతిరోజు విచారించనున్నది. సెప్టెంబరు, అక్టోబరు నాటికి తీర్పు వచ్చినా ఆశ్చర్యపోవలసింది ఏమీలేదు. కాని సుమారు ఎనిమిది మాసాలపాటు లౌకికవాదం, హిందూత్వవాదం మధ్య, విశ్వాసం, హేతుబద్ధతపై పెద్దఎత్తున చర్చలు జరిగే అవకాశమున్నది. అప్పటికి 2019 లోక్‌సభ ఎన్నికల వాతావరణం వస్తుంది. ప్రజల్లో వున్న మూఢవిశ్వాసాలను సొమ్ము చేసుకొని హిందూవుల భావోద్రేకాలను రెచ్చగొట్టి అత్యధిక ప్రజానీకాన్ని బీజేపీకి అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం ముమ్మరంగా చేస్తుంది. ఒకవేళ తీర్పు అనుకూలంగా వస్తే 30 సంవత్సరాలుగా బీజేపీ పోరాటం చేసి సాధించిందని ప్రచారం చేసుకుంటుంది. లేక వ్యతిరేకంగా వస్తే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ కట్టబెడితే మసీదును కట్టకుండా చట్టాన్ని తీసుకురాగలమని ప్రజలకు హామీ ఇస్తుంది. మతంతోపాటు కుల రాజకీయాలను కూడా వాడుకోడానికి మోడీ తగిన ప్రణాళికలు తయారు చేసుకున్నాడు. అనేక రాష్ట్రాలలో రిజర్వేషన్లపై జరుగుతున్న ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని ప్రధాన కులాలు, ఉపకులాల మధ్య విభజన తీసుకువచ్చి లబ్ధి పొందడానికి ఓబీసీ కులాలలో ఉపకులాల వర్గీకరణకు ఇప్పటికే కమిటీని నియమించారు. ఓబీసీలను మూడు వర్గీకరణలుగా విభజించి విద్య, ఉద్యోగాలలో ప్రతి ఉపకుల వర్గీకరణకు 27 శాతం రిజర్వేషన్ కల్పించటానికి ప్రయాత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ ఫిబ్రవరి నాటికి పూర్తి కానున్నది. దాంతోపాటు జాతీయ స్థాయిలో వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. రాజ్యసభ సవరణలు చేసింది. రిజర్వేషన్ల విధానంపై 2019 నాటికి మోడీ ఒక విధానం ప్రకటించే అవకాశం లేకపోలేదు.

గుజరాత్ ఎన్నికల అనుభవాలను పరిశీలించినట్లయితే 2019 ఎన్నికల్లో మోడీ రాజకీయ ఎత్తుగడలను ఎదుర్కోడానికి వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉన్నది. 2019 ఎన్నికల్లో గెలవడానికి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంతోపాటు, సమాజంలో ప్రజలను విడగొట్టడానికి కులతత్వాన్ని రెచ్చగొట్టం లేదా ప్రధాన కులానికి వ్యతిరేకంగా ఉపకులాలను రెచ్చగొట్టే సోషల్ ఇంజినీరింగ్ ఎత్తుగడలు అవలంబిస్తాడని యూపీ, గుజరాత్ ఎన్నికలు తెలుపుతున్నాయి. ఎంతకు దిగజార మన్నది కాదు. గెలిచామా లేదా అన్నది మోడీ, అమిత్‌షాల రాజకీయం. కాని వారెన్ని కుతంత్రాలు, కుయుక్తులు పన్నినా గత ఎన్నికల హామీల వైఫల్యం, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ దుష్ఫలితాలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని వెంటాడుతుంటాయి. రాబోయే 18 మాసాలలో మందగించిన ఆర్థికాభివృద్ధి పెరిగే అవకాశం లేదు. అందు వలన వామపక్ష, ప్రజాస్వామిక పార్టీలు, శక్తులు, వ్యక్తులు సమైక్యంగా ఎన్నికల పోరులో దిగాలి. ఆర్థిక, పాలనా వైఫల్యాలు, అవినీతిపై ప్రజలను ఒప్పించే స్థాయిలో విస్తృత ప్రచారం జరగాలి. హిందూత్వ శక్తుల ప్రమాదాన్ని ఎండగట్టాలి. ఇప్పటి నుండే ఐక్యంగా పోరాడితే మోడీని ఓడించే అవకాశాలు లేకపోలేదు.

విశాలాంధ్ర

బతుకు
The Life

బుధవారం
03 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

ప్రసిద్ధ రచయిత టాల్‌స్టాయ్ ప్రజల ధిక్కారం, అహింస అనే విషయాలపై ఒక రచనలో చర్చిస్తూ ఇలా అంటారు. "దేశభక్తి పేరిట చెలామణీ అయ్యే విధానాలను సూటిగా, స్పష్టంగా అర్థం చేసుకుంటే అవన్నీ పాలకుల ప్రయోజనాలను నెరవేర్చటానికీ, పాలిత ప్రజల్లో చైతన్యాన్నీ, హేతుబద్ధతనూ, మానవ హోదాను కుదించివేసి, వాళ్ళను మరింత బానిసత్వంలోకి నెట్టడానికీ ఉపయోగపడుతున్నాం తెలుస్తుంది. వ్యవస్థీకృతమైన సామాజిక సూత్రాలనూ, పీడిత స్వభావం గల రాజ్యయంత్రాంగాలనూ ధిక్కరించి నూతన సమాజానికి దారులు తీసే నిబద్ధత గల స్త్రీపురుషులు మానవ చరిత్రలో అతి అరుదుగా కనబడతారు."....ఇలాంటి అరుదైన వ్యక్తులే జ్యోతిరావుబా పూలే, సావిత్రీభాయి పూలే దంపతులు. ఈ ఇద్దరూ సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తులు. ఈ ఇద్దరూ మహోన్నతమైన లక్ష్యాల సాధన కోసం కృషి చేశారు. ఆమెలో భూదేవి అంత సహనం కనిపిస్తుంది. ఆమె త్యాగానికి, ధైర్యానికి, పట్టుదలకి ప్రతీక. ఆమే క్రాంతి జ్యోతి సావిత్రీభాయి పూలే. ప్రజలు ఆమెను క్రాంతి జ్యోతి సావిత్రీబాయి అని పిలుచుకుంటున్నారంటే ఆ పిలుపులో ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు. నేడు (జనవరి 3) ఆమె జయంతి సందర్భంగా .....

సామాజిక విప్లవకారిణి

సావిత్రిబాయి పూలే!



అది 1851వ సంవత్సరం. ఆరోజున పూనేలో బాలికల కోసం కులాల ప్రసక్తి లేని ఒక పాఠశాల ప్రారంభమవుతోంది. తలపై ముసుగు ధరించిన ఓ యువతి ఆ బడిలో పాఠాలు చెప్పటానికి వడివడిగా నడిచి వెళ్తోంది. ఆమెను చూసిన ఒక బ్రాహ్మణ స్త్రీ ఆగ్రహంతో "ఏం చేయబోతోందీవిడ! అసలిదేం పని? మన మతానికీ, ఆడజాతికీ కూడా కళంకం తెచ్చే పని!" అంటూ కేకలు పెట్టింది. ఆమెతో ఉన్నవాళ్ళందరూ ఆ యువతి మీద పేడముద్దలు విసిరారు. ఆ యువతే జ్యోతిబా పూలే భార్య సావిత్రీబాయి. ఇంత జరిగినా ఆమె అలాగే నిర్భయంగా నడిచి వెళ్ళింది. ఆమె ముందు మహోన్నతమైన ఒక లక్ష్యమున్నది. శతాబ్ధాలుగా అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న బాలికలకు, ముఖ్యంగా కింది కులాల బాలికలకు విజ్ఞానాన్ని పంచటమే ఆమె లక్ష్యం. భర్త ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె విద్యావంతురాలైంది. తన భార్య విద్యావంతురాలయ్యాక కేవలం తమ కుటుంబానికే ఆమె జ్ఞానం పరిమితం కారాదనీ, ప్రజలందరికీ విద్యనందించగల వ్యక్తిగా ఆమె రూపొందాలనీ ఆయన ఆశించారు. ఆ ఆశను నెరవేర్చటమే ఇప్పుడామె ముందున్న కర్తవ్యం. తన లక్ష్య సాధన కోసం ఎన్ని ఇబ్బందులనైనా ఎదిరించటానికి ఆమె సిద్ధంగా ఉంది. ఛాందసవాదుల దూషణలనూ, వేధింపులనూ నిర్భయంగా ఎదుర్కోవటానికి నిశ్చయించుకుంది. ఈ సంఘటన బాగా ప్రాచుర్యం పొందింది. జనం దీన్ని రకరకాలుగా వర్ణించి చెప్పుకున్నారు. కొందరు మగవాళ్ళు ఆమె వెంటబడి వేధిస్తూ రాళ్ళతో కొట్టేవారట. ఈ ఇబ్బందిని చూసి ఆమె భర్త జ్యోతిరావు ఒక సలహా చెప్పారట. బడికి వెళ్ళేటప్పుడు పాతచీర కట్టుకుని వెళ్ళి దుమ్మూ, మురికి పడిన ఆ చీరను పాఠశాలలో మార్చుకుని, మరొకటి కట్టుకుంటుండమనీ, మళ్ళీ ఇంటికొచ్చేటప్పుడు అదే పాతచీర ధరించి రావచ్చని చెప్పారాయన. ఆమె అలాగే చేసింది. ఇలాంటి కఠినమైన పరిస్థితుల్ని ఎదుర్కొని నిలబడింది సావిత్రిబాయి.

పశ్చిమ మహారాష్ట్రలోని నయ్‌గావ్ అనే గ్రామంలోని రైతు కుటుంబంలో 1831 జనవరి 3వ తేదీన జన్మించారు సావిత్రీబాయి. ఆనాటి సంప్రదాయం ప్రకారం తొమ్మిదో ఏటనే ఆమెకు జ్యోతిరావుతో వివాహమైంది. ఆనాటి నుంచి జీవితాంతం వరకూ ఆమె ఆయనకు తోడునీడగా సాహచర్యం చేసింది. ఆయన ప్రోత్సాహంతోనే ఆమె విద్యావంతురాలైంది. ఆయన కుటుంబ సభ్యులు ఇందుకు అభ్యంతరం చెప్పటంతో ఆ భార్యాభర్తలిద్దరూ వేరుగా కాపురం పెట్టాల్సి వచ్చింది. ఛాందసవాదుల దూషణలూ, వేధింపులను ఎదిరించి నిలబడ్డారు సావిత్రీబాయి పూలే. తన లక్ష్య సాధన కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెనకాడలేదు. అన్నింటినీ తట్టుకుని ధైర్యంగా నిలబడ్డారు. ఆమె నిబ్బరం, నిర్భయం, సాహసం ఆనాటికి అద్భుతం, ఆశ్చర్యమే.

భర్త ప్రోత్సాహంతో విద్యావంతురాలైన సావిత్రీబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయినిగా, నాయకురాలిగా ఎదిగారు. 1849లో జ్యోతిబా పూలే స్థాపించిన ఐదు పాఠశాలల నిర్వహణలో భాగం పంచుకున్నారు. బాలికల పాఠశాల ప్రారంభించాలని తలపెట్టినప్పుడు అందులో ఉపాధ్యాయినిగా పనిచేసే అర్హత కోసం ఫాతిమా షేక్ అనే ఓ ముస్లిం యువతితో కలిసి ఉపాధ్యాయ శిక్షణ పొందారు. పూనేలోని తొలి బాలికా పాఠశాలకు సావిత్రీభాయి పూలే ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. ఈ పాఠశాలను నిర్వహిస్తున్నందుకు అన్ని సామాజిక వర్గాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. ఈ నేపథ్యంలోనే పూలే దంపతులను గృహ బహిష్కారం చేశారు. అయినా సమస్యకు ఎదురీదుతూ ముందుకు సాగారు ఈ భార్యాభర్తలు. ఈ బడిలో ఎన్నో కులాల బాలికలు కలిసి చదువుకున్నారు. వాళ్ళలో ఒక దళిత బాలిక (మాతంగ కులానికి చెందినది) రాసిన ఒక వ్యాసం ఎంతో ప్రసిద్ధి పొందింది. చదువు ప్రాముఖ్యతను గురించి తనకు కలిగిన అవగాహనను ఆ బాలిక ఇలా రాసింది.

"సజీవంగా సమాధుల్లో మగ్గుతున్నవాళ్ళం మేము. అక్షరం మాకు నిషిద్ధం. భగవంతుడు మా మొరనాలకించి బ్రిటిష్‌వారిని పాలకులుగా పంపాడు. ఇప్పుడు మమ్మల్నెవరూ వేధించి, బాధించలేరు. ఉరితీసి చంపటానికీ, ప్రాణాలతో పాతిపెట్టటానికి సాహసించరు. నా ముందు తరాలకు కూడా భవిష్యత్‌పై భరోసా ఉన్నదిప్పుడు. మేమిప్పుడు ఒంటినిండా బట్ట కట్టగలుగుతున్నాం. స్వేచ్ఛగా, అర్థవంతంగా జీవిస్తున్నాం. ఆంక్షలూ, నిషేధాలూ తొలగిపోయి బజారులూ, ఉద్యానవనాలూ మాకు తలుపులు తెరిచాయి." ఇదీ ఆ బాలిక రాసింది. ఈ వాక్యాలు ఆనాటి పరిస్థితులకు దర్పణంపడుతున్నాయి.

సావిత్రీబాయి ఎంతో ధైర్యసాహసాలతో సామాజిక విప్లవోద్యమాలలో పాల్గొన్నది. అంటరానితనానికి వ్యతిరేకంగా 1868లో ఉద్యమం నడిపింది. కులవ్యవస్థకు కారణమైన మనువుపైన, బ్రాహ్మణ, పురోహిత వర్గం దోపిడీపైనా ఆమె తీవ్రంగా దాడి చేశారు. కులమతాలనేవి మనుషులు సృష్టించినవని, వీటిని నిర్మూలించి మనుషులందరూ సమానమేననే భావనతో మెలగాలని ఉద్బోధించారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని వ్యతిరేకించారు. ఈ విషయంలో క్షురకులను చైతన్యపరిచి వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. భర్త మరణానంతరం సత్యశోధక సమాజానికి అధ్యాపకురాలిగా ఎంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. పెళ్ళిళ్ళు లాంటి శుభకార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. అనాథ స్త్రీలు, శిశువుల సంరక్షణ కోసం శరణాలయాన్నీ స్థాపించి నిర్వహించారు సావిత్రీబాయి. ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన పిల్లవాడిని యశ్వంత్ అనే పేరుతో పెంచి పెద్ద చేసి కన్నబిడ్డకన్నా మిన్నగా ప్రేమించారు. దిక్కులేని మహిళలు, పిల్లలకు సావిత్రీబాయి ఇల్లే ఒక పునరావాస కేంద్రంగా ఉండేది. 1890 నవంబరు 28న జ్యోతిరావు పూలే మరణించినప్పుడు తీవ్ర దు:ఖంలో మునిగిపోయిన సావిత్రీబాయి ఇంతటి విషాదంలోనూ ఒక ఆదర్శానికి తెరతీశారు. భర్త చితికి స్వయంగా తానే నిప్పు పెట్టి కొత్త సంప్రదాయం తీసుకొచ్చారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే.

సామాజిక సేవలో పాల్గొంటూనే అంతిమ శ్వాస విడిచింది సావిత్రీబాయి. 1890లలో ప్లేగు వ్యాధి బారిన పడిన పిల్లల కోసం ఆమె వైద్య శిబిరాలను నిర్వహించారు. అంత దుర్భరమైన పరిస్థితుల్లో కూడా రోజుకు రెండు వేలమంది పిల్లలకు ఆమె భోజన వసతులను సమకూర్చారు. చివరికి 1897 మార్చి 10వ తేదీన వ్యాధిన సోకిన ఒక పిల్లవాడికి సేవ చేస్తుండగా ఆమెక్కూడా వ్యాధి సోకి మరణించడం అతి విషాదకరమైన ఘటన.

సంప్రదాయవాదుల అణచివేతను ఎదిరించటమూ, స్వప్రయోజనపరులైన యథాతథవాదులను ధిక్కరించటమూ అనే లక్ష్యాల కోసం తమ జీవితాలనూ, ఉద్యమాలనూ అంకితం చేసిన వ్యక్తులు జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి. మహనీయులైన ఈ దంపతులు పీడిత ప్రజల అభ్యున్నతి కోసం చేసిన కృషి నిరుపమానమైనంది. వారు అందించిన సందేశం ఈనాటికీ ఆచరణీయమైనదే. గత చరిత్రకు సంబంధించిన సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక భావజాలపు బంధనాల నుంచి భారతదేశం విముక్తి చెందినప్పుడే సావిత్రీబాయి, జ్యోతిబాపూలేల సందేశాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోగల శక్తి చేకూరుతుంది.

భారతదేశంలో పీడిత ప్రజల ప్రతినిధులైన జ్యోతిరావు, సావిత్రీబాయిల కృషికి అగ్రవర్ణాలకు చెందిన జాతీయ నాయకత్వం తగిన స్థానాన్ని ఎప్పుడూ ఇవ్వలేదు. వారిరువురి గురించి మాట్లాడాలంటే బ్రిటిష్ పాలన వల్ల సాధారణ ప్రజల జీవితాల్లో కలిగిన ప్రయోజనకరమైన మార్పుల గురించి ప్రస్తావించవలసి వస్తుందనేదే ఇందుకు కారణం. వారి కృషి ఫలితంగానే బ్రిటిష్ ప్రభుత్వం 'మాస్ ఎడ్యుకేషన్ సిస్టం'ను అమలులోకి తీసుకొచ్చింది. దీనివలనే శూద్రులు, అతి శూద్రులు, మహిళల కోసం దేశవ్యాప్తంగా అనేక పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కింది కులాల నుంచి ఎన్నో విద్యా కుసుమాలు వచ్చాయి. అందులో నుంచి వచ్చిన ఆణిముత్యమే భారత రాజ్యాంగ నిర్మాత, మేధావి అంబేద్కర్. స్త్రీలు పురుషులతో అని విధాలుగా సమానులేనని, స్త్రీలు బానిసలు కాదని, వారికి విద్య అత్యవసరమని విశ్వసించేవారు. కింది కులాల వారికి, మహిళలకు విద్యను దూరం చేసి, వాళ్ళు చదివితే నాలుకలు తెగ్గోసి, వింటే చెవుల్లో సీసం కరిగించి పోసే చట్టాలు అమలవుతున్న రోజుల్లో కుల, మత, లింగరహితంగా అందరికీ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పూలే దంపతులు చేసిన కృషి నిరుపమానమైనది. దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి సాటిలేనిది. కరువు బారిన పడిన కుటుంబాలలోని అనాథ బాలల కోసం 52 పాఠశాలలను నిర్వహించారు.

నిమ్నకులాల ప్రజలకు అండగా నిలవడం వల్లనే జ్యోతిబాపూలే, సావిత్రీబాయిల మీద బ్రాహ్మణీయ ఆధిపత్య వర్గాలకు చిన్నచూపు ఏర్పడింది. బ్రిటిష్ ఇండియాలో బ్రాహ్మణీయ ఆధిపత్యం కొంత తగ్గుముఖం పట్టడం వలన పూలే దంపతులు ముందుకొచ్చి దిక్కులేని జనం తరఫున గొంతెత్తి మాట్లాడే వాతావరణం ఏర్పడింది. అందువల్లనే దళితులూ, ఇతర నిమ్నకులాలు (శూద్రులూ, అతి శూద్రులూ) విద్యను అభ్యసించి, స్వేచ్ఛను పొందగలిగారు.

శూద్రకులంలో జన్మించిన పూలే తన జీవితంలో కుల వివక్షను అనుభవించిన వ్యక్తి కనుకనే పీడిత ప్రజలందరికీ విముక్తిదాయకమైన విద్యను అందించాలన్న నిశ్చయానికి వచ్చాడు. ప్రజలు విముక్తి చెందాలంటే, వాళ్లకు నూతన సామాజిక, నైతిక విలువలు గల విద్యను అందించాలని ఆయన పదేపదే నొక్కి చెపుతుండేవాడు. నిమ్న కులాల ప్రజలను ఒక పథకం ప్రకారమే విద్యనుంచి బహిష్కరించటం జరుగుతోందని వివరిస్తూ తను రాసిన ఒక విజ్ఞాపన పత్రాన్ని విద్యారంగ సంస్కరణలకై ఏర్పడిన హంటర్ కమీషన్‌కు 1883లో పూలే సమర్పించాడు. జ్ఞానాన్ని బ్రాహ్మణీయ శక్తుల గుత్త సొమ్ముగా పరిగణించే విధానాన్ని ప్రశ్నించిన తొలి తిరుగుబాటుదారుడు పూలే. సార్వత్రిక విద్యను అందించటం ద్వారా పీడిత ప్రజల విముక్తి సాధించవచ్చునని భావ ప్రచారానికి పూనుకొన్నాడాయన. సావిత్రీబాయి, జ్యోతిరావులు విద్యారంగాభివృద్ధికి చేసిన కృషిని గుర్తించిన ప్రభుత్వం 1852లో వాళ్ళిద్దరినీ సన్మానించింది.

పూలే తన భార్య సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసి ఎంతో ఆత్మాభిమానమూ, స్వశక్తి మహిళగా ఆమెను తీర్చిదిద్దాడు. పూలే మార్గదర్శకత్వంలో ఆమె అన్ని సామాజిక దురాచారాలనూ, వివక్షలనూ ప్రశ్నించగల వ్యక్తిగా ఎదిగింది.

సమకాలీన భారతీయ సామాజికావరణాన్ని దాటి ఫీనిక్స్ పైకి చేరగలిగారు పూలే దంపతులు. కులరహిత సమాజం కోసం నినదించిన వారి కంఠాలు ఈనాటికైనా ప్రాముఖ్యతను సంతరించుకుని వారి పోరాటాలు గుర్తింపు పొందడం హర్షదాయకం. భారతదేశమంతటా వారి గొంతులు ప్రతిధ్వనిస్తూ దాదాపు మూడు వేల సంవత్సరాలుగా ఈ దేశంలో పాతుకుపోయిన కులవివక్ష పునాదులను కదిలిస్తూనే ఉన్నాయి. నిమ్నకులాల సమగ్రాభివృద్ధి జరగాలనే వారి ఆశయం మాత్రం ఇంకా నెరవేరనే లేదు. వారి ఆశయం కోసం కృషి చేయడమే వారికిచ్చే నిజమైన నివాళి.

సావిత్రీబాయి పుట్టినతేదీ జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని మరాటా ప్రభుత్వం గత ఏడాది (2017) జనవరి 3వ తేదీన నిర్ణయించింది. ఈ ఒక్కరాష్ట్రంలోనే కాదు దేశమంతటా అన్ని రాష్ట్రాల్లోనూ ఈ నిర్ణయం తీసుకోవాలి. ఆమె చరిత్రను పాఠ్యాంశంగా బోధించాలి.

జ్యోతిరావు రచించిన మంగళాష్టకం అనేక పెళ్ళి పాట ఆమెను ఎంతగానో ఆకట్టుకుని ఉత్తేజపరిచింది. ఆ పాట ఇలా సాగుతుంది.

వరుడు : భగవంతుని ఆనతి మేరకు ఇల్లు చక్కదిద్దుకో
అన్నిటికన్నా ఉన్నతమైనది సత్యమేనని తెలుసుకో
నీ విద్యావిజ్ఞానాలను ప్రజలందరితో పంచుకో
ప్రేమతో నిను పెళ్ళాడుతున్నా ప్రతి అడుగున నీతోడై ఉంటా
శుభమంగళ సావధానం.

వధువు : నువ్వెంత మంచివాడివైనా, నన్నెంత గౌరవిస్తున్నా
స్త్రీ జాతంతా బానిసలే నను వేదన నన్ను వలకున్నది
స్వేచ్ఛా, సమతా, ఆత్మగౌరవం పొందాలన్నది మా తపన
మా హక్కులకండగా నిలబడతానని ప్రతిన బూనగలవా?

వరుడు : కులాల హద్దులు చెరిపేస్తూ
స్త్రీలందరి హక్కులపై నే పోరు సల్పుతా
మహిళలందలరూ నా అక్కచెల్లెళ్ళూ
నా హృదయం నీకే అందితం ప్రియా
కనురెప్పనై నిను కాపాడుకుంటా
నా బాధ్యత మరువను ఎన్నటికీ
శుభ మంగళ సావధానం.

పెద్దల ఆశీరాదాలు : తల్లిదండ్రులపై గౌరవంతో
మిత్రులందరికీ ప్రేమాస్పదులై
వృద్ధుల, పిల్లల, అనాథలందరి అండదండగా నిలవండి
జ్ఞానామృతమును పంచండి
ఆనందంగా పూలబాటలో చేతులు కలిపి సాగండి
శుభ మంగళ సావధానం

ఈ పాటలోలాగానే సావిత్రీబాయి జ్యోతిరావుతో కలిసి విద్యావ్యాప్తి కోసం ఉద్యమించింది

ఎస్. సూర్యకుమార్
చింతలపూడి



ఆకట్టుకుంటున్న అఖిల భారత డ్వాక్రాబజార్!

కాశ్మీర్ దుస్తులు, అరుణాచల్ ప్రదేశ్ డ్రైఫ్లవర్స్, అస్సాం వెదురు ఉత్పత్తులు, బీహార్ వస్త్రాలు, ఛత్తీస్‌ఘడ్ చీరలు, గోవా జ్యూయలరీ, గుజరాత్ గృహాలంకరణ వస్తువులు, హరియానా హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్, బెడ్‌షీట్స్ ఇలా అన్నింటినీ ఒక్కచోటే చూడాలనుకుంటున్నారా? అయితే విశాఖకు రండి. ఇక్కడ నిర్వహిస్తున్న అఖిల భారత ద్వాక్రా బజార్‌లో ఇవన్నీ కొలువుతీరాయి. ఇవే కాదు... హిమాచల్ ప్రదేశ్, జార్కండ్, మేఘాలయ, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, కేరళా, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణా నుంచి వివిధ రకాల ఇత్తడి కళారూపాలు, మసాలా దినుసులుతో పాటు అనేక ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. విశాఖ ఏయు ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలోని ఈ అఖిలభారత డ్వాక్రా బజార్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆరు రోజులుగా కొనసాగుతున్న ఈ డ్వాక్రా బజార్ నేటితో (జనవరి 3) ముగియనుంది. దేశం నలుమూలల నుంచి నాణ్యమైన, వైవిధ్యత కలిగిన ఉత్పత్తులు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. సంక్రాంతి శోభను తెలియజేసే రంగుల ముగ్గులు అలరిస్తున్నాయి. ఇక్కడ సాహిత్య సభలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు వివిధ రాష్ట్రాల రుచులను ఆరగించేందుకు ప్రజలు తరలివస్తున్నారు. షాపింగ్ మాల్స్‌లో అధికధరలు ఉన్న నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇక్కడ చేతి వృత్తుల ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ సరసమైన ధరలకు లభిస్తుండడంతో పచ్చళ్ళ నుంచి పండ్లు వరకూ అన్నింటినీ కొనుగోలు చేస్తున్నారు. పిండి వంటకాలు, గృహోపకర వస్తువులు, ఆయుర్వేద ప్రకృతి సిద్ధమైన వనమూలికలు సైతం ఈ ప్రదర్శనలో లభిస్తున్నాయి. దేశం నలుమూలల నుంచి 350 స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చేతివృత్తుల వస్తువులను 300లకు పైగా స్టాల్స్‌లో ఉంచారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ ప్రదర్శన చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



పి రామకృష్ణ,
విశాఖపట్నం





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

"శాంతమ్మా! ఆశ్రమం మానేశాక మీ మామయ్యకి యెంత శాంతం, వోపిక వచ్చిం దనుకున్నావు!" "ఆహమ్మదాబాదు ప్రయాణం జ్ఞాపకం వుందా మామయ్యా?" అని అడిగా. "లేకేమి, అప్పుడేగా పులిని చూచి నక్క వాతెట్టుకున్నదీగా" అన్నాడు నవ్వుతూ.. మొన్న శాస్త్రి: "అస్తి పంపకం అప్పీలోకటి కోమట్లది మీ మామ పంపించాడు, మంచి తెలివైన బుర్ర సుమా!" అన్నాడు. .....సాయంకాలం వచ్చాడు శాస్త్రి. అతని ముఖం ఒక కొత్తకళతో ప్రకాశిస్తుంది.

40 అతడు

మనస్సు నిర్మలంగా - ప్రశాంతంగా - ఆనందంగా వుంది, దేశ దేశాంతరాలనుంచి భక్తులు భుక్తులభగవన్నామస్మరణ, పండితుల భాగవత పారాయణ, చీని చీనాంబరాల తళుకు, గులాబీపువ్వుల పరిమళం, మంగళ హారతుల జ్యోతి, దేదీప్యమానమైన కాంతి, దివ్యతేజస్సు, నిశ్చలమైన శాంతి.

(నిన్నటి సంచిక తరువాయి)

ఒక్కటే కొరత - శాంతం నాతోకూడా లేకపోవడం. ఈమధ్య ఈమెకి కొంచెం సోషలిస్టుగాలి తగిలింది. మనసులో వేదాంతం ప్రవేశిస్తే అందుకు ముందు - అని ఆశపడి ప్రభు దర్శనానికి రమ్మనమన్నాను. "నాకు పిలుపు రాలేదోయ్" అంది. నాకుమాత్రం పిలుపు వచ్చిందా? బాజాభజంత్రీలతోనూ, పసుపు కుంకంతోనూ, చందన తాంబూలాలతోనూ - పిలుపువస్తే మాత్రం - హృదయద్వారానికి ఘడియలు తాళాలు వేసుకుంటే - ఆ పిలుపు అందేదెట్లా! నా స్నేహితులందరికి - యేటా సహంమంది పుదుచ్చేరి, సహంమంది అరుణాచలం వెళ్ళడం రివాజు. మొదట నాకెక్కడికి వెళ్ళడానికి తోచలేదు. పుదుచ్చేరి సముద్రం, అరుణాచల శిఖరం రెండూ భగవల్లీలలే. అయినా నలుగురితో పాటు నారాయణా అని - మొదట సర్ రామయ్యం గారితో ఇక్కడికీ, తరువాత లేడీ అయ్యంగారితో అక్కడికీ వెళ్ళాను. అప్పటి నుంచి యేటా అక్కడకో ఇక్కడకో వెళితేకాని నాకు తోచదు. ఇదే అలవాటు - సాధన! ప్లీడరీచేస్తూ బ్రహ్మ తేజస్సుచేత ఆకర్షింపబడ్డానంటే నాకే నమ్మశక్యం కాకుండా వుంటుంది.

....తమాషా! మనదేశపు ప్రతిభ ఉత్కృష్టత సంస్కృతి సంప్రదాయం మనకి ముప్పాతిక మూడు వంతులు ఇంగ్లీషు ద్వారానే తెలియడం! ఇప్పుడు ఇంగ్లీషు ప్రాముఖ్యత తగ్గించేస్తారట! వెయ్యి చెప్పినా లక్ష చెప్పినా - మెయిన్సు హిందూలా, ఆస్టీను జ్యూరిస్ ప్రూడెన్సు! పోలక్కు టార్ట్సు, ప్రీవీకౌన్సిల్, ఐ.ఎల్.ఆర్. వున్నంతకాలం ఇంగ్లీషు ప్రభ తగ్గదు - సరికదా హెచ్చుతుంది.... చిత్రం! జాతీయోద్యమం హెచ్చుగా వున్నప్పుడే హిందూ సంప్రదాయం మీద మనకి అభిమానం హెచ్చుగా వుండడం. జాతీయత కొత్తరకంలోనే వివేకానందులవారి ప్రాబల్యం. ప్రతి యువకుడు "వివేకానందాస్ స్పీచెస్" బల్లమీద పెట్టుకుని కాషాయి అంగారఖా తొడుక్కుని చమ్లా చుట్టి నడుంబిగించి చేతులు కట్టుకొని వంకచూపుతో ఫోటో తీయించుకోవడమే! సూరత్ కాంగ్రెసు రోజుల్లో మహారాష్ట్ర కచ్చ - కాలికి మహారాష్ట్ర చెప్పులు - చేత మాక్సు ముల్లరు "రిగ్‌వేదా!" హోమురూలు రోజుల్లో మోకాళ్ళవరకూ లాంక్లాతు లాల్చీ - పాదాలవరకూ మడత వాణీ - ముఖముల్ టోపీ - చేత "ది ఉపనిషడ్సు!" గాంధి యుగంలో మణుకులవరకు గోనెపట్టా - గుండుకి గోష్పాదం - జానెడు వెడల్పు ఖద్దరుటోపీ - చేత "ది లార్డ్సు సాంగ్!" దుస్తుల్లోనూ తలకట్టులోనూ వేదాంతంలోనూ రాచరికంలోనూ కాలంబట్టి పోకడలు!... తాతయ్య "ఆంధ్రకేసరి" చదివి బెంగాల్ విభజన - అశ్వనీకుమారుని నాయకత్వం - రక్షాబంధనం- బాంబుకేసులు - కాకినాడలో కెంప్‌దొర - రాజమండ్రి హంటరు కబుర్లు - చెబుతూంటే అన్నయ్యకి నాకు ఒకటే ఉత్సాహం! మామయ్యలతో వందేమాతరం గీత బృందగానం చేస్తూ వీధులంట తిరిగేవాళ్ళం! సీతప్ప నాన్న సూరతుమంచి వచ్చి తిలక్కు ఖపర్దే ఖబుర్లు చెపుతూంటే, మామయ్యలతో సహా అన్నయ్య నేను నిద్రాహారాలు మానుకుని వినేవాళ్ళం! కర్మయోగి తిలక్కు స్వరాజ్యాన్ని సనాతనాన్ని ఇటిక సున్నంలాగు కలిపి జాతీయోద్యమాన్ని స్థాపించాడు. నిరాడంబర జీవనం దేశ సేన మిళితం చెయ్యడానికి గోఖలే - ఆర్యమతం అతివాదం కలపడానికి లజపతి రాయి - థియసఫీ హోమురూలు జోడించడానికి బిసెంటు ప్రయత్నించారు. నీతికి, రాచరికానికి మేళం కుదురుతుందా? ప్లీడరీలాగు, ఫుట్‌బాలు క్రికెట్టులాగు రాజకీయం ఒక వృత్తే. ఆ వృత్తికి ప్రత్యేక ధర్మాలు ప్రత్యేక నియమాలు. ప్రత్యేక విద్వత్తు పాటించాలి. రెండింటిని సమన్వయం చెయ్యాలని యీవేళ గాంధీ అన్నంతమాత్రాన్ని కుదురుతుందా? లౌక్యం, ధర్మం, రాజకీయం నీతి కలపగానే మన దేశం అంతా అల్లకల్లోలం అయిపోయింది. అయితే ఏం - చివరికి చెప్పేదొకటి చేసేదొకటి అవుతున్నది. మరొక్క పదేళ్ళలో గాంధీ ఉద్యమమే పోతుందని అనిపిస్తుంది. ఖద్దరు వుండదు. దేశం అంతా బట్టల మిల్లుల మయం అయిపోతుంది. అంతమటుకు ఢంకామీద దెబ్బకొట్టి నేచెప్పగలను. ఇక ఈ సోషలిజం కనుక తల ఎత్తిందా యీ దేశంలో - సత్యం, అహింస, సహాయనిరాకరణం పూర్తిగా పోయి- మనకీ ప్రపంచంమీద అందరికీమల్లే రాజ్యకాంక్ష, సైన్యం, యుద్ధపుటోడలు, తుపాకులు, ఫిరంగులు, ఏరోప్లేనులు, పార్లమెంటులు, కలక్టరు గిరీలు ఉద్యోగాలకి పాకులాడ్డం తప్పదు. అంతేకాదు. ఇప్పుడు అస్పృశ్యతానివారణ, హిందూ మహమ్మదీయ ఐక్యత అని ఎంత అరుస్తున్నాడో యితను - అంత హిందూ మహమ్మదీయ ద్వేషం, బ్రాహ్మణ శూద్రద్వేషం, పంచమద్వేషం స్థిరం అయిపోతుంది. ఇంక స్వరాజ్యమా? ఇంగ్లీషు వాళ్ళకి మనకి పుస్తిముడి మరింత బిగుస్తుంది. ఏమో- నామటుకు అదీ చాలా మంచిదనే అనిపిస్తుంది.



రాత్రి హోటేలులో "డిన్నరు" అద్భుతంగా వుంది. శాంతం ఎదురుగా కూచునివుంటే, వెనుకటి ప్యారీసురోజులు జ్ఞాపకం వచ్చాయి. షాంపేను అడగాలనుకున్నాను. కాని శాంతాన్ని చూసి పెదిమె కరుచుకున్నా. మొత్తం మీద పాండుచేరి ప్రయాణం స్వర్గతుల్యంగా అనుభవించేను. హాయ్!

41 ఆమె

నేను ముసిలి ముత్తైదువలాగ తయారవుతున్నాననీ, కొత్తవాళ్ళతో పరిచయం కలిగించుకోవడం, పాత స్నేహితులని కలుసుకోవడం బొత్తిగా మానుకున్నాననీ నన్ను శాస్త్రి పదేపదే దెప్పుతున్నాడు. సరేకదా అని లీలావతమ్మ గారితో చనువుగా ఉండేటప్పటికీ - అదో పెద్ద రాద్ధాత సిద్ధాంతం అయింది. ఆమె పెనిమిటి రంగస్వామి నాయుడున్ను శాస్త్రీన్నీ ఇంగ్లండు నుంచి ఇంటికొచ్చేటప్పుడు కలిసి ప్రయాణం చేశారుట. ఆమధ్య ఎలక్ట్రిక్కు కంపెనీవాళ్ళకీ పనివాళ్ళకీ వచ్చిన తగాయిదాల్లో శాస్త్రి వాళ్ళింటికి రెండుమూడుసార్లు వెళ్ళడం - ఆవిడని చూడకపోయినా - "చాలా మంచివాళ్ళు. ఆమె మంచి చురుకైనదట. ఆమెతో పరిచయం చేసుకుని సినీమాకీ, క్లబ్బుకీ వెళుతూండకూడదా?" అని అప్పట్లో శాస్త్రి నాతో అంటూండే వాడు. రోజూ నాలాగే ఆవిడ చంటిపిల్లని తీసుకుని కారుమీద బీచికి వచ్చేది. అప్పుడు పరిచయం అయింది. స్కూలు ఫైనలు చదువుకుందిట. కాని ఓ దేశం అనీ ఓ రాజకీయం అనీ ఓ పత్రిక కబుర్లనీ ఆవిడకేం వున్నట్టు కనిపించదు. చిలకలామాత్రం తయారవుతుంది. సినిమాకబుర్లు - సినిమా ప్రపంచకం ఎంతసేపున్నూ, సరే, మనకేమీ, ఏదొకొంత బీచీదగ్గర - శాస్త్రి కోర్టునుంచి వచ్చేవరకూ కాలక్షేపం అని - ఆవిడ కారులో నేను కూర్చునో, మా కారులో ఆవిడ కూర్చునో - లోకాభిరామాయణం చెప్పుకుంటూ, రోజూ సాయంకాలం జరిగిపోయ్యేది. నిన్నకూడా మామూలుగా బీచిదగ్గిర మాట్లాడుకుంటూంటే, శాస్త్రి వచ్చి కలుసుకున్నాడు. అదివరకు లీలావతమ్మ గారిని చూడకపోవడం వల్ల నేను ఇద్దరినీ పరిచయం చేశాను. ఆవిడ అమాంతంగా శాస్త్రి చేతుల్లో చెయ్యికలుపుకుని "ఏమమ్మో! ఈ మన్మథ విగ్రహాన్ని - సాక్షాత్తు ఈ రూడాల్ఫు పేలెంటైనోనీ - ఇన్నాళ్ళు మాకు చూపించకుండా అట్టేపెట్టేసుకున్నారే!" అని అంది. ఆ మాటలు విని నాకు ముచ్చెమ్మటలూ కమ్మేశాయి. నోట మాట రాలేదు. శాస్త్రి మాత్రం నవ్వుతూ "అట్టే పెట్టుకోకపోతే అడ్వర్‌టైజు చెయ్యమన్నారా ఏమిటి?" అన్నాడు. ఆమె జవాబు చెప్పింది కదా - "అవశ్యం! ఏమి? శశాంకుణ్ణి తార అడ్వర్‌టైజ్ చెయ్యబట్టి కదా మహర్షి అంతటి వ్యక్తికూడా మెచ్చుకున్నాడు?" శాస్త్రి అందుకున్నాడు - "మెచ్చుకోవడం కాదండీ - మహర్షిగారికి ఈర్ష్య!" వెంటనే ఆవిడ జవాబు: "ఆ ముసలి తొక్కుకికూడా వసంతకాలపు వెన్నెలలో రాగోదయం!"

శాస్త్రి పక్కున నవ్వేడు. జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి వెలిగించబోతూంటే, ఆవిడ ఆ పెట్టె చేతిలోంచి లాక్కుని, "అమ్మో! బంగారపు సిగరెట్టు కేసే? ఏమండోయి? మీరు అచ్చ కుబేరావారి కుబేరులా, లేకపోతే థీఫ్ ఆఫ్ బాగ్దాదా?" అంటూ తనంతట తనే పెట్టెతీసి "నా అమరజ్యోతిని వెలిగించి పెట్టరూ?" అని మొఖంమీద మొఖం పెట్టింది. "ఇదుగో! అచ్యుతకన్యకి అమరజ్యోతి" అంటూ శాస్త్రి అగ్గిపుల్లతో ఆమె సిగరెట్టును వెలిగించేడు.

ఇలాగా ఇంకా కాస్సేపు సంభాషణ జరిగింది. మరి ఆ లీలావతమ్మ గారి మాటల్లోని మాధుర్యమో - చమత్కారమో తెలియదుకాని, ఈ మధ్య ఎప్పుడూ ఇంతసేపూ నాతో మాట్లాడినట్టు నాకు జ్ఞాపకంలేదు. పొరుగింటి పుల్లకూరంటే, అంత పడిచావడం ఎందుకో?

నాకు కొంత ఓర్వలేనితనం వచ్చింది.

కొసకి అన్నాగదా - "పిల్లకి పాలవేళయింది. ఇక ఇంటి కెళ్ళాలి మనం". అంతవరకూ యెంత చక్కగానో నిద్రపోతున్న పిల్ల వక్కసారి తెలివి వచ్చేసి ఏడవడం మొదలెట్టింది.

దాంతో ఆవిడందీ "మీవారికి పిల్లని ఎలా పూర్కోపెట్టడమో - తర్ఫీదు చెయ్యలేదూ? వారికోసారి ఇవ్వండి! కనగానే సరా - పెంచడం తెలియద్దూ?" ఆవిడ మోటుమాటలు విని శాస్త్రి మొఖం చిట్లించుకున్నాడు. అసలు-అతని మోస్తరేవిటంటే - చంటిపిల్లలు ఆడుకుంటున్నంత సేపు సరిగా ఆడడం - ఓ ఏడ్చినా-ఓ పిసరు ఉచ్చోసినాసరే-ఆమడదూరం పారిపోవడం ఆవిడా మాటలనేసరికి-శాస్త్రికి యెక్కడలేని రోషం వచ్చి-చటుక్కుని పిల్లని తీసుకున్నాడు.

– ఇంకా వుంది.



భారతదేశపు గొప్ప శాస్త్రవేత్తలు

- **శుశ్రుతుడు** : క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందినవాడు. ప్లాస్టిక్ సర్జరీ పితామహుడు. శుశ్రుత సంహిత అనే గ్రంథంలో ప్లాస్టిక్ సర్జరీ విధానాలను వివరించారు. హిప్పోక్రేట్స్ కంటే 150 సంవత్సరాలు కిందటివాడు.
- **చరకుడు** : క్రీ.పూ. 300కు ఇంచుమించు జన్మించాడు. 'చరక సంహిత' అనే గ్రంధాన్ని రచించాడు. మన పురాణాల్లో 'చరకులు' అంటే సంచరిస్తూ వైద్యం చేసేవారుగా పేర్కొని ఉంది.
- **కణద రిషి** : క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందినవాడు. 'రసరత్నాకర' అనే గ్రంథాన్ని రచించాడు. ఆరోగ్యమంజరి, యోగసారా వంటి వైద్య గ్రంథాలను రచించాడు.
- **ఆర్యభట్ట** : క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన గణితశాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త. ఈయన ఆర్యభట్టీయం, ఆర్య సిద్ధాంతం అనే గ్రంథాలను రచించాడు. భారతదేశ మొదటి ఉపగ్రహానికి ఈయన పేరుపెట్టారు.
- **వరాహమిహిర** : క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన గొప్ప గణిత, ఖగోళ శాస్త్రవేత్త. పంచ సిద్ధాంత అనే గ్రంథాన్ని రచించారు. బృహత్ సంహితలో రోదసి నిర్మాణాలను, వాటి కదలికలను వివరించారు.
- **ఆచార్య పతంజలి** : క్రీ.పూ. రెండో శతాబ్దానికి చెందినవారు. యోగాను అభివృద్ధి చేసిన గొప్ప వ్యక్తి. మొత్తం ఈయన 84 కీలక యోగాసనాలను అభివృద్ధి చేశారు. జూన్ 21న ప్రపంచ యోగా దినంగా జరుపుకుంటున్నాము.
- **భాస్కరాచార్య** : 12వ శతాబ్దానికి చెందిన గొప్ప గణిత శాస్త్రవేత్త, లీలావతి, బీజగణితం ఈయన రచించినవాటిలో ముఖ్యమైనవి.
- జగదీష్ చంద్రబోస్ : విద్యుత్ అయస్కాంత తరంగాలు, మొక్కల పెరుగుదల, వైర్‌లెస్ టెలిగ్రఫీ వంటివాటిపై పరిశోధనలు నిర్వహించారు. క్రెస్కోగ్రాఫ్ అనే పరికరాన్ని కనుగొన్నారు.
- **శ్రీనివాస రామానుజం** : గొప్ప గణిత శాస్త్రవేత్త, గణిత సిద్ధాంతాలను ప్రతిపాదించారు.
- **బీర్బల్ సహని** : పేలియోబోటనీ పితామహుడు. వృక్ష శిలాజాలపై కీలక అధ్యయనాలు చేశారు.
- **ఆచార్య ఎస్.ఆర్.కశ్యప్** : బ్రయోఫైటా మొక్కలను అధ్యయనం చేశారు. భారత బ్రయోలజీ పితామహుడు. 1932 భారత సైన్స్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు.
- **శాంతిస్వరూప్ భట్నాగర్** : కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సి.ఎస్.ఐ.ఆర్.) మొదటి వ్యవస్థాపక డైరెక్టర్. స్వాతంత్ర్యం అనంతరం ఎస్ అండ్ టి పరిశోధనకు పునాది వేశారు.
- **సలీం అలీ** : 'బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధిగాంచారు. 'ది బుక్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్' అనే గ్రంథాన్ని రచించారు.
- **యల్లాప్రగడ సుబ్బారావు** : భారతదేశపు గొప్ప బయోకెమిస్ట్. 'కణ కరెన్సీ'గా పిలువబడే అడినొసైన్ ట్రై ఫాస్ఫేట్ (ఎ.టి.పి.)ను కనుగొన్నారు. అమెరికాకు చెందిన 'సయనమిడ్' అనే కంపెనీ ఒక శిలీంద్రానికి సుబ్బరోమైసిన్ స్ప్లెండెన్స్ అని ఈయన పేరు పెట్టారు.
- కె.ఆర్.రావు : న్యూక్లియర్ క్వాడ్రుపోల్ రెసోనెన్స్ (ఎన్.ఎం.ఆర్.) స్పెక్ట్రోస్కోపిని అభివృద్ధి చేసిన గొప్ప శాస్త్రవేత్త.
- **పి.మహేశ్వరి** : మొక్కల ఎంబ్రియాలజీపై పరిశోధనలు చేసిన వృక్ష శాస్త్రవేత్త.
- పి.ఆర్.పిషరోటి : భారత రిమోట్ సెన్సింగ్ పితామహుడు
- **ఎస్.చంద్రశేఖర్** : ఏస్ట్రోఫిజిక్స్‌లో కీలక పరిశోధనలను నిర్వహించిన శాస్త్రవేత్త. 1983లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. నాసా తన ఎక్స్-రే అబ్జర్వేటర్‌ను చంద్ర అబ్జర్వేటరీ అనే నామకరణం చేసింది.
- **హోమీ జహంగీర్ బాబా** : భారత అణుశక్తి పితామహుడు. 1994లోనే న్యూక్లియర్ సైన్స్‌పై మూల పరిశోధనలను నిర్వహించారు. ఈయన కృషి ఫలితంగా భారత్ 1974 మే 18న తొలిసారిగా అణ్వాస్త్రాన్ని విజయవంతంగా పరీక్షించగలిగింది.
- **విక్రం సారాబాయి** : భారత అంతరిక్ష పితామహుడు. ఈయన కృషి ఫలితంగా 1963 నవంబర్ 21న తొలి రాకెట్‌ను భారత్ ప్రయోగించింది. 1962లో ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరెటరీ ఏర్పాటుతో పాటు భారత మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను రష్యాలో నుంచి ప్రయోగించడంలో కీలకపాత్ర వహించారు.
- **హరగోవింద్ ఖురానా** : ఎంజైముల బయోకెమిస్ట్రీపై తొలుత పరిశోధనలు చేశారు. కృత్రిమ జన్యువును సృష్టించారు. 1968లో వైద్యరంగంలో నోబెల్ బహుమతి పొందారు.
- **ఎం.ఎస్.స్వామినాథన్** : భారత హరిత విప్లవ పితామహుడు. 2016లో 'కంబాట్టింగ్ హంగర్ అండ్ అచీవింగ్ ఫుడ్ సెక్యూరిటీ' అనే గ్రంథాన్ని రచించారు.
- **రాజారామన్న** : అణు శాస్త్రవేత్త, భారత అణుశక్తి కార్యక్రమానికి ఆద్యుడు. భారత అణుబాంబు పితామహుడు.
- **ఎ.పి.జె. అబ్దుల్ కలాం** : 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని ఈయనను పిలుస్తారు. ఎస్.ఎల్.వి.-3 రాకెట్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించారు. 1997లో భారతరత్నను ఈయనకు ప్రదానం చేశారు.
- **యు.ఆర్.రావు** : ఇస్రో మాజీ చైర్మన్. ఎ.ఎస్.ఎల్.వి. రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. 24 జులై 2017న బెంగళూరులో మరణించారు.
- **సి.ఎస్.ఆర్.రావు** : సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీలో పరిశోధనలు చేశారు. అనేక సంవత్సరాలపాటు ప్రధానమంత్రికి సాంకేతిక సలహాదారుగా వ్యవహరించారు. 2014లో భారతరత్నను అందుకున్నారు.
- **వెంకట్రామన్ రామకృష్ణన్** : భారత సంతతికి చెందిన బ్రిటన్ శాస్త్రవేత్త, రైబోజోములు ఏవిధంగా ప్రోటీన్లను నిర్మిస్తాయి అనే అంశాన్ని వివరించారు. 2009లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందారు.
- **లాల్జీసింగ్** : భారత డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్ పితామహుడు. భారత్‌లో ఫింగర్‌ప్రింటింగ్ అభివృద్ధికి కృషిచేశారు. సీసీఎంబీ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు.

విశాలాంధ్ర ప్రజ్ఞ



కంప్యూటర్లలో రకాలు

(TYPES of COMPUTERS)



కంప్యూటర్లలో రకాలున్నాయి. వాటి సైజును బట్టి, అవి నెరవేర్చే ఉద్దేశాలను బట్టి కంప్యూటర్లను వివిధ రకాలుగా వర్గీకరిస్తారు. కొన్ని కంప్యూట ర్లయితే గదిని ఆక్రమించేంత పెద్దవిగా ఉంటాయి. మరికొన్నింటిని బ్రీఫ్‌కేసులో పెట్టుకుని పోవచ్చు. కంప్యూటర్లను రకరకాలుగా విభజిస్తారు.



1. అనలాగ్ కంప్యూటర్లు (Analog Computers) : ఉష్ణోగ్రత (టెంపరేచర్), పీడనం (ప్రెషర్) వంటి నిరంతరం మారుతుండే పరిస్థితులను మాపనం చేసి వాటిని పరిమాణాలలో (క్వాంటిటీ) మార్చే కంప్యూటర్‌ను అనలాగ్ కంప్యూటర్ అని అంటారు. ఈ కంప్యూటర్లను ఎక్కువగా సైంటిఫిక్, ఇంజినీరింగ్ రంగాలలో ఉపయోగిస్తారు.

2. డిజిటల్ కంప్యూటర్స్ (Digital Computers) : కంప్యూటర్లలో ఇది అతి సామాన్యమైనది. 'డిజిటల్' అంటే 'సంఖ్యలతో వ్యవహరించడం' అని అర్థం. ఒక సంఖ్యల సముచ్చయాన్ని వేరొక సంఖ్యల సముచ్చయంలోకి మారుస్తూ డిజిటల్ కంప్యూటర్లు తమ పనిని నిర్వహిస్తాయి. అన్ని డేటా సంఖ్యలు, చిత్రాలు, చిహ్నాలు, మాటలు కంప్యూటర్ వ్యవస్థ లోపల సంఖ్యల రూపంలోకి మార్చబడతాయి. కూడటం, తీసివేయడం, రెండు అంకెల్లో ఏది పెద్దదో పోల్చడం వంటి సంఖ్యలపైన, సామాన్య విధులను నిర్వహించగల సామర్థ్యంపైన, సామాన్య విధులను నిర్వహించగల సామర్థ్యంపైన డిజిటల్ కంప్యూటర్లు చేసే ప్రతి పని ఆధారపడి ఉంటుంది.

3. హైబ్రిడ్ కంప్యూటర్లు (Hybrid Computers) : అనలాగ్, డిజిటల్ కంప్యూటర్ల లక్షణాలను కలిపి తయారుచేసే కంప్యూటర్లను హైబ్రిడ్ కంప్యూటర్లు అంటారు. ఈ కంప్యూటర్‌లో కొన్ని కాలిక్యులేషన్స్‌ను 'అనలాగ్' భాగంలోనూ, మరికొన్నింటిని 'డిజిటల్' భాగంలోనూ చేయడం జరుగుతుంది.

బి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ సామర్థ్యాన్ని బట్టి కంప్యూటర్ల వర్గీకరణ :

1. మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లు (Mainframe Computers) : పెద్ద ఆకారం కలిగిన శక్తివంతమైన కంప్యూటర్లను మెయిన్ ఫ్రేమ్ కంప్యూటర్లని అంటారు. ఇవి ఎక్కువ డేటాను నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అత్యంత వేగంగా కూడా పనిచేయగలుగుతాయి. వీటిని ప్రత్యేక ఎయిర్‌కండిషన్డ్ రూముల్లో ఉంచుతారు. ఈ కంప్యూటర్లను ఎక్కువగా లైఫ్ ఇన్సూరెన్స్ వంటి పెద్ద కంపెనీలు, బ్యాంకులు, రక్షణశాఖ, ప్రభుత్వశాఖలు మొదలైనవి వినియోగిస్తాయి. మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లకు ఉదాహరణలుగా వీటిని పేర్కొనవచ్చు. IBM 4381, Honeywell DPS8, CRAYX-MP/48.

2. మినీ కంప్యూటర్లు (Mini Computers) : కుదించిన (స్కేల్డ్ డౌన్) మెయిన్‌ఫ్రేమ్ వెర్షన్లనే మినీ కంప్యూటర్లని అంటారు. ఇది మైక్రో కంప్యూటర్ కంటే పెద్దది. మైక్రో కంప్యూటర్లకంటే ఇవి దాదాపు ఐదురెట్లు వేగంగా పనిచేస్తాయి.

ఇవి 1960 దశకం చివరిభాగంలో సంస్థల చిన్నచిన్న లెక్కల అవసరాలను తీర్చుతాయనే ఉద్దేశంతో అభివృద్ధిపరిచారు. ఈ కంప్యూటర్లను వాణిజ్యసంస్థలు, ఆయిల్ రిఫైనరీలు, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక సంస్థలు, యూనివర్సిటీలు ఉపయోగిస్తాయి.

3. మైక్రో కంప్యూటర్లు (Micro-Computers) : పేరులోనే ఉన్నట్లు మైక్రో కంప్యూటర్లని చిన్ని కంప్యూటర్లని అనవచ్చు. వీటిసైజు మామూలు కంప్యూటర్ సైజుకంటే తక్కువగా ఉంటుంది. మైక్రో కంప్యూటర్ ప్రధాన లక్షణమేమంటే ఇది మైక్రోప్రాసెసర్‌ను వాడుతుంది. ఇదే ఈ కంప్యూటర్ సెంట్రల్ ప్రాసెసింగ్ (సీపీయూ) యూనిట్‌గా ఉంటుంది. మైక్రో కంప్యూటర్‌ను సాధారణ ప్రయోజనాలకు ఉపయోగపడే కంప్యూర్‌గా చెప్పవచ్చు. దీన్ని ఎక్కువగా ఆఫీసుల్లో, ఇళ్లలో విరివిగా ఉపయోగిస్తారు.

సూపర్ కంప్యూటర్లు :

ఇప్పుడు కంప్యూటర్ రంగంలో వచ్చిన అత్యాధునిక కంప్యూటర్లను సూపర్ కంప్యూటర్‌లు అంటారు. వీటిని అత్యంత ఎక్కువ డేటాను వేగంగా, కచ్చితమైన విశ్లేషణ కోసం వాడుతారు. సాధారణ కంప్యూటర్లకంటే వీటి సామర్థ్యం కొన్ని వేల రెట్లు ఎక్కువ ఉంటుంది. సూపర్ కంప్యూటర్లను మొదటగా 1960ల్లో సీమౌర్ క్రే కంట్రోల్ డేటా కార్పొరేషన్ రూపొందించింది. 1970లో ఇవి మార్కెట్‌లోకి వచ్చాయి.

వీటి సామర్థ్యాన్ని ఫ్లాప్స్ (FLOPS) లో లెక్కిస్తారు. ఫ్లాప్స్ అంటే ఫ్లోటింగ్ పాయింట్ ఆపరేషన్స్ పర్ సెకండ్.

సూపర్ కంప్యూటర్స్‌ను ఎక్కువగా క్వాంటమ్ మెషీన్స్, క్లైమేట్ రీసెర్చ్, మాలిక్యులర్ మోడలింగ్, న్యూక్లియర్ ఫిజిక్స్ వంటి శాస్త్రాల అధ్యయనాల్లో వాడుతారు.

సూపర్ కంప్యూటర్లు పారలల్ ప్రాసెసింగ్ ద్వారా పనిచేస్తాయి. తొలి సూపర్ కంప్యూటర్ క్రే ఎక్స్‌ఎంపి ను అమెరికా తయారుచేసింది.

టాప్ 500 లిస్ట్ : 1993 నుంచి వేగవంతమైన సూపర్ కంప్యూటర్లకు 'టాప్ 500 లిస్ట్' ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతోంది. 2008 నుండి ఇప్పటివరకు 'ఫాస్టెస్ట్' సూపర్ కంప్యూటర్లను వాటి సామర్థ్యం (స్పీడ్) ఆధారంగా ఇవ్వడం జరిగింది.

Year	Supercomputer	Peak speed	Location
2008	IBM Roadrunner	1.026 PFLO	PSLosAlamos,
		1.105 PFLOPS	USA
2009	Cray Jaguar	1.105 PFLOPS	Oak Ridge, USA
2010	Tianhe-1A	2.566 PFLOPS	Tianjin, China
2011	Fugitsu K Comp.	10.51 PFLOPS	Kobe, Japan
2012	Sequa la	16.32 PFLOPS	IBM, USA
2013	Cray Titan	17.59 PFLOPS	Oak Ridge, USA
2016	Sunway Tainulight	93.0146 PFLOPS	NRCPC China
2017	Sunway Tainulight	93.0146 PFLOPS	NRCPC China

భారతదేశంలో సూపర్ కంప్యూటర్లు :

భారతదేశంలో సూపర్ కంప్యూటర్లను మొదట సీడీఏసీ పూణే సంస్థ తయారుచేసింది. ఈ సంస్థ 1991లో పరమ్ 8000 (PARAM 8000) ను ప్రారంభించింది. దీని సామర్థ్యం 1 గిగా ఫ్లాప్స్. ఇటీవల సీడీఏసీ పదమ్ 10000ను రూపొందించింది. దీని సామర్థ్యం సుమారు 1 టెరా ఫ్లాప్స్. PARAM PADMA ను సీడీఏసీ 2003లో రూపొందించింది. ఇది దేశంలో 1 టెరాఫ్లాప్స్ సామర్థ్యం కలిగిన మొదటి సూపర్ కంప్యూటర్.



కంప్యూటర్ నెట్‌వర్కింగ్‌కు సంబంధించిన కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌ల వివరాలు

కంప్యూటర్ డిజైన్, మెయింటెనెన్స్ అధ్యయనాన్ని కంప్యూటర్ నెట్‌వర్కింగ్‌గా చెప్పొచ్చు. ఇందులో నైపుణ్యం సాధించాలంటే ఆపరేటింగ్ సిస్టమ్స్, మైక్రోప్రాసెసర్స్, పీసీల కాన్ఫిగరేషన్, కంప్యూటర్ అసెంబ్లింగ్, డిసెంబ్లింగ్, ట్రబుల్ షూటింగ్ టెక్నిక్‌లపై పూర్తి అవగాహన అవసరం.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఆఫర్ చేస్తున్న సంస్థలు..

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.. కంప్యూటర్ నెట్‌వర్క్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీలో ఎంటెక్ కోర్సును అందిస్తోంది. గేట్/ పీజీసెట్‌లో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్/ పీజీసెట్ ద్వారా 72 శాతం విద్యార్థులను, స్పాన్సర్డ్ కేటగిరీ కింద 28 శాతం మంది విద్యార్థులను తీసుకుంటారు.

వెబ్‌సైట్: http://sit.jntuh.ac.in/

విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం.. కంప్యూటర్ నెట్‌వర్క్స్ స్పెషలైజేషన్‌లో ఎంటెక్ కోర్సును అందిస్తోంది. గేట్/ప్రవేశ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

వెబ్‌సైట్: www.andhrauniversity.info

తమిళనాడులోని కలసలింగం యూనివర్సిటీ.. నెట్‌వర్క్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ అస్యూరెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంలో ఎంటెక్ కోర్సును అందిస్తోంది.

అర్హత: సంబంధిత బ్రాంచ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

ప్రవేశం: యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశపరీక్షలో ర్యాంకు ఆధారంగా.

వెబ్‌సైట్: www.kalasalingam.ac.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
-1.36 ▼	6.65 ▲	◀◀	600 ▲		▼
33,812.26	10,442.20	28,250 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	39,600 (కిలో (రూపాయల్లో))	63.56	66.60 (బ్రెంట్ ధర (డాలర్లలో..))

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా మోటార్స్(డీ)	254.00	4.18
బీహెచ్ఈఎల్	98.20	3.37
టాటా మోటార్స్	440.20	3.24
ఓఎన్జీసీ	197.50	2.36
కోల్ ఇండియా	271.50	1.46

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
భారతి ఎయిర్‌టెల్	532.00	-2.32
ఎస్‌బీఐ	308.85	-1.48
మారుతి సుజుకీ	9,714.55	-1.22
లార్సెన్	1,270.50	-1.01
ఏక్సిస్ బ్యాంక్	568.50	-0.98

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.87	63.56
యూరో	76.58	76.63
పౌండ్	86.32	86.20
ఆస్ట్రేలియా డాలర్	49.93	49.84
సింగపూర్ డాలర్	47.81	47.85

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,120	30,075
చెన్నై	28,120	30,075
బెంగళూరు	27,500	29,412
ముంబై	28,850	30,856
విజయవాడ	28,250	30,280



పెరగనున్న భారత జీడీపీ

హెచ్ఎస్‌బిసి నివేదిక

న్యూఢిల్లీ: ప్రస్తుతం 6.5శాతంగా ఉన్న భారత జీడీపీ 2018-19 కాలంలో 7శాతానికి చేరుకుంటుందని హెచ్ఎస్‌బిసి తాజా నివేదిక వెల్లడించింది. వస్తుసేవల పన్ను పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో వృద్ధిరేటుకు కొంత అవరోధం కలిగినప్పటికీ 2019-20 నాటికి కీలకరంగాలలో మరింత వృద్ధి నమోదుచేస్తుందని పేర్కొంది. భారతీయ వృద్ధి నమోదు రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది తక్కువగా ఉన్న వృద్ధి స్వల్పకాల వ్యవధిలో నిదానంగా పుంజుకుంటుందని తెలిపింది. 2018,2019కాలంలో కీలక రంగాలు జిఎస్‌టి అమలుతో మరింత పురోభివృద్ధినమోదుచేస్తుందని తెలిపింది. తదుపరి కాలంలో ఇటీవలికాలంలో చేపట్టిన నిర్మాణ సంస్కరణల ఫలితంగా వృద్ధితో లాభాలుకూడా నమోదు చేస్తుందని తెలిపింది. 2017-18కాలంలో 6.5 శాతంగా ఉన్న భారత వృద్ధి రేటు 2018-19 కాలంలో 7 శాతానికి, 2019-20 కాలంలో 7.6శాతానికి చేరు కుంటుందని అంచనావేసింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కాలపరిమితిపై కీలక వడ్డీ రేట్లను పెంచుకోవడం ద్వారా వత్తిడిని కొంతవరకు ఎదుర్కోవచ్చునని తెలుస్తోంది. తద్వారా భారత జీడీపీ వృద్ధి అతి స్వల్పంగా నమోదు చేస్తుందని పేర్కొంది. హెచ్ఎస్‌బిసి నివేదిక ఆధారంగా ఆర్‌బీఐ లక్ష్యమైన 4శాతానికి చేరుకోవాలంటే మాత్రం ద్రవ్యోల్బణంపై మరింత పరిమితి విధించవలసిఉంది. 2018లో ద్రవ్యోల్బణ శాతం సరాసరిన 3.4శాతం ఉంటుందని పేర్కొంది. ఐదవ ద్వైపాక్షిక పరపతి విధాన సమీక్షా సమావేశంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపోరేటును 6 శాతంగా రివర్స్ రెపోరేటును 5.75శాతంగా నిర్ణయించింది. 2017-18 సంవత్సరంలో ద్రవ్యోల్బణ శాతం 4.3-4.7 శాతానికి ఉంటుందని తెలిపింది.




భారత్‌లో ద్రవ్య సరఫరా, ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: గడచిన ఏడు త్రైమాసికాల్లో ఆరింటిలో స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ) పెరుగుదల శాతం కన్నా ద్రవ్య సరఫరా పెరుగుదల తక్కువగా ఉందని తెలుస్తోంది. గత రెండేళ్ల కాలంలో ఈ ద్రవ్యసరఫరా పెరుగుదల కొంత పుంజుకున్నప్పటికీ గత ఏడాది మాత్రం తక్కువగానే నమోదైంది. ద్రవ్యోల్బణం అనేది ఎక్కడైనా ద్రవ్యసంబంధిత విషయమే.. ద్రవ్య సంబంధిత ఉత్పత్తికన్నా ఎక్కువగా ద్రవ్యోల్బణం మరింత పెరుగుతూనే ఉంటుంది. రివర్స్ కూడా సహ జమే... ద్రవ్య సరఫరాలో తరుగుదల అనేది ఉత్పత్తిపై ఆధార పడటంతో డిఫ్లేషన్ ఏర్పడుతుంది. ఇది భారతీయ ఆర్థికవ్యవస్థపై ఎటువంటి ప్రభావం చూపుతుందనేది ప్రశ్న?

అమెరికా కాదు కెనడా

- విసుగు పుట్టిస్తున్న ట్రంప్ విధానాలు
- ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు కెనడాలో ఎక్కువ
- మూడేళ్ల నుంచి పెరుగుతున్న భారతీయ విద్యార్థులు



న్యూఢిల్లీ : అమెరికాలో వర్క్‌పర్మిట్ వీసాలపై వెళ్తున్న వారితో పాటు విదేశీ విద్యార్థులపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ట్రంప్ విధానాలతో భారతీయ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూటకో కొత్త నిబంధన ప్రవేశపెడుతున్న తీరుతో.. అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులను, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి ముఖ్యకారణం.. అమెరికా ఉద్యోగాల్లో స్థానిక యువతకే తొలి ప్రాధాన్యం...నైపుణ్యమున్న విదేశీయుల సేవలను మాత్రమే వినియోగించుకుంటాం...అంటూ ఊదరగొడుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే బదులు కెనడాకు వెళ్లడమే సముచితమని భారతీయ విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని న్యూఢిల్లీలోని కెనడా హై కమిషన్, యూఎస్ ఎంబసీ లు ధ్రువీకరించాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం చేసినప్పటి నుంచి యూఎస్‌కు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని న్యూయార్క్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నెషనల్ ఎడ్యుకేషన్ (ఐఐఈ) సంస్థ పేర్కొన్నది. ఆ సంస్థ వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం...2015-16లో ఎఫ్-1 వీసాల కోసం 62,537 మంది దరఖాస్తు చేసుకోగా, 2016-17లో కేవలం 52,281 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అమెరికాలో చదువుకునేందుకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతున్నది. అయితే, కెనడాలో ఉన్నత చదువు కోసం 2015లో 39,525 మంది, 2016లో 39,790 మంది, 2017 ((అక్టోబర్ నాటికి) 41,805 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత విద్య కోసం కెనడాకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య మూడేండ్ల నుంచి క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్నది. కెనడాలో ఉన్నత విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు, త్వరితగతిన అర్హులకు వీసాలు మంజూరు కావడమే ఇందుకు ప్రధాన కారణం. 2016-17లో అమెరికాలో చదువుకునేందుకు 1,86,267 మంది భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, వారిలో దాదాపు లక్ష మంది దరఖాస్తు చేసుకున్న తర్వాత నిర్ణయాన్ని మార్చుకున్నారు. అమెరికా ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ట్రంప్ విధానాలతో భారతీయ విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొనడమే ప్రధాన కారణం. ఇపుడు చాలా మంది కెనడాలో ఉన్నత విద్య పూర్తి చేయాలని దరఖాస్తు చేసుకొని వెళ్లారు. 2016లో స్టడీ పర్మిట్ వీసాలపై 52,870 మంది భారతీయ విద్యార్థులు కెనడాకు వెళ్లారు. 2017లో 54,425 మంది వెళ్లారు. కెనడాకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతున్నది. అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ విధానం (ఓపీటీ) ప్రకారం యూఎస్‌లోనే ఉండిపోతున్నారు. ట్రంప్ సర్కార్ తాజాగా తీసుకొచ్చిన హెచ్-1బీ వీసా నిబంధనల కారణంగా ఓపీటీ ప్రకారం అమెరికాలో ఉంటున్న భారతీయ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, నైపుణ్యమున్న భారతీయ విద్యార్థులకు కెనడా స్వర్గధామంగా మారింది. స్టెమ్ (సైన్స్, టెక్, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) విధానం ద్వారా నైపుణ్యమున్న భారతీయ విద్యార్థులకు కెనడాలో మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

కెనడాలో స్థిరపడిపోవాలనుకునే భారతీయ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు శాశ్వత పౌరసత్వం కల్పిస్తున్నది. 2015లో 1,170 మంది, 2016లో 2,360 మంది, 2017లో 7,120 మందికి కెనడా పర్మినెంట్ రెసిడెన్స్ స్టేటస్ లభించింది. ట్రంప్ విధానాలతో విసిగిపోయిన భారతీయ విద్యార్థులు కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు చేయాలని భావిస్తున్నారు.

కొత్త ఏడాదిలో ఐటీ బూమ్..

మానవ వనరుల నియామక సంస్థల అంచనా



న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పెద్ద ఎత్తున నియామకాలు జరుగుతాయని మానవ వనరుల నియామాక సంస్థలు అంచనా వేస్తున్నాయి. దేశీయ ఐటీ రంగం ఈ ఏడాది 2 లక్షల మందికి కొత్తగా ఉపాధి కల్పిస్తుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. అయితే తమ ఉద్యోగం కాపాడుకోవాలంటే నూతన నైపుణ్యాలను అభ్యసించడం కొన్ని రంగాల ఉద్యోగులకు తప్పనిసరని వివరించింది. కొన్ని రంగాల్లో మాత్రం యాంత్రీకరణ (ఆటోమేషన్) సాంకేతికతల వల్ల ఉద్యోగాలు తగ్గుతాయని పేర్కొంది. మొబైల్ తయారీ, ఆర్థిక సేవల సాంకేతికత, అంకురాల్లో అవకాశాలు బాగుంటాయని వివరించింది. ఆర్థిక సేవల రంగం మెరుగుపడటం, డిజిటల్ వ్యాపారాలు పెరగడం, డిజిటలీకరణ- యాంత్రీ కరణలో పెట్టుబడులు పెరగడం వంటివి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ ఐటీ నియామకాల విభాగం జనరల్ మేనేజర్ అల్కాధింగ్రా పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ఉద్యోగాలిచ్చే సంస్థలు 20 శాతం పెరుగుతాయని, ఫలితంగా 1.8 నుంచి 2 లక్షల ఉద్యోగాలు రావచ్చని అంచనా వేశారు. దీనిలో డిజిటల్ సాంకేతికతలో నైపుణ్యం ఉన్న 50 శాతం మంది అదనంగా అవసరమని పేర్కొన్నారు. 2030 నాటికి అంతర్జాతీయంగా కృత్రిమ మేధ ఒక్కటే 23 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. కొత్తతరం సాంకేతికతల వినియోగానికి డిజిటల్ నైపుణ్యాలున్న ఉద్యోగుల అవసరం ఉందని అడోబ్ ఇండియా ఉపాధ్యక్షుడు అబ్దుల్ జలీల్ వివరించారు. అనుభవం, అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగులను కాపాడుకోవడం సంస్థలకు సవాలుగా మారుతుందని తెలిపారు.

మరింతగా స్మార్ట్ ఫోన్లు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్లు ఇక మరింత స్మార్ట్‌గా మారబోతున్నాయి. డ్యూయల్ కెమెరాలు, అధిక సామర్థ్యంతో కూడిన బ్యాటరీలతో రూపొందించిన స్మార్ట్‌ఫోన్లు ఈ ఏడాది దేశీయ మార్కెట్లో రాజ్యమేలితే.. 20 18లో వీటి స్థానాన్ని ఫేషియల్ రికగ్నైజేషన్, ఆగ్మెంటెడ్/వర్చువల్ రియాల్టీ లాంటి ఫీచర్లతో కూడి పెద్ద స్క్రీన్ ఫోన్లు ఆక్ర మించే అవకాశం కనిపిస్తోంది. సూటిగా చెప్పాలంటే వచ్చే ఏడాది మార్కెట్లోకి వచ్చే స్మార్ట్‌ఫోన్లు అత్యాధునిక ఫీచర్లతో మరింత గ్రాండ్‌గా, లైట్‌గా, స్మార్ట్‌గా రాబోతున్నాయి. ఇప్పటికే ఇటువంటి నవతరం ఆవిష్కరణలకు రంగం సిద్ధమైంది. హ్యాండ్‌సెట్ అంటే కేవలం మాట్లాడేందుకు మాత్రమే కాకుండా యజమాని దర్పాన్ని, హోదాను చాటేదిగా ఉండాలన్నది నేటి తరం వినియోగదారుల మాట. అందుకే హైరిజల్యూషన్ కెమెరా, ఆన్-డిమాండ్ మూవీ స్క్రీన్, పోర్టబుల్ మ్యూజిక్ సిస్టమ్, ఎటువంటి పనినైనా సుల భంగా చేసుకునేందుకు వీలు కల్పించే ఎన్నో రకాల యాప్‌లు.. ఇటువంటి టెక్ వింత లన్నీ కేవలం ఒకే డివైజ్‌లో చేరి మన అరచేతిలో ఇమిడిపోతున్నాయి. ఇటువంటి హ్యాండ్‌సెట్లతో ఈ ఏడాదంతా హవా కొనసాగిచిన తయారీదారులు వేర్వేరు ధరల్లో కొత్త మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చి 2018లో తమ పోర్టుఫోలియోను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతు న్నారు. సాంసంగ్, మైక్రోమ్యాక్స్, వివో లాంటి సంస్థలు వినియోగదారులకు ఫొటో లు, వీడియోల వీక్షణలో మరింత గొప్ప అనుభూతినిచ్చే 18:9 యాస్పెక్ట్ రేషియో డిస్‌ప్లేతో కూడిన డివైజ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాయి.

వరసగా రెండవరోజూ... నిలకడగా సూచీలు



న్యూఢిల్లీ: నూతన సంవత్సరంలో రెండవ రోజు కూగా సూచీలు స్తబ్దతగా ముగిశాయి. వచ్చే నెలలో కార్పొరేట్ సంస్థల ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చేవారం ఫలితాలు ప్రకటించ నున్న ఇన్ఫోసిస్, టిసిఎస్ కంపెనీలపై మదుపరులు ఆశావాహన్ని వ్యక్తబరచినట్లు తెలుస్తోంది. బుధవారం ప్రకటించ నున్న ఫెడరల్ రిజర్వు మినిట్స్‌పై ట్రేడర్లు పూర్తి జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. 2018-19 బడ్జెట సమావేశాలు ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టనున్న నేపధ్యం, రిజర్వు బ్యాంకు సమీక్షా సమావేశంతో మార్కెట్లు సడలించబడతాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్లడించింది. 30షేర్ల బిఎస్‌ఇ ఇండెక్స్ సెన్సెక్స్ 0.49పాయింట్లతో 33,812.26 వద్ద ముగిసింది. 50షేర్ల ఎన్ఎస్ఇ నిఫ్టీ 6.65 పాయింట్లతో 0.06శాతంతో 10,442.20 వద్ద ముగిసింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో, రియల్టీ ఇండెక్స్ 0.99శాతం, హెల్త్‌కేర్ రంగాలు 0.71శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.61శాతం నష్టపోయాయి. మెటల్ ఇండెక్స్ 0.43శాతం, ఆటో 0.16శాతం, విద్యుత్తు 0.08 శాతం లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ పిఎస్‌యు బ్యాంకింగ్ 2శాతానికి దిగజారింది. డిసెంబరు 18 అనంతరం 2శాతానికి దిగజారడం ఇదే ప్రథమం. బ్యాంక్ ఆఫ్‌బరోడా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా 1.5శాతం నష్టాల్లో ముగిసింది. ముడిచమురు కంపెనీలు అత్యల్పంగా ట్రేడయ్యాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్ బ్యారెల్ 67.27 డాలర్లకు చేరింది. 2015మే తరువాత ఇంత అత్యధిక రేటుకు నమోదుకావడం ఇదే ప్రథమం.

ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల మధ్య ఒపెక్ దేశాలకు, రష్యాకు సరఫరా నిలిపివేసినట్లు తెలుస్తోంది. హిందుస్థాన్ పెట్రోలియం కార్ప్ 2.7శాతానికి దిగజారింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ 1.9శాతం నష్టపోయింది. విదేశీ మదుపరులు సుమారు రూ.325.91 కోట్లు విలువైన షేర్ల కొనుగోలు చేయగా దేశీయమదుపరులు రూ.1300.31 కోట్ల కొనుగోలు చేశారు. జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 0.5శాతం పెరిగాయి. జపాన్ నిక్కీ మార్కెట్‌ను పండుగ సందర్భంగా మూసివేశారు. ఎస్ అండ్ పి 500 షేర్లు 0.15శాతం పెరిగాయి. షాంఘై బ్లు చిప్ కంపెనీల 1శాతం పెరిగాయి.

ఐదు టెలికం సంస్థలపై కొరడాకు రెడీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన ఐదు టెలికం సంస్థల నుంచి రూ.2,578 కోట్లు వసూలు చేసేందుకు టెలికం విభాగం (డీఓటీ) సిద్ధమవుతున్నది. టాటా టెలీ సర్వీసెస్, టెలినార్, రిలయన్స్ జియో, వీడియోకాన్ టెలి కం, క్వాడ్రంట్ సంస్థలు తమ రాబడులను తక్కువగా చూపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కొద్ది రోజుల క్రితం తమ నివేదికలో స్పష్టం చేసిన విషయం విదితమే. దీంతో ఈ ఐదు సంస్థల నుంచి రూ.2,578 కోట్లను రికవరీ చేసేం దుకు డీఓటీ త్వరలో డిమాండ్ నోటీసులు జారీ చేయ నుందని అధికార వర్గాలు వెల్లడించాయి. పైన పేర్కొన్న ఐదు సంస్థలు తమ ఆదాయాన్ని రూ.14, 800 కోట్లకు పైగా తక్కువగా చూపి ప్రభుత్వానికి లైసెన్సు ఫీజులో రూ.1,015.17 కోట్లు, స్పెక్ట్రమ్ వినిమయ చార్జీల్లో రూ.511.53 కోట్లు, చెల్లింపులు ఆలస్యమైనందుకు చెల్లించాల్సిన వడ్డీలో రూ.1,052.13 కోట్లు తక్కువగా చెల్లించడంతో ఖజానాకు దాదాపు రూ.2,578 కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ విధంగా ప్రభుత్వానికి రావలసిన రాబడిలో టాటా టెలీ సర్వీసెస్ నుంచి రూ.1,893.6 కోట్లు, టెలినార్ నుంచి రూ.603.75 కోట్లు, వీడియోకాన్ నుంచి రూ.48.08 కోట్లు, క్వాడ్రంట్ నుంచి రూ.26.62 కోట్లు, రిలయన్స్ జియో నుంచి రూ.6.78 కోట్లు తగ్గిందని కాగ్ ఈ నెల 19వ తేదీన పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొంది. దీంతో ఈ ఐదు సంస్థల నుంచి రూ.2,578 కోట్లను రికవరీ చేసేందుకు టెలికం విభాగం మరికొద్ది రోజుల్లో డిమాండ్ నోటీసులు జారీచేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

అంబుడ్స్‌మన్ ఏర్పాటులో జాప్యంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన: ఇదిలావుంటే, టెలికం రంగంలో వినియోగ దారుల సమస్యలను పరిష్కరించేందుకు అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతుండటం పట్ల పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలంటూ మార్కెట్ నియంత్రణ సంస్థ ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇప్పటికే రెండుసార్లు సిఫారసు చేసినప్పటికీ ఈ విషయంలో జాప్యం కొనసాగుతుండటం విచారకరమని ఆ కమిటీ పేర్కొంది. టెలికం రంగంలో ప్రస్తుతమున్న వ్యవస్థ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఏమాత్రం సరిపోవడం లేదని, కనుక ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల ఫిర్యాదులను, ఆర్థిక క్లెయిములను వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి తీసుకొచ్చేలా ఆ చట్టాన్ని సవరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఐటీ రంగానికి చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది.

విజ్ఞానం



చేపలతో తెలివితేటలు, మంచి నిద్ర

వారానికోసారి చేప వినియోగంతో మంచి నిద్రపట్టడంతో పాటు పిల్లలో ఐక్యు శాతం పెరుగుతుందని నిపుణులుసూచిస్తున్నారు. చేపల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ తెలివితేటలను పెంచడంతోపాటు మంచి నిద్రకుసహకరిస్తుంది. 9-11ఏళ్ల పిల్లలపై చేపట్టిన పరిశోధనలో భాగంగా 54శాతం బాలురుకాగా 46శాతం బాలికలున్నారు. అసలు చేపలు ఆహారంలో వినియోగించని వారితో పోల్చి చూస్తే వినియోగించిన వారిలో పిల్లలు ప్రశ్నలకు తగిన రీతిలో సమాధానాలిచ్చినట్లు వెల్లడైంది. 4.8పాయింట్లు అధికంగా పాయింట్స్ సంపాదించారు. నిద్ర క్వాలిటీలో మార్పుఉన్నట్లు తెలుస్తోంది. ఒమేగా 3 సప్లిమెంట్స్‌తో యాంటిసోషల్ బిహేవియర్ తగ్గుదలతోపాటు ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపింది. రెండేళ్ల వయసునుండే చేపలను ఆహారంగాపిల్లలకుపెట్టవచ్చు.



కొబ్బరితో ఎన్నిలాభాలో...

కొబ్బరిని ఆహారంలో,సౌందర్యపోషకంగా కూడా వినియోగించవచ్చు. చర్మానికి తేమ కలిగించే కొబ్బరి నూనె టోనర్, మేకప్ రిమూవర్‌గా తోడ్పడుతుంది. పలు ఆహార పదార్థాలతో పాటు కొబ్బరిని వినియోగించడంతో మంచి రుచితోపాటు ఫ్లేవర్‌కూడా కలిగిస్తుంది. కుకీస్,కేక్ తయారీలో కొకోనట్ పాల వినియోగింతో జీర్ణక్రియ మరింత సాఫీగాజరుగుతుంది. ఆలివ్ ఆయిల్‌తో కోకోనట్ ఆయిల్ మిళితం చేస్తే సలాడ్ రుచికరంగా ఉంటాయి. ప్రకృతి సిద్ధమైన మాయిశ్చరైజర్‌గా కొబ్బరి నూనె పనిచేస్తుంది. చర్మం మెరుస్తూ ఉంటుంది. కొబ్బరిలోఉండే ఫ్యాట్స్ సూక్ష్మరంధ్రాలనుమినిమైజ్ చేసి బాక్టీరియా లోనికి వెళ్లకుండా నివారిస్తుంది. కొబ్బరినూనెతో వంటకాలుకూడా అతి సుమధురంగా ఉంటాయి.

ఎస్‌బీఐ యమబాదుడు

మినిమమ్ బ్యాలెన్స్ పేరిట రూ.1,771కోట్లు దోపిడీ



హైదరాబాద్: బ్యాంకు ఖాతాలో కనీస నగదు నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) లేకుంటే ఆయా బ్యాంకులు రుసుము వసూలు చేస్తాయి. అలాంటి ఖాతా దారుల నుంచి ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు రూ.1771 కోట్లు వచ్చాయి. 2017 ఏప్రిల్-నవంబరు మధ్య ఆయా ఖాతాల నుంచి ఎస్‌బీఐ ఈ ఛార్జీలను వసూలు చేసిందని నివేదికల ద్వారా వెల్లడైంది. జులై-సెప్టెంబరు త్రైమాసికానికి బ్యాంకు నికర లాభం రూ.1.581.55 కోట్ల కన్నా ఇది ఎక్కువ కాగా, ఏప్రిల్-సెప్టెంబరు మధ్య వచ్చిన నికరలాభం రూ.3,586 కోట్లలో సగం రుసుముల ద్వారా వచ్చిన ట్టైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కనీస నగదు నిల్వపై ఎస్‌బీఐ ఎలాంటి ఛార్జీలను వసూలు చేయలేదు. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఛార్జీలను వసూలు చేయాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. ఎస్‌బీఐలో మొత్తం 42 కోట్ల పొదుపు ఖాతాలు ఉండగా, అందులో 13 కోట్లు సాధారణ పొదుపు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలే కావడం గమనార్హం. అయితే వీటిపై ఎలాంటి ఛార్జీలను ఎస్‌బీఐ వసూలు చేయలేదు. కొత్త సంవత్సర కానుకగా సోమవారం ఎస్‌బీఐ 30 బేసిస్ పాయింట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. దీని వల్ల వడ్డీరేటు బీపీఎల్ఆర్ విధానంలో కొనసాగుతున్న 80లక్షల మంది రుణ గ్రహీతలకు కొంత భారం తగ్గనుంది.

వాహన విక్రయాల్లో రెండంకెల వృద్ధి



న్యూఢిల్లీ : గతేడాది చివరి నెలలో వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. అమ్మకాలను పెంచుకోవడానికి పలు సంస్థలు భారీగా రాయితీలు ప్రకటించడంతో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ, హోండా కార్స్‌లకు చెందిన వాహనాలకు అధిక డిమాండు నెలకొన్నది. హ్యుందాయ్, యుటిలిటీ వాహన తయారీలో అగ్రగామి సంస్థ మహీంద్రాలకు నిరాశే ఎదురైంది. గతనెలలో మారుతి 1,19,286 యూనిట్ల విక్రయాలు జరిపింది. 2016 డిసెంబర్ ఇదే నెలలో విక్రయించిన 1,06,414లతో పోలిస్తే 12.1 శాతం పెరుగుదల కనిపించింది. గత నెలలో 26 శాతం వృద్ధితో 12,642 వాహనాలను విక్రయించినట్లు హోండా కార్స్ ప్రకటించింది. మొత్తం ఏడాదికిగాను 15 శాతం వృద్ధితో 1,78,755 యూనిట్లు అమ్మింది. 2017లో అన్ని రంగాల్లో మెరుగైన పనితీరు కనబరిచినదని, ముఖ్యంగా సిటీ, డబ్ల్యూఆర్-వీ మోడళ్లకు ఊహించని డిమాండ్ నెలకొన్నదని హోండా కార్స్ ప్రెసిడెంట్, సీఈవో యోచిరో తెలిపారు. హ్యుందాయ్ మోటార్ అమ్మకాలు స్వల్పంగా పెరిగి 40,158 యూనిట్లకు చేరుకున్నాయి. 2017 సంవత్సరానికిగాను సంస్థ 5,27,320 కార్లను విక్రయించింది. మొత్తంమీద గత నెలలో మహీంద్రా అండ్ మహీంద్రా 39,200 వాహ నాలను అమ్మింది. 2016 ఇదే నెలలో అమ్మిన 36,464 యూనిట్లతో పోలిస్తే 8 శాతం వృద్ధి కనబరిచింది. కమర్షియల్ వాహన విభాగంలో రాణించడం కంపెనీకి కలిసొచ్చినదని మ హీంద్రా ప్రెసిడెంట్ రాజన్ వాధేరా తెలిపారు. ద్విచక్ర వాహన విషయానికి వస్తే టీవీఎస్ అమ్మకాలు 39 శాతం ఎగబాకి 2,56,909 యూనిట్లకు చేరాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో సంస్థ 1,84,944 విక్రయాలు జరిపింది.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో

మొక్కజొన్నలో దిగుబడులు

- చీడపీడలపై అప్రమత్తత అవసరం
- అశ్రద్ధ చేస్తే అధిక దిగుబడులపై ప్రభావం
- శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మొక్కజొన్న సాగులో చీడపీడలను సమర్థవంతంగా నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు తీసుకుంటూ సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే మొక్కజొన్న సాగుతో సిరుల పంట పండించుకోవచ్చు.

దాళ్వాలో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా సాగుచేసే అరుతడి పంటల్లో ఒకటి మొక్కజొన్న. ఆ పంటను సాగుచేసేటప్పుడు వివిధ రకాల చీడపీడలు పైరును ఆశిస్తాయి. ఈ చీడపీడల ఉధ్రుతిని నివారించేందుకు రైతులకు ముందస్తు అవగాహన అవసరం. మొక్కజొన్న సాగులో వచ్చే తెగుళ్లు, పురుగుల నివారణపై శాస్త్రవేత్తల సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

ఆశించే చీడపీడలు

పైరు మొలకెత్తిన 10-20 రోజులకు రెండు రకాల కాండం తొలిచే పురుగులు (మచ్చల కాండం తొలిచే పురుగు/ గులాబీరంగు కాండం తొలిచే పురుగు) ఆశించి, నష్టం కలిగిస్తాయి. నీటి నష్టం వల్ల ఆకులపై తెల్లటి మచ్చలు లేత ఆకులు విచ్చుకుంటున్నపుడు పొడవాటి సన్నని రంధ్రాలు వరుసక్రమంలో కనిపిస్తాయి. అంకురానికి నష్టం కలిగించడంవల్ల మొవ్వ చనిపోయి, ఎండిపోతుంది. ఇవి పూతతోపాటు కంకిని కూడా ఆశిస్తాయి. వీటి నివారణకు పైరు మొలకెత్తిన 10-12 రోజులకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 25-30 రోజులకు ఉధ్రుతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున ఆకుల సుడుల్లో వేసుకోవాలి.



ఆకు ఎండు లక్షణాలు

ఈ తెగులు ఆశిస్తే ఆకులపై పొడవైన కోలాకారపు బూడిత రంగుతో కూడిన ఆకుపచ్చ లేద గోధుమ వర్ణం మచ్చలు ఏర్పడతాయి. ముందుగా ఇవి కింద ఆకులపై కనిపించి, క్రమేణా పై ఆకులపై వ్యాపిస్తాయి. మొక్కలు ఎండిపోయినట్లుగా కనిపిస్తాయి. కండెలపై, పొట్టుపై కూడా వ్యాపిస్తాయి.

తుప్పు తెగులు

ఈ తెగులు ఆశిస్తే ఆకులపై రెండువైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కులు ఏర్పడతాయి. క్రమంగా ఇవి నలుపు వర్ణానికి మారతాయి. ఆకు ఎండుతెగులు, తుప్పు తెగులు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున మాంక్‌జెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

పూత తరువాత బొగ్గుకుళ్లు తెగులు

పూత దశ తరువాత నేలలో తేమశాతం తగ్గడం, వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడం జరిగితే బొగ్గుకుళ్లు తెగులు ఆశిస్తుంది. దీని శిలీంద్రం వేర్ల ద్వారా కాండంలోకి ప్రవేశించి, పైభాగానికి వ్యాపిస్తుంది. పంట కోతకు ముందు కాండం విరిగి మొక్కలు నేలపై పడతాయి. దీని నివారణకు నేలలో తగినంత తేమ ఉండేటట్లు



చూసుకోవాలి. వేసవి దుక్కులు చేయాలి. ట్రైకోడెర్మా విరిడీ శిలీంద్రాన్ని పశువుల ఎరువులో వృద్ధి చేసి, 3-4 ఏళ్లు వరుసగా నేలలో వేయాలి.

పాముపొడ తెగులు ఆశిస్తే

ఈ తెగులు ఆశిస్తే నేలకు దగ్గరగా ఉండే ఆకులపై పాముపొడ మాదిరిగా బూడిత, గోధుమ రంగులో మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా ఆకులు కాండానికి వ్యాపిస్తాయి. మొక్కల కణుపుల వద్ద విరిగి నేలపై పడిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి కార్బెండిజమ్ ఒక గ్రాము లేదా ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీలీటర్లను కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి.

వరి చేలల్లో కాలి బాటలతో ప్రయోజనాలెన్నో



దాళ్వాలో వరి ఊడ్పుల సమయంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి. ఇందువల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. విత్తనాన్ని వెదజల్లడం, డ్రమ్ సీడర్‌ను ఉపయోగించి విత్తనాలు నాటడం వంటి సాగు విధానాల్లో ఏది చేసినా కాలిబాటలు తీయడం మరువకూడదు. వీటికోసం రైతులు అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. పైగా సాగులో భవిష్యత్తులో ఎదురయ్యే జఠిల సమస్యలు పరిష్కరించేందుకు దోహదపడతాయి. పంట కాలంలో రైతులకు ఎదురయ్యే సమస్యలను ఈ కాలిబాటలు పరిష్కరిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఊడ్పుల్లో కాలిబాటలు ఇలా..

▸▸ వరినాట్లు వేసేటప్పుడు కాలిబాటలను వేయాలంటే ముందుగానే రెండు గట్ల మధ్య తాళ్లు లాగి, ఆ ప్రదేశాన్ని వదిలి, మిగిలిన రెండుపక్కలా మొక్కలు నాటాలి.

▸▸ చేలో విత్తనాలు వెదజల్లిన రైతులు కూడా కాలిబాటలు తీసుకోవచ్చు.

▸▸ విత్తనాలు చల్లిన 15 నుంచి 20 రోజుల్లోగా పైరు ఎదుగుతున్న సమయంలో బాటలు తీయవచ్చు.

▸▸ ప్రతి రెండు మీటర్లకూ 20 సెంటీమీటర్ల వెడల్పులో మొక్కలను తొలగించాలి.

▸▸ డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసేటప్పుడు ఒక వరుస వేయడం పూర్తయిన తరువాత 20 సెంటీమీటర్ల స్థలాన్ని వదిలి మరో వరుసలో విత్తనాలు వేసుకుంటే బాటలు ఏర్పడతాయి.

నాట్లు వేసిన తరువాత అయితే బాటలు ఇలా తీయాలి..

▸▸ వరినాట్లు వేసిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాట తీయాలి.

▸▸ నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లోపు కాలిబాట తీయడం ఉత్తమం.

▸▸ మందపాటి తాడును చేనుకు అవతలి గట్టున ఒకరు, ఇవతలి గట్టున మరొకరు పట్టుకుని లాగాలి.

▸▸ ఆ తాడు చివర్లను ఒక కట్టెకు కట్టి, గట్టు మీద గుచ్చాలి.

▸▸ ఆ తాడుకు 20 సెంటీమీటర్ల దూరంలో సమాంతరంగా మరో తాడును ఇదే పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలి.

▸▸ రెండు తాళ్ల మధ్య ఉన్న ప్రదేశంలో వచ్చిన మొక్కలను తొలగించాలి.

▸▸ పైరు పలుచగా ఉన్నచోట ఈ మొక్కలను నాటుకోవచ్చు.

చీడపీడలు దూరం

▸▸ వరి దుబ్బులకు ఆశించి, పైరును నష్టం కలిగించే బూడిదరంగు దోమ, తెల్లదోమ, పచ్చ దీపపు పురుగులను సకాలంలో గుర్తించి, వెంటచే సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు ఈ బాటలు ఉపయుక్తమవుతాయి.

▸▸ కాలిబాటలు ఉంటే పొలం నుంచి ఎప్పటికప్పుడు మురుగునీటిని తీసివేయడం సులువుగా ఉంటుంది. ఈ కారణంగా గొట్టాల పురుగు, నాము పురుగు ఉధ్రుతి తగ్గుముఖం పడుతుంది. కాలిబాటల చివర్ల పంగల కర్రలు కడితే, పక్షులు వాటిపై చేరి, హానికారక కీటకాలను తినివేస్తాయి.

అంతర సేద్యం సులభమే

వరిచేలో అంతర సేద్యానికి కాలిబాటలు ఎంతగానో దోహదపడతాయి. కూలీలతో కలుపు తీయించడానికి ఇవి బాగా అనువుగా ఉంటాయి. అనేక రకాల పురుగులకు ఆశ్రయమిచ్చే ఊద, తూటుకాడ వంటి కలుపు మొక్కలను తేలికగా తీసివేయవచ్చు. చేలో ఎలుక బొరియల్ని గుర్తించడం, అవసరమైన నివారణ చర్యలను చేపట్టడం కూడా సులభమే. కేళీల్లో అరుదైన రకాలను కూడా కాలిబాటల వల్ల ఒత్తుగా ఉన్న మొక్కలను తీసి, పైరును పలుచన చేయడం తేలిక అవుతుంది.

కోత దశలో ఉపయుక్తమయ్యే బాటలు

వరికోత దశలో కూడా ఈ బాటలు ఎంతగానో రైతుకు ఉపయుక్తమవుతాయి. పంట కోత కోసే దశలో రైతుకు కలిగే నష్టాన్ని నివారిస్తాయి. పంట కోసేటప్పుడు వంగిపోయిన మొక్కలను నిలబెట్టే ప్రక్రియకు ఇవి దోహదపడతాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దుబ్బులు నేలకు ఒరిగితే వాటిని నిలబెట్టుకోవచ్చు. ఈ బాటలు లేకపోతే పంట రాపిడికి గింజలు రాలిపోతాయి. కోత ఖర్చు కూడా పెరుగుతుంది.

బాటలతో బహుళ ప్రయోజనాలు

- కాలిబాటల విధానంతో వరిపైరుకు గాలి, వెలుతురు పుష్కలంగా అందుతాయి.
- కిరణజన్య సంయోగక్రియ బాగా జరుగుతుంది.
- మొక్కల్లో పత్రహరితం బాగా ఉత్పత్తి అవుతుంది.
- పంటకు ఎంత నీరు అవసరమో అంతమేరకే ఎప్పటికప్పుడు బాటలు అందిస్తాయి.
- సాగునేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్లడానికి ఈ కాలిబాటలు దోహదపడతాయి.
- మొక్కలకు మంచి పోషకాలను ఇవి అందిస్తాయి.
- మంచి దిగుబడులు పొందేందుకు ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి.
- పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది.
- గాలి సమృద్ధిగా మొక్కకు సోకడంతో కావలసినంత ఆక్సిజన్‌ను పొందేందుకు మొక్కలకు పెద్దగా ఖర్చుకాదు.
- కాలిబాటలతో కలుపు నివారణ, పిచికారీలకు అనువుగా ఉంటుంది.
- ఎరువులను పొలమంతా సమానంగా వేయడానికి వీలవుతుంది.
- పొలమంతా తిరిగి, పైరు ఎదుగుదలను చూసుకునే అవకాశం ఉంటుంది.

'మూడు పువ్వులు ఆరు కాయలు' రెడీ!



ప్రేమ గొప్పదే.. జీవిత లక్ష్యం ఇంకా గొప్పది. ప్రేమంటే చంపటమో చావటమో కాదు, చచ్చేదాకా కలిసి బ్రతకటం. కన్నవాళ్ల కలలతో పాటు, ఆశించిన లక్ష్యాన్ని చేరుకోగలిగితే ప్రతి ఒక్కరి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది అనే కథాంశంతో స్మైల్ పిక్చర్స్ ఓ సినిమాను తెరకెక్కిస్తోంది. దాదాపు 40 చిత్రాలకు పైగా సంభాషణల రచయితగా పనిచేసిన రామస్వామి దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రానికి 'మూడు పువ్వులు ఆరు కాయలు' అనే టైటిల్ ను ఖరారు చేశారు. షూటింగ్ పూర్తయింది. అర్జున్ యజత్, భరత్ బండారు, రామస్వామి హీరోలుగా నటించారు. సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి నాయికలు. డాక్టర్ మల్లె శ్రీనివాసరావు సమర్పిస్తున్నారు. వబ్బిన వెంకటరావు నిర్మాత. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి. ఈ చిత్రంలో కడుపుబ్బా నవ్వించే హాస్యరసంతో పాటు, కంటతడి పెట్టించే కరుణరసం కూడా ఉంటుంది. దాదాపు నలభై చిత్రాలకు పైగా మాటల రచయితగా పనిచేసిన రామస్వామి మొదటిసారి దర్శకత్వం వహిస్తున్నారు అని చెప్పారు.

షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి అని సమర్పకుడు డాక్టర్ మల్లె శ్రీనివాసరావు అన్నారు. చాలా చిత్రాలకు మాటల రచయితగా పనిచేశాను. దర్శకుడిగా ఇదే నా తొలి చిత్రం. మంచి కాన్సెప్ట్‌తో సకుటుంబాన్ని అలరించేలా తెరకెక్కించాను అని దర్శకుడు తెలిపారు.

అర్జున్ యజత్, భరత్ బండారు, రామస్వామి, సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి, తనికెళ్ల భరణి, కృష్ణభగవాన్, పృథ్వి, అజయ్ ఘోష్, బాలాజీ, డా. మల్లె శ్రీనివాసరావు, రాకెట్ రాఘవ, జబర్దస్త్ ఆటో రామ్‌ప్రసాద్ కీలక పాత్రధారులు. ఈ సినిమాకు సాహిత్యం: చంద్రబోస్, భాస్కరభట్ల, ఫైట్స్: మార్షల్ రమణ, ఎడిటింగ్: ఉపేంద్ర, కెమెరా: ఎం.మోహన్ చంద్, ఆర్ట్: కె.వి.రమణ, సంగీతం: కృష్ణ సాయి, నిర్మాత: వబ్బిన వెంకట రావు, కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-దర్శకత్వం: రామస్వామి

విశాలాంధ్ర సినిమా

సినిమాలే ఫస్ట్ లవ్ : రకుల్



టాలీవుడ్‌లో వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు రకుల్ ప్రీత్ సింగ్. మరోపక్క బాలీవుడ్‌లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. ఇలా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఒకేసారి నటిస్తుండడం కష్టంగా అనిపించడంలేదా అని రకుల్‌ని అడిగితే ఆమె ఇచ్చిన సమాధానం ఇది. 'సినిమా ప్రపంచంలోకి రావాలన్నది నా కల. నాకు నచ్చిన రంగంలోనే ఉన్నందుకు సంతోషంగా ఉంది. సినిమాలే నా ఫస్ట్ లవ్. నా మాతృ భాష పంజాబీ. కానీ ఇప్పుడు పంజాబీ కంటే తెలుగు బాగా మాట్లాడుతున్నాను. 2018 నూతన సంవత్సరంలో నేను ఒకటి నిర్ణయించుకున్నాను. అదేంటంటే.. ఇక నుంచి నేను నటించే తెలుగు సినిమాలకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటాను. కెమెరా ముందు ఎంత సేపు ఉండమన్నా ఉంటాను. కెమెరా ముందు నిలబడితే నాకు కలిగే ఆనందం ప్రపంచంలో మరెక్కడా నాకు దొరకదు. ఏకదాటిగా 12 గంటలు కెమెరా ముందు ఉండమన్నా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. నాకు సినిమాలపై ఉన్న ఆసక్తి అలాంటిది.' అని చెప్పుకొచ్చారు రకుల్.

ప్రస్తుతం రకుల్ హిందీలో 'అయ్యారీ' సినిమాతో బిజీగా ఉన్నారు. ఇందులో రకుల్‌కి జోడీగా సిద్దార్థ్ మల్హోత్రా నటించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా రకుల్ సినిమాలపై తనకున్న ఇష్టాన్ని ఇలా పంచుకున్నారు.

మర్ల పులి థియట్రికల్ ట్రైలర్ విడుదల



వరుణ్ సందేశ్ ప్రత్యక పాత్రలో అర్చన వేద ,పోసాని కృష్ణ మురళి ,ముఖ్య పాత్రలో సుధాకర్, భవాని శంకర్ బి.సుధాకర్ రెడ్డి ఐ.యస్.దినకర్ రెడ్డి సంయుక్తంగా డి.రామకృష్ణ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం మర్లపులి. ఇటీవలే సైరా నరసింహారెడ్డి సంస్థా కార్యాలయంలో చిత్ర దర్శకులు సురేందర్ రెడ్డి థియట్రికల్ ట్రైలర్ లాంచ్ చేసారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ట్రైలర్ చూసాను చాలా బాగుంది ఈ చిత్రాన్ని మన తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు.ఈ చిత్ర దర్శకుడు రామకృష్ణకు, చిత్ర సభ్యులకు ఆల్ ది బెస్ట్ అని అన్నారు. ఈ సందర్భంగా వాకడ అప్పారావు మాట్లాడుతూ చిత్ర దర్శకుడు రామకృష్ణ మంచి ప్రతిభ ఉన్న యువకుడు, మా సూపర్ గుడ్ ఫిలిమ్స్ సంస్థలో సహాయ దర్శకుడిగా చాలా సినిమాలకు పని చేసాడు.ఈ చిత్రంలో కొత్తదనం చాలా ఉంది. అన్ని వర్గాలకి ఈ చిత్రం నచ్చుతుంది. చిత్ర దర్శకుడు డి.రామకృష్ణ మాట్లాడుతూ స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మర్లపులి ట్రైలర్ లాంచ్ చేసినందుకు సంతోషంగా ఉంది. అర్చన వేద క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. మంచి నటనకు ప్రాముఖ్యం ఉన్న పాత్రని పోషించారు. ఈ చిత్రంతో నటిగా మంచి గుర్తింపు వస్తుంది. వరుణ్ సందేశ్ క్యారెక్టర్ మర్లపులి చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పోసాని మురళి కృష్ణ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది అని అన్నారు. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ అర్చన వేద, పోసాని మురళి కృష్ణ, తాగుబోతు రమేష్, భాను శ్రీ, చమ్మక్ చంద్ర, రమణారెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ సదానందం అండ్ కిషోర్. సంగీతం బి ఎస్ రెడ్డి, కెమెరా ఏం మురళి కృష్ణ. నిర్మాతలు భవాని శంకర్, బి.సుధాకర్ రెడ్డి, ఐ ఎస్ దినకర్ రెడ్డి, రచన దర్శకత్వం డి రామకృష్ణ.

వైఎస్సార్ బయోపిక్‌లో మమ్ముట్టి?

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి జీవితాధారంగా ఓ బయోపిక్ రాబోతోంది. ఇందులో రాజశేఖర్ పాత్రలో ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి నటించనున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. గతంలో ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్.. నటుడు రాజశేఖర్‌తో కలిసి వైఎస్సార్ బయోపిక్ తీయాలని అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఇప్పుడు 'ఆనందో బ్రహ్మ' లాంటి బ్లాక్ బస్టర్ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు మహి వి. రాఘవ్ వైఎస్సార్ బయోపిక్ తెరకెక్కించనున్నారు. ఇందుకు వైఎస్సార్ కుమారుడు, వైకాపా అధినేత జగన్ కూడా ఒప్పుకున్నట్లు సమాచారం. త్వరలో బయోపిక్‌కు సంబంధించిన వివరాలను రాఘవ్ ప్రకటిస్తారట. ఇప్పటికే టాలీవుడ్‌లో బయోపిక్‌ల హవా మొదలైంది. అలనాటి నటుడు నందమూరి తారక రామారావు జీవితాధారంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' బయోపిక్‌ను తెరకెక్కిస్తున్నారు. మరోపక్క బాలకృష్ణ ఓ సినిమా తీస్తున్నారు. అలనాటి నటి సావిత్రి జీవితాధారంగా 'మహానటి' సినిమా సిద్ధమవుతోంది.

సూర్య కొత్త చిత్రం ప్రారంభం



'గజిని', 'సింగం' చిత్రాల హీరో సూర్య, 'ఫిదా', 'ఎంసీఏ' చిత్రాల హీరోయిన్ సాయిపల్లవి జంటగా '7జి బృందావన కాలని', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' చిత్రాల దర్శకుడు సెల్వ రాఘవన్ దర్శకత్వంలో 'ఖాకి' వంటి హిట్ చిత్రాన్ని అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్‌బాబుల కొత్త చిత్రం షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. సీనియర్ హీరో శివకుమార్, సూర్య, కార్తీ ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ "నా గత 35 చిత్రాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. సెల్వ రాఘవన్ చెప్పిన సబ్జెక్ట్ చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. కమర్షియల్ వేల్యూస్ ఉంటూ అందర్నీ ఆకట్టుకునే చిత్రమిది. ఇందులో హీరోయిన్ సాయిపల్లవి క్యారెక్టర్‌కి కూడా మంచి ఇంపార్టెన్స్ ఉంటుంది" అన్నారు. దర్శకుడు సెల్వ రాఘవన్ మాట్లాడుతూ "సూర్య లాంటి వెర్సటైల్ హీరోతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ కథకు సూర్య ఒక్కరే యాప్ట్ అని సినిమా చూశాక మీకే తెలుస్తుంది" అన్నారు. నిర్మాతలు ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు మాట్లాడుతూ "సూర్య, సాయిపల్లవి, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో వస్తున్న మంచి సినిమా ఇది. రీసెంట్‌గా మా బేనర్‌లో రూపొందిన 'ఖాకి' మంచి హిట్ అయింది. సూర్య కెరీర్‌లో ఓ పెద్ద హిట్ సినిమా అయ్యేలా డైరెక్టర్ సెల్వరాఘవన్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జనవరి 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి దీపావళికి చిత్రాన్ని రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం" అన్నారు.

సూర్య, సాయిపల్లవి జంటగా నటించే ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శివకుమార్ విజయన్, ఎడిటింగ్: జి.కె.ప్రసన్న, ఆర్ట్: ఆర్.కె.విజయ్ మురుగన్, నిర్మాతలు: ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, దర్శకత్వం: సెల్వ రాఘవన్.

'రంగుల రాట్నం' సంక్రాంతికి రెడీ



2017లో 'రారండోయ్ వేడుక చూద్దాం', 'హలో' వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'రంగుల రాట్నం' చిత్రం ఈ సంక్రాంతి రిలీజ్‌కి రెడీ అవుతోంది. రాజ్ తరుణ్, చిత్రా శుక్లా జంటగా నటించిన ఈ చిత్రానికి శ్రీరంజని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ టోటల్‌గా పూర్తయింది.

ఫైనల్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 'ఉయ్యాలా జంపాలా' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోస్ మళ్ళీ రాజ్ తరుణ్‌తో చేస్తున్న 'రంగుల రాట్నం'. రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా, సితార, ప్రియదర్శి ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఆర్ట్: పురుషోత్తం ఎం., నిర్మాణం: అన్నపూర్ణ స్టూడియోస్, దర్శకత్వం: శ్రీరంజని.



ఉన్మాది మారణకాండ

ఇనుప రాడ్‌తో ఆరుగురి హత్య : నిందితుడు అరెస్టు

చండీగఢ్ : హర్యానాలో ఆర్మీ మాజీ అధికారి ఉన్మాదంతో ఊచకోతకు పాల్పడి కలవరం సృష్టించాడు. రెండు గంటల వ్యవధిలోనే ఒక ఐరన్ రాడ్డుతో ఆరుగుర్ని కొట్టి చంపాడు. పల్వాల్‌లో జరిగిన ఈ హత్యాకాండ కలకలం రేపింది. ప్రస్తుతం వ్యవసాయశాఖలో సబ్ డివిజనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న 45 ఏళ్ల నరేశ్ కదియన్ మాజీ సైనికుడు. 2003లో ఆర్మీ లెఫ్టినెంట్ ఉద్యోగం నుంచి నరేశ్ వాలెంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. 2015లోనూ ఓ పోలీస్ కానిస్టేబుల్‌తో ఆయన గొడవకు దిగారు. నరేశ్ కొన్నాళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు తెలిసింది. భార్యా పిల్లలు ప్రస్తుతం నరేశ్‌కు దూరంగా ఉంటున్నారు. మంగళవారం ఉదయం నరేశ్ ఇనుప రాడ్డుతో రోడ్డుపై హల్‌చల్ చేశాడు. ముందు దగ్గర్లోని ఓ ఆసుపత్రికి వెళ్లి అంజుమ్ అనే మహిళను దారుణంగా చంపేశాడు.

ఎవ్వరికీ కన్పించకుండా అక్కడి బాత్‌రూమ్‌లో దాక్కున్నాడు. ఆ తర్వాత బయటికి వెళ్లి మరో ఐదుగురిని హతమర్చాడు. ఈ హత్యలు మంగళవారం ఉదయం 2 నుంచి 4 గంటల మధ్య జరిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు నరేశ్‌ను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా వారిపై దాడికి దిగాడు. ఎట్టకేలకు అతనిని అరెస్టు చేశారు. చికిత్స నిమిత్తం ఫరీదాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. వరుస హత్యల నేపథ్యంలో హర్యానా పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించారు. హతులలో ఇద్దరు సెక్యూర్టీ గార్డులు, ఓ మహిళ ఉన్నట్లు గుర్తించారు.

వెన్నుపోటు వల్లే...

సబంగ్ ఉపఫలితంపై టీఎంసీ, కాంగ్రెస్ అంతర్మథనం

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లోని సబంగ్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై అధికార టీఎంసీ, ప్రతిపక్ష కాంగ్రెస్ ఆత్మశోధనలో పడ్డాయి. ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ మతోన్మాద బీజేపీకి ఓట్లు పెరగడంపై ఆందోళన చెందుతోంది. దీని వెనుక కారణాలను అన్వేషిస్తోంది. తమ పార్టీలో కుట్రదారుల గురించి టీఎంసీ, కాంగ్రెస్ ఆరా తీస్తున్నాయి. సబంగ్ ఉప ఫలితాలలో ఫిరాయింపులే కీలక పాత్ర పోషించాయని రెండు పార్టీలు భావిస్తున్నాయి. సబంగ్ స్థానంలో టీఎంసీకి 1,06,179 ఓట్లు రాగా బీజేపీకి 37,476 ఓట్లు పోలయ్యాయి. వాస్తవంగా 2016 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో బీజేపీకి కేవలం 5,610 లభించాయి. ఇంతపెద్దఎత్తున ఓట్లు పెరగడంపై టీఎంసీ అంతర్మథనంలో పడింది. మనాస్ భూనియా టీఎంసీలోకి ఫిరాయించడం వల్ల సబంగ్‌లో తమ పార్టీకి పెద్దనష్టం జరిగినట్లు కాంగ్రెస్ జిల్లా నాయకత్వం చెప్పుకుంటున్నది. 'మా సొంతవాళ్లే మమ్ములను మోసగించారు. నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. దీనిని టీఎంసీ, బీజేపీ సొమ్ము చేసుకున్నాయి' అని జిల్లా కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. ఉపపోరులో మనాస్ భూనియా భార్య గీతా భూనియా విజయం సాధించారు. మరోవైపు, కాషాయపార్టీకి ఓట్లు పెరగడానికి ఇటీవల బీజేపీలో చేరిన టీఎంసీ మాజీ నేత ముకుల్‌రాయ్ కారణమని పశ్చిమ మిద్నపూర్ జిల్లా టీఎంసీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద తమ పార్టీలో వెన్నుపోటుదారుల కారణంగా బీజేపీకి ఓట్లు పెరిగినట్లు టీఎంసీ, కాంగ్రెస్ అభిప్రాయానికి వచ్చాయి. ముకుల్‌రాయ్ ఒకప్పుడు పార్టీలో రెండోస్థానంలో ఉన్నారు. ఆయనకు జిల్లాపై పూర్తి పట్టు ఉన్నది. ఆయన ద్వారా రాజకీయంగా చాలామంది ఎదిగారు. ఇది కూడా బీజేపీకి బలం పెరగడానికి కారణమై ఉంటుందని అంటున్నారు. ముకుల్‌రాయ్‌తో కలిసి పార్టీకి ఎవరైనా ద్రోహం చేశారా? లేదా తెలుసుకుంటామని టీఎంసీ జిల్లా నేత వ్యాఖ్యానించారు. సబంగ్ ఉపపోరుకు ముందే పార్టీ బహిష్కృత నేత ద్వారా పెద్ద కుట్ర జరిగింది. మా నాయకుల ఫోన్ నెంబర్లు అన్నీ ఆయన వద్ద ఉన్నాయి. వారిని నయానో, భయానో లొంగదీసుకున్నారు. ఈ ఫోన్ నెంబర్లు ఎవరిచ్చారో పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి తెలుసు. ఆ వ్యక్తికి త్వరలో శిక్ష ఉంటుందని టీఎంసీ సీనియర్ నేత, రవాణామంత్రి సువేందు అధికారి చెప్పారు. సబంగ్ ఉపపోరులో బీజేపీ మూడోస్థానంలో నిలిచింది. మొదటిస్థానంలో టీఎంసీ ఉండగా 41,987 ఓట్లతో సీపీఎం రెండోస్థానం దక్కించుకున్నది. టీఎంసీకి గల బలమైన పోలింగ్ బూత్‌లలో బీజేపీకి 8 నుంచి 10 రెట్లు ఓట్లు పెరగడం మమత పార్టీకి మింగుడు పడటం లేదు.

వైద్యచరిత్రలోనే బ్లాక్‌డే

జాతీయ వైద్య కమిషన్‌ను తిరస్కరిస్తున్నాం..

ఇది అప్రజాస్వామికం, అనైతికం : ఐఎంఏ



ముంబై/న్యూఢిల్లీ : జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అమానుషమైనది, అప్రజాస్వామిక మైనదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పేర్కొంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ బిల్, 2017ను ప్రతిపాదించిన బిల్లును మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఐఎంఏకు చెందిన డాక్టర్ పార్థివ్ సింఘ్వి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇది ప్రభుత్వ సంస్థ.. 90శాతం మంది సభ్యులను ప్రభుత్వమే నియమిస్తుంది. కాబట్టి ఐఎంఏకు నేషనల్ కమిషన్ పూర్తి విరుద్ధంగా ఉంటుంది. జాతీయ మెడికల్ కమిషన్ అమానుషమైనది, అప్రజాస్వామికమైనది, అనైతికమైనది, పార్లమెం టుకు విరుద్ధమైనది' అని ఆయనన్నారు. 'నో టు ఎన్ఎంసీ' అన్నది మెడికల్ కమ్యూనిటీ నినాదంగా వెల్లడించారు. 'వైద్యవృత్తి చరిత్రలోనే ఇది బ్లాక్‌డే అనడం తప్ప మరో గత్యంతరాన్ని కేంద్రప్రభుత్వం ఇవ్వలేదు. నేషనల్ మెడికల్ కమిషన్‌ను వైద్య వృత్తిలో ఉన్న ప్రతిఒక్కరితో పాటు రోగులు సైతం ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు' అని సింఘ్వి తెలిపారు. బిల్లును ఎగువసభలో ప్రవేశపెట్టినందుకు నిరసనగా ఐఎంఏ ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చింది. దాదాపు 2.9లక్షల మంది వైద్యులు రోడ్లపైకొచ్చి తమ నిరసనను వ్యక్తంచేశారు. ఈ సమ్మెకు ఫోర్టిస్ హెల్త్‌కేర్ మద్దతు పలికింది. సమ్మెకు సంఘీభావంగా నల్లబ్యాడ్జీలు ధరించాలని నిర్ణయించాం. మా మద్దతును తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తాం. ఓ సంస్థగా రోగుల ఆరోగ్యసంరక్షణకు కట్టుబడి ఉన్నాం. మేం మా వైద్యులకు ఎట్టి అసౌకర్యాన్ని కలగనివ్వం' అని సంస్థ ప్రతినిధి అన్నారు. ఎన్ఎంసీ ముసాయిదా బిల్లును కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టడం విదితమే.

అవినీతికి సింహద్వారం : ఐఎంఏ మాజీ చీఫ్



జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు భవిష్యత్‌లో అవినీతికి దారితీస్తుందని, ఇది అక్రమాలకు సింహద్వారమని ఐఎంఏ మాజీ అధ్యక్షుడు కేకే అగర్వాల్ అన్నారు. ఈ బిల్లుకు ఆమోదం లభించినట్లయితే భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. భాగస్వాములందరూ లేనందున ఇది ప్రాతినిధ్య ఆధారితం కాదని చెప్పారు. నిధులకు సంబంధించి నిబంధనలు లేవు కాబట్టి ఇది కమిషన్ కాదని వివరించారు. ఎన్ఎంసీ బిల్లులో చాలా లోపాలు ఉన్నాయని అగర్వాల్ అన్నారు.

వైద్యవృత్తికి ప్రయోజనకారి : కేంద్రం



మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో జాతీయ మెడికల్ కమిషన్‌ను ప్రవేశపెట్టడం వైద్యవృత్తికి ప్రయోజనకారిగా ఉంటుందని కేంద్రప్రభుత్వం తెలిపింది. ఒక వైపు ఐఎంఏ ఆందోళన చేపట్టగా, మరోవైపు, ఐఎంఏ సందేహాలను నివృత్తి చేసేందుకు చర్చలు జరుపుతున్నామంటూ మంత్రి జేపీ నడ్డా వెల్లడింరు. ఈ బిల్లు వైద్యవృత్తికి ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. 'వారి వాదన విన్నాం.. మా తరపున వివరణ ఇచ్చాం.. ఐఎంఏతో చర్చలు కొనసాగిస్తున్నాం' అని ఆయనన్నారు. ఇదిలావుండగా, వైద్యులు తమ సమ్మెను విరమింపజేసేందుకు కేంద్రం ముందుకు రావాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ అభిప్రాయపడ్డారు.

రాజ్యసభ రికార్డు

జీరో అవర్ అజెండా మొత్తం పూర్తి

న్యూఢిల్లీ : జీరో అవర్‌లోని మొత్తం ఎజెండాని పూర్తి చేసి రాజ్యసభ మంగళవారం రికార్డు సృష్టించింది. ఎజెండాలో ఉన్న అంశాలు, ప్రత్యేక ప్రస్తావనలు అన్నింటినీ రాజ్యసభ నేడు పూర్తిచేసిందని ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు తెలిపారు. "రాజ్యసభ నేడు చరిత్ర సృష్టించింది. మొదటిసారిగా, జీరో అవర్‌లోని అంశాలు, ప్రత్యేక ప్రస్తావనలన్నింటిని పూర్తిచేసింది" అని పెద్దల సభలో సభ్యులు బల్లలు చరుస్తుండగా వెంకయ్యనాయుడు ప్రకటించారు. సభ్యుల సహకారం వల్లనే ఈ రికార్డు సాధ్యమైందని చెప్పారు. "మీ సహకారం బాగుంది. దానితో మా ఆపరేషన్ చాలా సజావుగా సాగిపోయింది. దానితో సభ రికార్డు సృష్టించగలిగింది" అని తెలిపారు. సభ్యుల నుంచి భవిష్యత్‌లో కూడా ఇదే విధమైన సహకారం అందగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సభ్యులు సమయాన్ని వృథా చేయకుండా, షెడ్యూల్‌కు కట్టుబడి ఉంటారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టడానికి ముందు మంత్రులకు వెంకయ్యనాయుడు ఒక సూచన చేశారు. జీరో అవర్‌లో లేవనెత్తిన అంశాలు, ప్రత్యేక ప్రస్తావనలను సంబంధిత మంత్రులు క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా సభ్యులకు సమాధానం ఇవ్వాలని, ఆ విధంగా చేయడం సభ పనితీరును మెరుగుపరుస్తుందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో గత రెండు వారాలుగా వివిధ కారణాల వల్ల సభలో అనేక సందర్భాలలో గందరగోళ దృశ్యాలు నెలకొన్నాయి. వాయిదాలు పడ్డాయి. అందుకు భిన్నంగా ఈ రోజు సభలో ఎజెండాలో ఉన్న పది అంశాలు, అదనంగా రెండు ప్రత్యేక ప్రస్తావనలను చేపట్టింది. మాజీ సభ్యులు పి. మార్గబంధుకు సభ్యులు ఘన నివాళి అర్పించారు.

సభ జీరో అవర్‌లో కాంగ్రెస్ సభ్యులు టి. సుబ్బిరామిరెడ్డి విమానాశ్రయాలలో సమస్యలను ప్రస్తావించారు. మోతీలాల్ ఓరా ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఇతర రాష్ట్రాలలో ఆసుపత్రులలో చిన్నారుల మృతిచెందిన అంశాన్ని లేవనెత్తారు. రాంనాథ్ ఠాకూర్(జేడీ-యూ), ఆర్. వైద్యలింగం (ఏఐఏడీఎంకే), నారాయణలాల్ పంచారియా (బీజేపీ), హుస్సేన్ దల్వాయ్, ఛాయ వర్మ (కాంగ్రెస్) ప్రత్యేక ప్రస్తావనలు చేశారు. ఎస్పీ సభ్యులు నరేష్ అగర్వాల్ జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించారు.

ఎన్ఆర్‌సీలో నిజమైన పౌరులను తొలగించొద్దు

లోక్‌సభలో కాంగ్రెస్ డిమాండు

న్యూఢిల్లీ : అసోం కోసం పౌరుల జాతీయ రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) ముసాయిదా నుంచి నిజమైన పౌరులను తొలగించరాదని కాంగ్రెస్ పార్టీ మంగళవారం రాజ్యసభలో డిమాండు చేసింది. సభ జీరో అవర్‌లో సుస్మితా దేవ్ (కాంగ్రెస్) ఈ అంశాన్ని లేవనెత్తుతూ మొట్టమొదటి ముసాయిదా జాబితా ఇప్పటికే వెలువడిందని చెప్పారు. 2.38 కోట్ల క్లెయిమ్‌లతో కూడిన ముసాయిదా ఎన్ఆర్‌సీని డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రిలోగా ప్రచురించాలని అత్యున్నత న్యాయస్థానం గత ఏడాది నవంబరు 30వ తేదీన ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. అసోంలోని అక్రమ వలసదారులను గుర్తించేందుకు ఎన్ఆర్‌సీని తయారుచేశారు. "నిజమైన పౌరులెవరిని ఈ జాబితా నుంచి తొలగించవద్దని నేను కోరుతున్నాను" అని ఆమె తెలిపారు. 1951కి చెందిన ఎన్ఆర్‌సీని అసోం కోసం అప్‌డేట్ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) మధ్య కుదిరిన త్రైపాక్షిక ఒప్పందానికి అనుగుణంగా ఈ అప్‌డేట్ జరుగుతోంది. 1985 అసోం ఒప్పందం అమలు కోసం 2005లో ఈ త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది.

మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్‌లో గత నెలలో ఏఎస్ఐ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ పార్టీ సభ్యులు జ్యోతిరాదిత్య సింధియా డిమాండు చేశారు. వైర్‌లెస్ టవర్‌కి ఏఎస్ఐ ఉరివేసుకుని ఉండగా కనుగొన్నారు. తనను వేధింపులకు గురిచేసిన పోలీసు అధికారుల పేర్లను రాసుకుని జేబులో పెట్టుకున్నాడని ఒక వార్తా పత్రికలో వచ్చిన వార్తను ఈ సందర్భంగా జ్యోతిరాదిత్య ప్రస్తావించారు. యూనిఫారంలో ఉన్న అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) సతీష్ రఘువంశీ (55) కొట్వాలి, దెహత్ (గ్రామీణ) పోలీసు స్టేషన్ల మధ్య టవర్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా గుర్తించినట్టు వార్తలు తెలిపాయి.

కేంద్రానికి ఆ ఆలోచనే లేదు..

మతాంతర వివాహాలకు ప్రోత్సాహకాలపై మంత్రి సంప్లా



న్యూఢిల్లీ : కులాంతర వివాహాలకు ఇచ్చినట్లుగా మతాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు అందించే యోచన కేంద్రానికి లేదని కేంద్రమంత్రి విజయ్ సంప్లా మంగళవారం తెలిపారు. సామాజిక సమన్వయం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పథకాన్ని మతాంతర వివాహాలకూ వర్తింపజేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి స్పష్టంచేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలో ఒకరు ఎస్సీ అయితే పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1955; ఎస్సీ, ఎస్టీ దురాగతాల నివారణ చట్టం, 1989 కింద కేంద్రం వారికి ప్రోత్సాహకం అందిస్తోంది. అయితే, వివాహాన్ని హిందూ వివాహాల చట్టం, 1955 కింద నమోదు చేసుకోవాల్సి ఉంటుందని సామాజిక న్యాయం, సాధికారత మంత్రి సంప్లా తెలిపారు. కేంద్ర పథకం ప్రకారం రూ.2.5లక్షల ప్రోత్సాహకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50గా పంచుకుంటాయని, కేంద్రపాలిత ప్రాంతాలైతే 100శాతం కేంద్రమే ఇస్తుందన్నారు. అర్హులైన జంటలకు ఇచ్చే రూ.2.5లక్షల ప్రోత్సాహక మొత్తాన్ని పెంచే ఆలోచన కూడా లేదన్నారు. కట్నం తీసుకోకుండా పెళ్లిళ్లు చేసుకున్న వారికి ఇలాంటి ప్రోత్సాహకాలు అందించే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు స్పీకర్ సుమిత్రా మహాజన్ స్పందిస్తూ ' అలాంటి పథకం అమల్లోకి వస్తే.. ఆ మొత్తం ప్రభుత్వం తరపు కట్నమౌతుంది' అని వ్యాఖ్యానించారు.

అట్టుడుకుతున్న ముంబై



ముంబై : ఆర్థిక రాజధాని ముంబై ఘర్షణ, ఆందోళనలతో అట్టుడుకుతోంది. దళితులు, మరాఠా సామాజికవర్గాల మధ్య జరిగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. దళితులు మంగళవారం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు, రాస్తారోకోలు చేపట్టారు. దీంతో ముంబై నగరవ్యాప్తంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. భీమా-కోరెగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా పుణె జిల్లాలో చెలరేగిన హింస ముంబైకి పాకింది. రెండు వర్గాల మధ్య గొడవలతో జనజీవనం స్తంభించి పోయింది. వాహనాలు, లోకల్ రైళ్లు ఆగిపోయాయి. సోమవారం దళితులపై మరాఠాలు దాడులకు దిగడంతో ఓ వ్యక్తి చనిపోవడంతోపాటు పలు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. 1818, జనవరి 1న పీష్వా బాజీరావ్ 2 సేనలపై బ్రిటిష్ సేనలు సాధించిన విజయానికి గుర్తుగా దళితులు సంబరాలు చేసుకున్నారు. అప్పట్లో దళితులు బ్రిటిష్ సేనల్లో భాగంగా ఉన్నారు. ఇది మరాఠా కమ్యూనిటీని ఆగ్రహానికి గురి చేసింది. ఫలితంగా దళితులపై దాడులు జరిగాయి. దీంతో ముంబైలోని తూర్పుహైవే, హార్బర్ లైన్‌లపై ఆందోళనలు చేశారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామైంది. చెంబూర్‌తోపాటు పలు తూర్పు ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. పుణె జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలపై న్యాయ విచారణకు ఆదేశించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరతామని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు.



ముంబై అగ్నిప్రమాదం...

సాహస కానిస్టేబుల్‌కు సత్కారం

ముంబై : జనం వేలం వెర్రిగా సినిమా నటుల వెంట పడుతుంటారు కాని నిజజీవితంలో మానవతా విలువలను పాటించే చాలా మంది రియల్ హీరోలు ఉంటారు. అందుకు పెద్ద, చిన్న పదవుల తేడా ఉండదు. ముంబై కమలామిల్స్ ప్రాంగణంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో అగ్నికీలకల్లో చిక్కుకుపోయిన 9 మందిని కాపాడిన కానిస్టేబుల్ సుదర్శన్ షిండేను ముంబై పోలీసు కమిషనర్, దత్తాత్రేయ పదలల్కర్, మేయర్ విశ్వనాథ్ మహదేశ్వర్ ఘనంగా సత్కరించారు. కమలా ప్రాంగణానికి దగ్గర్లో గస్తీ తిరుగుతున్న షిండే అగ్నికీలకాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయన్న సమాచారం అందుకోగానే వివరాలు తెలుసుకుందామని ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అయితే దానిలో కొంతమంది చిక్కుకున్నారని తెలియగానే మంటల్లో ప్రవేశించి పొగ, అగ్నివేడికి స్పృహకోల్పోయిన వారిని తన భుజాలపై మోసుకొచ్చారని అధికారులు తెలిపారు. మేయర్ అతని సాహసాన్ని కొనియాడుతూ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించడంపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. సాహసానికి దారితీసిన షిండే మొండి పట్టుదల ఎంతగానో ఆకట్టుకుందని, ముంబై ప్రథమ పౌరుడిగా షిండేపట్ల గర్వపడుతున్నానని మహదేశ్వర్ కొనియాడారు. 9 మంది జీవితాలు కాపాడగలిగి నందుకు తనకు సంతృప్తిగా ఉందని అయితే ఆ ఘటనలో 14 మంది మృతి చెందడం తనను కలచి వేసిందని షిండే వినమ్రంగా వెల్లడించారు.

అంతర్గత రక్షణకోసం భారీ మొత్తం

న్యూఢిల్లీ : దేశ అంతర్గత రక్షణకోసం మూడేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చుపెట్టామని కేంద్రం తెలిపింది. కాశ్మీర్, ఈశాన్యరాష్ట్రాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల కోసం రూ.10,132 కోట్లు కేటాయించామని కేంద్రమంత్రి హన్సరాజ్ అహిర్ లోక్‌సభలో వెల్లడించారు. 2017-18 నుంచి 2019-2020 వరకు పోలీసు స్టేషన్లను ఆధునీకరించడానికి అంబ్రెల్లా స్కీమ్‌లో ఈ నిధులు విడుదల చేశామన్నారు. ఇందులో రూ. 18,636 కోట్లను రక్షణ, భద్రత, మహిళా రక్షణ, ఆధునిక ఆయుధాలు, పోలీసుల రవాణా, వంటివాటికోసం కేటాయించగా, దేశంలోని 35 మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకోసం రూ.3000 కోట్లు, ఈశాన్య ప్రాంతాల్లోని పోలీసుల మౌలిక సదుపాయాల పెంపుదల కోసం రూ. 1,215 కోట్లు వినియోగిస్తారు. జమ్ముకాశ్మీర్‌లోని ఎల్‌డబ్ల్యు ప్రభావిత ప్రాంతాలు, ఈశాన్యరాష్ట్రాల ప్రజల జీవిన స్థితిగతులు పెంచడానికి అంబ్రెల్లా స్కీమ్‌ను ప్రవేశపెట్టారు.

టమోటా రైతుల ఇక్కట్లపై చర్యలేవి?

న్యూఢిల్లీ : టమోటా ధరలు రోజు రోజుకి పతనమవుతుండటంపై ఏ చర్యలు తీసుకుంటున్నారని లోక్‌సభలో కాంగ్రెస్ కేంద్రాన్ని నిలదీసింది. జీరో అవర్‌లో కాంగ్రెస్ టమోటా ధరల అంశంను లేవనెత్తింది. దీనిపై సభ్యుల మధ్య తీవ్రంగా వాదోపవాదాలు జరిగాయి. టమోటాకు ఎలాంటి మద్దతు ధర ను నిర్ణయించలేదని వ్యవసాయ శాఖ మంత్రి రాధా మాధవ్ సింగ్ సభకు తెలిపారు.

ప్రముఖ కవి అన్వర్ జలాల్పూరి మృతి

లక్నో(ఉత్తరప్రదేశ్) : భగవద్గీత, గీతాంజలిని ఉర్దూలోకి అనువదించిన ప్రముఖ కవి, రచయిత అన్వర్ జలాల్పూరి(70) మంగళవారం కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ ట్రామాకేర్‌లో తుది శ్వాస విడిచాని ఆయన కుమారుడు షాహ్‌కర్ తెలిపారు. డిసెంబర్ 28న స్నానాల గదిలో అపస్మారక స్థితిలో కనుగొన్న అన్వర్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్టు ఆయన పేర్కొన్నారు. అన్వర్ అంత్యక్రియలు బుధవారం అంబేద్కర్‌నగర్‌లోని ఆయన స్వగ్రామంలో జరగనున్నాయిని షాహ్‌కర్ తెలిపారు.

మంచు తెరల్లో పంజాబ్, హర్యానా

ఛండీగఢ్ (పంజాబ్,హర్యానా) : పంజాబ్, హర్యానాలోని పలు ప్రాంతాలు మంగళవారం మంచు తెరల్లో చిక్కుకున్నాయి. పర్యావసానంగా రైలు, రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాష్ట్రాల్లో పలు పలు ప్రాంతాల్లో సగటు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలకు తగ్గాయని వాతావరణ విభాగం తెలిపింది. బఠిండాలో అత్యల్పంగా 2.7 డిగ్రీలు నమోదు అయ్యాయి. వెలుతురు లేని కారణంగా పలు విమానాలు రద్దు అయాయి. నర్నౌల్‌లో 3.5 డిగ్రీలు, అమృతసర్‌లో 4.2 డిగ్రీలు, సిర్సాలో 4.8 డిగ్రీలు, కర్నాల్‌లో 8 డిగ్రీలు, లూధియానాలో 8.4 డిగ్రీలు నమోదైయాయి.

తాగునీటి సమస్యపై ప్రధాని జోక్యం చేసుకోవాలి

న్యూఢిల్లీ : కర్ణాటక ఎదుర్కొంటున్న తీవ్ర తాగు నీటి సమస్యపై ప్రధాని మోడీ జోక్యం చేసుకోవాలని లోక్‌సభలో కాంగ్రెస్ పేర్కొంది. నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండు చేసింది. కాంగ్రెస్ సభ్యుడు ఎస్పీ ముద్దహనుమె గౌడ ఈ అంశాన్ని జీరో అవర్‌లో ప్రస్తావిస్తూ, ఉత్తర కర్ణాటక తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటుందన్నారు. మహదయి నది నుండి నీరు వల్ల సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందని, అయితే అది రాజకీయ సమస్యగా తయారైందని ఆయన పేర్కొన్నారు.

గవర్నర్ జోక్యంపై డీఎంకే ధర్నా

తంజావూర్ (తమిళనాడు) : స్వచ్ఛ్ భారత్ మిషన్‌ను పర్యవేక్షించేందుకు తంజావూర్ వచ్చిన తమిళనాడు గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్‌కు డీఎంకే నల్ల జెండాలతో నిరసన తెలిపింది. అనేక విషయాల్లో గవర్నర్ మితిమీరి జోక్యం చేసుకుంటున్నారంటూ విమర్శించింది. అయితే, డీఎంకే ఆరోపణలను రాజ్‌భవన్, అధికార అన్నాడీఎంకేతో పాటు రాష్ట్ర బీజేపీ ఖండించాయి. డిసెంబర్‌లో గవర్నర్ కుడలూర్, సలెం జిల్లాల్లో పర్యటించినప్పుడు కూడా డీఎంకే వర్గాలు ఇదే విధంగా స్పందిచాయి.

లోక్‌సభలో పాక్ వ్యతిరేక నినాదాలు

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో డిసెంబర్ 31న సీఆర్పీఎఫ్ జవానులు మరణించిన సంఘటపై లోక్‌సభలో కొందరు బీజేపీ సభ్యులు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదానాలు చేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ ఛాంబర్‌లో ప్రవేశిస్తున్నప్పుడు బీజేపీ సభ్యులు 'పాకిస్థాన్ ముర్దాబాద్ అంటూ నాదానాలు ప్రారంభించారు. స్పీకర్ నివాళుల పత్రాన్ని పార్లమెంట్ ముందు చదివి వినిపించారు. పుల్వామా సంఘటను స్పీకర్ పిరికిపంద చర్యగా వర్ణించారు.

నివాళిసమయంలో నిశ్శబ్దం

వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ : మరణించిన సభ్యులకు నివాళులు అర్పించేటప్పుడు సభలో సభ్యులు మాట్లాడటం తగదని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సభలో నివాళుల పత్రాన్ని చదివేటప్పుడు కొందరు సభ్యులు దానిపై పెద్దగా ఆశ చూపకుండా, పక్కవారితో ముచ్చటించేందుకే ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు. అంతు మునుపు మాజీ సభ్యుడు ఆర్.మార్గబంధుకు రాజ్యసభ నివాళులు అర్పించింది.

యువకుల మృతిపై సీబీఐ విచారణ

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో దాదాపు 14 ఏళ్ల క్రితం పోలీసు కస్టడీలో మృతి చెందిన ఇద్దరు యువకుల కేసుపై సీబీఐ విచారణ చేపట్టింది. యవత్మల్ జిల్లా కు చెందిన ఓ మనిల్యాండర్ ఇంట్లో జొరబడి, దోపిడికి పాల్పడిన నేరానికి సురేష్ సొంకుసారే, అజయ్ మోహిత్‌ను స్థానిక పోలీసులు కస్టడిలోకి తీసుకున్నారు. అయితే, కస్టడీలో ఉన్నప్పుడు విషం తాగి ఇద్దరు మరణించారనే కథనాన్ని సృష్టించిన పోలీసులు కేసును మూసివేశారు. తిరిగి ఇన్నేళ్లకు కేసును విచారించేందుకు సీబీఐ సిద్ధమైంది.

రాజకీయ జోక్యం చేసుకోవాలి :నేషనల్ కాన్ఫరెన్స్

జమ్మూ(జమ్మూకాశ్మీర్) : జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుతం ఉన్న పరిణామాలపై జోక్యం చేసుకోవాలంటూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) రాష్ట్ర గవర్నర్ ఎన్ఎన్ వోరాకు మెమోరాండం సమర్పించింది. బడ్జెట్ సమావేశాల తరుణంతోనే ఎన్సీ గవర్నర్‌కు మెమోరాండం సమర్పించడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. బీజేపీ-పీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రాజ్యాంగ హోదా అనుమానంలో పడిందని ఎన్సీ పేర్కొంది.

'పుల్వామా' దాడిపై కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ : ఆదివారం పుల్వామాలో జరిగిన దాడిలో ఐదుగురు భారత సైనికులు మరణించిన సంఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందిచక పోవడంపై కాంగ్రెస్ మండిపడింది. పాకిస్థాన్‌పై కేంద్ర ప్రభుత్వ విధానం ఏమిటో చెప్పాలని నిలదీసింది. ఇస్లామాబాద్‌లో కుల్‌భూషన్ జాదవ్‌తో పాక్ వ్యవహించిన తీరుపై స్పందించక, జాతీయ భద్రతా సలహారుడు అజిత్ దోవల్ బాంకాక్‌లో ఆ దేశ కార్యదర్శితో సమావేశం అవ్వడంపై కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేశారు.

చెక్ బౌన్స్ కేసులపై త్వరితగతిన విచారణ

న్యూఢిల్లీ : చెక్కులు బౌన్స్, కంప్లైంట్ దారులకు తాత్కాలిక పరిహారం చెల్లింపుల కేసుల్లో మితిమీరిన ఆలస్యాన్ని నివారించే బిల్లును మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తరపున ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రసాద్ నెగోషియేషన్ ఇన్స్టుమెంట్ (సవరణ) బిల్లు-2017ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. చెక్కుల బౌన్స్‌లో అనవసర కాల వ్యయం నివారించేందుకు ఈ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం కోరనున్నారు.

'పూణె హింస'పై విచారణ :మహారాష్ట్ర సీఎం

ముంబై(మహారాష్ట్ర) : పూనేలో భీమా-కొరెగాన్ 200వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కొట్లాటపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు ఆదేశించినట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. ఈ అల్లర్లలో ఓ యువకుడు మరణించాడు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ఆందోళనను, ధర్నాను జరిగాయి. ముంబైలోని చెంబూర్‌లో ఆందోళనకారులు రైలు రోకో కార్యక్రమం చేపట్టారు.

బాణాసంచా పరిశ్రమను కాపాడండి: డీఎంకే

చెన్నై (తమిళనాడు) : తమిళనాడులోని శివకాశి బాణాసంచ పరిశ్రమను కాపాడాలంటూ కేంద్రాన్ని డీఎంకే కోరింది. పర్యావరణ పరిరక్షణ చట్టం పరిధి నుంచి ఈ పరిశ్రమను తొలగించాలని సూచించింది. 'శివకాశిలోని బాణాసంచ పరిశ్రమలో పనిచేసే లక్షలాది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తు, దేశానికి దాదాపు 90 శాతం బాణాసంచను అందిస్తున్న ఈ పరిశ్రమను కాపాడాలని కోరుతున్నామ'ని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ ట్వీట్‌లో ప్రస్తావించారు.



కార్యకర్తలకు అండగా ఉంటా

ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించే దిశగా పావులు కదుపుతానని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి వెల్లడించారు. మంగళవారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని కాంగ్రెస్ భవన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన నూతన సంవత్సర వేడుకలను కార్యకర్తలతో పంచుకొన్నారు. అనంతరం 2017లో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి పోటీచేయకుండా నియోజకవర్గంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులను నిరాశపరిచిన విషయం విదితమేనని, ఇందుకు క్షమాపణ కోరుతున్నానన్నారు. ఇకనుంచి అలాంటి పొరపాట్లు జరుగవని, ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని సభాముఖంగా హామీ ఇస్తున్నానన్నారు. 2019 ఎన్నికల్లో కళ్యాణదుర్గంలో తప్పక కాంగ్రెస్‌పార్టీ గెలుస్తుందని, ఆ దిశగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాబోవు 2,3 నెలల్లో గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకొంటామన్నారు. ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం కార్యక్రమంలో 59వేల అర్జీలు అందాయంటే తెలుగుదేశంపార్టీ ఏమేరకు ప్రజలకు న్యాయంచేసిందో దీనినిబట్టి అర్థమౌతుందన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయా పంచాయతీల వీఆర్ఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు వీటిని పరిష్కరించకపోతే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎతున ఉద్యమాలు చేసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ తప్పక పోటీచేస్తుందన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమంతో ప్రజలకు ఒరిగేది ఏమీలేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలనరేంద్రబాబు, పాపంపల్లి అశోక్, బోయ నాగరాజు, మాల ఎర్రిస్వామి, ఐ.సుధీర్, జోసఫ్ కిశోర్, నగేష్‌యాదవ్, బాలాశీను పాల్గొన్నారు.



మూడెకరాల జొన్న పంట దగ్ధం

రైతును పరామర్శించిన సీపీఐ నేతలు

విశాలాంధ్ర - ఆలూరు : కౌలు రైతు తాను కౌలుకు తీసుకున్న మూడెకరాల పొలంలో అప్పు సొప్పు చేసి సాగుచేసిన జొన్న పంట అగ్నికి ఆహుతైంది. కర్నూలుజిల్లా ఆలూరు సిద్దేశ్వర కాలనీకి చెందిన సీపీఐ నాయకుడు వన్నూరుస్వామి బళ్లారి రోడ్డులోని మూడెకరాల పొలంలో కౌలుకు తీసుకొని జొన్నపంటను వేశాడు. అయితే అనుకోకుండా జరిగిందో... లేక ఆకతాయిలు ఈ పంటకు నిప్పు పెట్టారో తెలియదుకానీ పూర్తిగా దగ్ధమైంది. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, సహాయ కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి మునిస్వామి పొలానికి వెళ్లి అగ్నికి ఆహుతైన పంటను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంటకు నిప్పుపెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, రైతుకు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని, వెంటనే ప్రభుత్వం కౌలు రైతును అన్నివిధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాష, బాబు, సుంకన్న పాల్గొన్నారు.

విజయనగరానికి 20వ ర్యాంకు

స్వచ్ఛభారత్‌లో ఏడాదిన్నరలో 674 నుండి 20 కు

విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : బహిరంగ మలవిసర్జన రహితం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న విజయనగరం జిల్లా మరో ఖ్యాతి సాధించింది. దేశంలో ఓడీఎఫ్‌గా రూపొందుతూ అత్యంత ప్రగతి చూపుతున్న జిల్లాల్లో 20వ ర్యాంకుకు చేరుకుంది. స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్) ఈ మేరకు జనవరి ఒకటో తేదీన తాజా ర్యాంకింగ్‌ను విడుదల చేసింది. 2016 మార్చిలో 674వ ర్యాంకులో నిలిచి. ప్రతినెలకు తన ర్యాంకును మెరుగుపరచుకుంటూ వస్తోంది. గడచిన ఏడాది అక్టోబరు రెండవ తేదీ నాటికి 217వ ర్యాంకుకు చేరింది. ఫిబ్రవరి 15 నాటికి బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా రూపొందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మరుగుదొడ్ల నిర్మాణం ముమ్మరం చేసింది. ఫలితంగా గత ఏడాదిలోనే జిల్లాలో 35 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా జాతీయ స్థాయిలో 20వ ర్యాంకుకు చేరుకోవడంతో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో జరుగుతున్న ఈ స్వచ్ఛ యజ్ఞం జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చింది.

నేటి నుంచి బెంగళూరులో ఉచిత కృత్రిమ అవయవాల శిబిరం

విశాలాంధ్ర-పర్చూరు : రోటరీ క్లబ్ బెంగళూరు పీణ్య, జైపూర్‌కు చెందిన శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగ సాహిత్య సమితి సౌజన్యంతోబెంగళూరు వేదికగా ఈ నెల 3 నుండి 9 వరకు పోలియో బాధితులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, ముంజేయి అమరుస్తున్నట్లు ప్రకాశం జిల్లా పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు పోలిశెట్టి చంద్రశేఖరరావు మంగళవారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైనవారికి ఉచిత భోజనం, వసతి, ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441270715ను సంప్రదించాలని ఆయన కోరారు.

మత్స్యకారుల పోరు ఉధృతం

విశాలాంధ్రబ్యూరో-శ్రీకాకుళం : ఎస్టీల్లో చేర్చాలంటూ గత 22 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న మత్స్యకారులు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. తీర ప్రాంత గ్రామాల్లో పాఠశాలలకు బుధవారం తమ పిల్లలను పంపకూడదని ప్రతిన బూనారు. విశాఖ, తూర్పుగోదావరి, ప్రకాశం, కర్నూలు జిల్లాలలో సైతం ప్రస్తుతం దీక్షలు కొనసాగుతున్నాయి. ఆయా జిల్లా కలెక్టరేట్‌ల ముందు రోజుకో మత్స్యకార గ్రామం నుంచి స్వచ్ఛందంగా ఈ దీక్షల్లో కూర్చొంటున్నారు. తమ నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయడంలో భాగంగానే బుధవారం జిల్లా వ్యాప్తంగా 104 మత్స్యకార గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను స్వచ్ఛందంగా బంద్ చేసేందుకు మత్స్యకారులు నిర్ణయించారు. జిల్లా తీర ప్రాంతంలో గల 11 మండలాల్లో 104 గ్రామాల్లో సుమారు 2 లక్షల మంది వరకూ మత్స్యకారులు జీవిస్తున్నారు. దేశంలోని 18 రాష్ట్రాలలో మత్స్యకారులను ఎస్టీలుగా పరిగణిస్తున్నారని, పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు సైతం మత్స్యకారులను షెడ్యూల్డు జాతులుగా పరిగణిస్తున్నాయని వారు చెబుతున్నారు.

కాగా, మంగళవారం నుంచి మొదలైన జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో మత్స్యకారులు ఆయా ప్రాంతాల్లో జరిగే గ్రామసభలకు హాజరై తమను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ప్రభుత్వం సత్వరం స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఈ నెల 4న జిల్లాలో పర్యటించనుండటంతో ఆయనను కలిసి సమస్యను తెలియజేయాలని నిర్ణయించారు. ఇప్పటికే మంత్రులు కొల్లు రవీంద్ర, కింజరాపు అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, పితాని సత్యనారాయణ తదితరులు మత్స్యకారుల దీక్షా శిబిరాలకు వెళ్ళి వారికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వానికి సమస్యను తెలియజేస్తామని హామీ ఇచ్చారు.



'పశ్చిమ'లో రెచ్చిపోతున్న జూదరులు

- జిల్లా నలుమూలలా పేకాట స్థావరాలు
- కొరవడిన పోలీసు నిఘా



విశాలాంధ్ర-ఏలూరు : పశ్చిమగోదావరి జిల్లా పేకాట స్థావరాలకు నిలయంగా మారింది. క్లబ్బులు, లాడ్జిలు, అపార్టుమెంట్లు, ఇళ్లు, చెర్వుగట్లు, చేలగట్లు అనే భేదం లేదు. రాత్రీపగలు తేడా లేదు. ఎక్కడ పడితే అక్కడ పేకాటరాయుళ్లు రెచ్చిపోతున్నారు. కోసు పందాలు, సీక్వెన్స్ పేర్లతో విచ్చలవిడిగా పేకాట శిబిరాలే సాగిపోతున్నాయి. రాజు, రాణి, జోకర్ కలిసొచ్చిన ఒకరో ఇద్దరో లాఖియర్లు అవుతున్నారు. పెళ్ళాం మెడలో నగలతో సహా సర్వస్వం పోగొట్టుకుని జేబులు ఖాళీ చేసుకుంటున్న వారి సంఖ్యకు అంతే ఉండట్లేదు. దీంతో గుట్టుగా ఉండాల్సిన కాపురాలు కొన్నిచోట్ల రోడ్డున పడుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన పోలీసులు ప్రలోభాల వలలో పడిపోతున్నారు. ఏలూరుతోపాటు చుట్టుపక్కల పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నిడదవోలు, కొవ్వూరు, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, దేవరపల్లి, గోపాలపురం, భీమడోలు తదితర ప్రాంతాల్లో రోజుల తరబడి జోరుగా పేకాట సాగుతున్నట్లు ప్రచారం.

వీఐపీ పర్యటనల్లో మరింత ఎక్కువ

జిల్లాలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, వీవీఐపీల పర్యటనల సమయంలో పేకాటరాయుళ్ళు పేట్రేగిపోతున్నారు. నూతన రాష్ట్రంలో అత్యధిక మున్సిపాలిటీలు కల్గిన జిల్లా పశ్చిమగోదావరి. అత్యంత తక్కువ పోలీసులు (సుమారు 2,500 మంది) మాత్రమే ఉన్న జిల్లా కూడా ఇదే. అనధికారిక లెక్కల ప్రకారం జిల్లా జనాభా అరకోటి పై మాటే. అంటే ప్రతి రెండు వేల మందికి ఒక్క పోలీసు మాత్రమే పనిచేస్తున్నారన్న మాట. ఇది పోలీసుశాఖ నింబధనలకు విరుద్ధం. రాష్ట్రంలో ఒక్క పశ్చిమగోదావరి మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో వీవీఐపీల పర్యటనల సమయంలో ఏపీఎస్పీ బెటాలియన్ సేవలు వినియోగించుకునే అవకాశం ఉంది. దీంతో వీవీఐపీలు వచ్చినప్పుడు బందోబస్తు కోసం జిల్లాలోని పోలీస్‌స్టేషన్లు అన్నీ ఖాళీ అవుతున్నాయి. ఇదే అదనుగా పేకాటరాయుళ్ళు రెచ్చిపోతున్నారు. ఆయా రోజుల్లో రెస్టారెంట్లు, హోటళ్లు, లాడ్జిలు, అపార్టుమెంట్లు, క్లబ్బులు, ఇళ్ళు పేకాట స్థావరాలుగా మారిపోతున్నాయి. సమాచారం ఉన్నప్పటికీ సిబ్బంది కొరతతో దాడి చేయలేని పరిస్థితి నెలకొంటోంది. కొన్ని ప్రాంతాల్లో పోలీసులే పేకాట నిర్వాహకులకు వీవీఐపీల పర్యటనలు, దాడుల సమాచారం లీక్ చేస్తుంటారన్న ఆరోపణలున్నాయి. తాజాగా నాలుగు రోజుల క్రితం ఏలూరులో దాడులు చేసే ఉంటే పెద్ద మొత్తంలో నగదు, భారీ సంఖ్యలో అరెస్టులు ఉండేవని కింది స్థాయి పోలీసులే వ్యాఖ్యానించడం గమనార్హం. పేకాట స్థావరాలపై దాడుల్లో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించేలోపే సీఐ, ఎస్సైలపై రాజకీయ నేతల ఒత్తిళ్ళు రావడం పరిపాటిగా మారిపోయింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధులు, వ్యక్తిగత కార్యదర్శులు, అనుచరులు ఫోన్లు చేయడం, ప్రత్యేకంగా మనుషులను పంపి స్టేషన్ల నుంచి విడిపించుకుపోవడం అలవాటుగా మారిందని సీనియర్ పోలీసు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. పంచాయతీ వార్డు సభ్యుని నుంచి అన్ని స్థాయిల్లో జిల్లా అంతటా రాజకీయ నేతల హవా కొనసాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఏలూరు చుట్టుపక్కల కోడేలు, చాటపర్రు, వట్లూరు, పోణంగి, తంగెళ్ళమూడి, శనివారపేట, సత్రంపాడు, చొదిమెళ్ళ, వెంకటాపురం గ్రామాలతోపాటు పెదవేగి మండలం న్యాయంపల్లి, పెదవేగి, ముండూరు, గోపన్నపాలెం, కొప్పాక తోటల్లో,

> పేకాటరాయుళ్లకు పశ్చిమగోదావరి జిల్లా సురక్షిత స్థావరమైంది. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండదండలతో జూదరులు రాత్రీపగలు తేడా లేకుండా శిబిరాలు నిర్వహిస్తున్నారు. రోజూ లక్షల్లో నోట్లు చేతులుమారుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్ళు, ముడుపుల మత్తులో పోలీసులు చూసీచూడనట్టు పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చింతలపూడి, ప్రగడవరం, టి.నర్సాపురం, లింగపాలెం, ధర్మాజీగూడెం, కె.కోట, తడికలపూడి, జంగారెడ్డిగూడెం గ్రామాల పొలాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రాంత శిబిరాలపై దాడి చేయాలన్నా కింది స్థాయి పోలీసు అధికారులు సాహసం చేయలేకపోతున్నారన్నది బహిరంగ రహస్యం. స్థానిక ప్రజాప్రతినిధులకు ఎదురుతిరిగితే బదిలీవేటు తప్పదనే భయంతో ఎస్సై, సీఐ స్థాయి అధికారులు మిన్నకుండి పోవడం రివాజుగా మారింది. కొందరు ఇలా ఒత్తిళ్ళకు లొంగిపోతుంటే మరికొందరు అయినకాడికి మామూళ్ళు దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని స్టేషన్ల పరిధిలో కంటితుడుపు చర్యగా ఒకటి అర కేసులు నమోదు చేసి మమ అనిపించేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసుశాఖ ఉన్నతాధికారులు కుటుంబాల్లో చిచ్చుపెడుతున్న పేకాటరాయుళ్ళ ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర మంత్రి జవహర్‌కు నిరసన సెగ

- కొవ్వూరులో టీడీపీ కార్యకర్తల బైఠాయింపు
- కేసు నమోదుకు డిమాండ్



విశాలాంధ్ర-కొవ్వూరు : పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతల మధ్య అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్ తీరుపై ఒక వర్గం ప్రత్యేక ఆందోళనకు దిగడంతోపాటు పోలీస్ కేసు నమోదు చేయాలన్న డిమాండ్ చర్చనీయాంశమైంది. కొవ్వూరులోని మంత్రి కార్యాలయంలో మంత్రిని కలిసేందుకు వచ్చిన తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామ టీడీపీ నేతలు గణపతి కృష్ణ, సత్యేంద్రప్రసాద్‌పై మంత్రి జవహర్‌తోపాటు మరికొందరు దాడి చేశారని ఆరోపిస్తూ అన్నదేవరపేట గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కొవ్వూరు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక విజయ విహార్ సెంటర్‌లో బైఠాయించారు. మంత్రిపై కేసు నమోదు చేయడంతోపాటు తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ తమపై దాడి చేసిన రాష్ట్ర మంత్రిపై సోమవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంత వరకు కేసు కూడా నమోదు చేయలేదన్నారు. అక్రమంగా టీడీపీ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. అక్కడ నుంచి ప్రదర్శనగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇదే సమయంలో మంత్రి జవహర్ అనుకూల వర్గీయులు డీఎస్పీ ఆఫీసుకు చేరుకుని నినాదాలు చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. వీరు కూడా మరో వినతిపత్రం అందజేశారు. ఈ పరిణామాలపై డీఎస్పీ స్పందిస్తూ మంత్రిపై ఇచ్చిన ఫిర్యాదులో కేసు నమోదు చేసే అంశాలు లేవన్నారు. సమగ్ర విచారణ చేస్తామన్నారు. సోషల్ మీడియాలో మంత్రి జవహర్ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు పెట్టిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే : మంత్రి జవహర్

కొవ్వూరు నియోజకవర్గంలో నేను చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కొందరు ఓర్వలేక వ్యక్తిగతంగా అసత్య ప్రచారం చేస్తున్నారు. నా వద్దకు వచ్చిన ఇద్దరితోపాటు మరికొందరు నా వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగపరిచేవిధంగా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పెట్టారు. నా పీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని లేనిపోని అభాండాలు వేస్తున్నారు. నేను ఎస్సీ మంత్రిని కావడం వల్లే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారు. అనంతరం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంలో దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు.



కోటలో ఆగని గుప్తనిధి వేట

విశాలాంధ్ర-తుగ్గలి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల వేట 22వ రోజు మంగళవారం కూడా కొనసాగింది. రెవెన్యూ, పోలీసు అధికారులు ఆ కోటలోనే మకాం వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిపుణులు స్కానర్లు, ఆధునిక పరికరాలతో కోటచుట్టూ అన్వేషిస్తున్నప్పటికీ నిధుల జాడ కానలేదు. అధికారులు మాత్రం పట్టు వదలకుండాతవ్వకాలు జరుపుతున్నారు. మరోపక్క ఆ కోటను పూర్వం పరిపాలించిన తిమ్మరాజు వారసుడు త్రివిక్రమరాజు కోటలో తవ్వకాలను నిలిపి వేయాలంటూ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ ఆయన మాటను పట్టించుకునే పరిస్థితి లేదు.

రోడ్డేయకుండా మా ఊరు రావద్దు

- జన్మభూమి జరిగే పాఠశాలకు తాళాలు
- పోలీసులు, సీపీఐ నేతల మధ్య వాగ్వివాదం
- వెనుదిరిగిన అధికారులు



విశాలాంధ్ర - తుగ్గలి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పెండేకల్ గ్రామంలో అయిదవ విడత జన్మభూమి కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకే అధికారులు గ్రామానికి చేరుకున్నప్పటికీ సభ నిర్వహించే ప్రదేశంలోకి ఎవ్వరినీ రానివ్వకుండా సీపీఐ నాయకులు రాధాకృష్ణ, గ్రామశాఖ కార్యదర్శి రాజశేఖర్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు పీరాసాహెబ్ గ్రామస్తులతో కలిసి పాఠశాలకు తాళం వేశారు. అధికారంలోకి వస్తే ఎద్దులదొడ్డి నుంచి ఆర్ఎస్ పెండేకల్ వరకు తారురోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చిన నేటి పాలకులు ఇంత వరకు పట్టించుకోలేని సీపీఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక సార్లు జన్మభూమి కార్యక్రమాన్ని అడ్డుకున్నప్పటికీ అధికారులే స్వయంగా అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారన్నారు. దారుణమైన స్థితిలోని రోడ్లకు మరమ్మతులు కూడా చేయకుండా కాలక్షేపంగా కార్యక్రమాలు చేసుకుంటూపోతే తమ గ్రామ పరిస్థితి ఏమిటని వారు అధికారులను నిలదీశారు. అధికారులు మాత్రం గ్రామంలో సభ నిర్వహించాలన్న లక్ష్యంతో ఎస్సైను అక్కడకు రప్పించడంతో గ్రామస్తులను భయాందోళనలకు గురిచేసేలా పోలీసులు వ్యవహరించారు. సీపీఐ నాయకులతో కలిసి గ్రామస్తులు ఊరి రోడ్డు బాగుచేసే వరకు వరకు గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలను జరగనివ్వబోమని తెగేసి చెప్పారు. దీంతో అధికారులు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సీపీఐ నాయకులు పెట్రోల్ డబ్బాలు చేత పట్టుకుని ఇక్కడ నుంచి అధికారులు వెళ్లకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించడంతో వెనుదిరిగారు. ఎద్దులదొడ్డి గ్రామంలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. మూడేళ్లుగా ఉపాధి పథకం కింద తోటల్లో నీటి ట్యాంకులు నిర్మించుకుంటూ బిల్లుల కోసం ఆఫీసుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు బిల్లులు చేయించాలని నిలదీశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ చెన్నయ్య, తహశీల్దార్ గోపాలరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీరేష్, బర్మా వీరేష్, ఎమ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి, బాలమద్దినాయుడు పాల్గొన్నారు.

నూజివీడులో ఉద్రిక్తత



విశాలాంధ్ర-నూజివీడు టౌన్ : కృష్ణాజిల్లా నూజివీడు పట్టణంలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో తొలి రోజు మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజా సమస్యలపై స్థానిక శాసనసభ్యుడు ప్రతాప్ అప్పారావు, వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు అధికారులను నిలదీయడంతో గందరగోళం నెలకొంది. వైసీపీ నేతలను పోలీసులు బయటకు తీసుకు వెళ్ళినా ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతోపాటు మధ్యలోనే నిలిపివేశారు. పట్టణంలోని ఒకటి, 30వ వార్డులకు సంబంధించి స్థానిక విక్టోరియా టౌన్ హాలులో జన్మభూమి సభ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, జిల్లా జాయింట్ కలెక్టర్ విజయ్ కృష్ణన్, స్పెషల్ ఆఫీసర్ శారద హాజరయ్యారు. అర్జునుడు ప్రసంగించిన తర్వాత డ్వాక్రా రుణాలు, రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లపై ఎమ్మెల్యే అప్పారావు అధికారులను నిలదీశారు. గత జన్మభూమిలో మంజూరైన రేషన్ కార్డులను ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మళ్ళీ అదే జాబితా తీసుకువచ్చి చదవటంలో అర్థమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపైకి మరొకరు దూసుకు వెళ్ళారు. జాయింట్ కలెక్టర్ పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోలీసులు వైసీపీ నేతలను బయటకు తీసుకువెళ్ళారు. ఇదే సమయంలో జనం నుంచి నిరసన కొనసాగింది. సమస్యను పరిష్కరిస్తామంటూ అర్జునుడు చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో మీరు గొడవ పెట్టుకోవడానికే వచ్చారా అంటూ ఎమ్మెల్యే పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అరుపులు, కేకలతో సభ రసాభాసగా మారింది. దీంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపేసిన అధికారులు అక్కడ నుంచి వెళ్ళిపోయారు. ఈ రెండు వార్డుల్లో కౌన్సిలర్లు టీడీపీకే చెందినవారు కావటం గమనార్హం.



గొట్టిపాడులో నిర్మానుష్యం

- భారీగా పోలీసుల మోహరింపు
- అడుగడుగునా నిఘా
- బిక్కుబిక్కుమంటున్న జనం

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరుజిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామంలో నిర్మానుష్యం నెలకొంది. అడుగడుగునా పోలీసు బలగాలను మోహరించడంతో జనం బిక్కుబిక్కుమంటూ మంగళవారం ఇళ్లకే పరిమితమయ్యారు. ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో నెలకొన్న వివాదం పెద్దదై సోమవారం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ కొట్లాటలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి.

గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. మంగళవారం కూడా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ కోన శశిధర్, గుంటూరు అర్బన్ ఎస్పీ విజయరావు ఇరువర్గాల శాంతికమిటీలతో చర్చలు జరిపి వివాదాలు వద్దని సూచించారు. ఇప్పటికే 23 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఒక్కసారిగా ప్రజాసంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నేతలు గ్రామంలో పర్యటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఊరు చుట్టూ డ్రోన్లతో ప్రత్యేక నిఘా

గొట్టిపాడు గ్రామంతోపాటు చుట్టుపక్కల డ్రోన్ల పోలీసులు 24 గంటలు నిఘా పెట్టారు. గ్రామస్తులు ఎవరు ఎక్కడికి వెళుతున్నారు.. వారి కార్యకలాపాలపై దృష్టి సారించారు. ప్రతి ఒక్కరి కదలికను ఎప్పటికప్పుడు డ్రోన్లు రికార్డు చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు.

గుంటూరులో దళిత సంఘాల నేతల ధర్నా

గొట్టిపాడు దళితులపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని దళిత బహుజన ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గుంటూరు లాడ్జిసెంటర్‌లో దళిత బహుజన ప్రజా సంఘాల నేతలు ఆందోళన చేశారు. దళితులపై దాడులను నియంత్రించాలని నినాదాలు చేశారు.

పార్టీల విరాళాలే టార్గెట్



న్యూఢిల్లీః రాజకీయ పార్టీలకు అందే ఎన్నికల విరాళాల్లో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రణాళికను ప్రకటించింది. పార్టీలకు అందే కోట్ల కొద్దీ విరాళాలకు చెక్ పెట్టే యోచనతో ఎలక్టోరల్‌బాండ్స్ పథకాన్ని అమలులోకి తెచ్చారు. 2017 ఫిబ్రవరి 1న 2017-18 బడ్జెట్ ప్రసంగంలో రాజకీయ నిధుల పారదర్శకత అంశాన్ని ప్రస్తావించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం లోక్‌సభలో ఈ బాండ్స్‌పై వివరణ ఇచ్చారు. ఈ పథకంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుందని, మంగళవారం నోటిఫికేషన్ జరీ చేశారని వెల్లడించారు. వీటిని రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే సందర్భంగా వాడుకో వచ్చున్నారు. భారతదేశ పౌరుడు లేదా దేశంలో ఉన్న కార్పొరేట్ సంస్థలకు ఈ బాండ్లను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఈ బాండ్లు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో పది రోజుల పాటు ఈ బాండ్లను ఎస్‌బీఐ నుంచి కొనుగోలు చేయొచ్చని జైట్లీ వివరించారు. ఇలా వెయ్యి, పది వేలు, లక్ష, పది లక్షలు, కోటి రూపాయలు.. ఇలా ఎంత విలువైన బాండ్‌నైనా కొనుగోలు చేయొచ్చని తెలిపారు. అలాగే ఈ బాండ్లపై విరాళం ఇస్తున్న వారి పేర్లు ఉండవు. కానీ ఈ బాండ్లను కొనుగోలు చేసే వ్యక్తి తన కేవైసీ వివరాలను ఎస్‌బీఐకి చెప్పాల్సి ఉంటుందని జైట్లీ స్పష్టంచేశారు. పేరుకు బాండ్లే అయినా వీటికి వడ్డీ ఉండదు. ఒక రకంగా ప్రామిసరీ నోటు లాంటిది. ఆ విరాళాలు సంబంధిత రాజకీయ పార్టీకి చేరేవరకు ఎస్‌బీఐ బాధ్యత వహిస్తుంది. వీటి కాలపరిమితి 15 రోజులు. ఈ గడువులోపు సంబంధిత రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ పేరిట ఉన్న బ్యాంక్ అకౌంట్ ద్వారా వీటిని నగదు రూపంలోకి మార్చుకునే వీలుంటుంది. ఈ ఎన్నికల బాండ్ల ద్వారా ఎంత డబ్బు సంపాదించిందో ఎన్నికల కమిషన్ రిటర్న్‌లో ప్రతి రాజకీయ పార్టీ దాఖలు చేయాలని ఆర్థికమంత్రి చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు ఉన్న ఏడాదిలో ప్రతి నెలా 30 రోజుల పాటు ఇస్తారని ఆర్థిక మంత్రి జైట్లీ వెల్లడించారు.

ఆర్ అండ్ బీకి రూ.1000 కోట్ల రుణం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రహదారులు, భవనాలశాఖ (ఆర్ అండ్ బీ) రూ. 1000 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈమేరకు రవాణా, రహదారులు, భవనాలశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా జీవోను మంగళవారం జారీ చేశారు. విజయవాడలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి ఈ మొత్తాన్ని రుణంగా తీసుకోనున్నారు. దీనిని ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) ద్వారా రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, అభివృద్ధికి వినియోగించనున్నారు. ఏటా 7.90 శాతం వడ్డీకి ఈ మొత్తాన్ని పంజాబ్ నేషనల్ బ్యాంకు అందచేయనుంది.

భారత్‌లో మెర్క్స్ విస్తరణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మెర్క్స్ ఫైనాన్స్ సంస్థ అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. దేశంలో 2016లో ట్రేడ్ ఫైనాన్స్ సర్వీసులను ప్రారంభించిన ఈ సంస్థ అనంతరం సింగపూర్, నెదర్లాండ్స్, స్పెయిన్, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్లకు విస్తరించింది. విదేశీ మారక ద్రవ్యానికి అనుసంధానమైన ఎల్ఐబీఓఆర్ (లిబర్) ఎక్స్‌పోర్ట్ ఫైనాన్సింగ్ సెక్షన్స్‌ను సంస్థ అందిస్తోంది. దేశంలో ఇంత వరకు 80 మిలి యన్ డాలర్లకు పైగా నిధులను సమకూర్చింది. తమ వినియోగదారుల మూలధన లభ్యతకు సంబంధించి ఈ సంస్థ ఒక వారధిగా పని చేస్తోంది. వచ్చే 12 మాసాలలో దేశంలో జరిగే వ్యాపారాలకు మరో 200 మిలియన్ డాలర్ల నిధులను తమ సంస్థ సమకూరుస్తుందని సంస్థ గ్లోబల్ హెడ్ విపుల్ సల్దాన ఒక ప్రకటనలో తెలిపారు.

రూ. 50లక్షల ఎర్రచందనం స్వాధీనం

14 మంది స్మగ్లర్ల అరెస్టు



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో/ తిరుపతి క్రైమ్ : టాస్క్‌ఫోర్స్ అధికారులు జిల్లాలో మంగళవారం ఏకకాలంలో 3 మండలాల్లో దాడులు నిర్వహించి 33 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 14 మంది స్మగ్లర్లను అరెస్టుచేశారు. ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు ఓఎస్డీ పి.విఠలేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, రాపూరు ఎస్ఐ లక్ష్మణరావు, ఉదయగిరి ఎస్ఐ నక్కా ప్రభాకర్, సోమశిల ఎస్ఐ బలగాని జగన్మోహన్‌రావు, సిబ్బంది సంయుక్తంగా జిల్లాలోని రాపూరు, ఉదయగిరి, సోమశిల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రాపూరు పరిధిలో నలుగురు, ఉదయగిరి పరిధిలో అయిదుగురు, సోమశిల పరిధిలో అయిదుగురు మొత్తం 14మంది అంతరాష్ట్ర, స్థానిక స్మగ్లర్లను అరెస్టు చేయడంతోపాటు మూడు చోట్ల కలిపి 33 ఎర్రచందనం దుంగలు, 8 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. 33 ఎర్రచందనం దుంగల బరువు 554 కేజీలు, విలువ రూ.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అరెస్టయినవారిలో కడప జిల్లాకు చెందిన స్మగ్లరు ఆరుగురు ఉన్నారు. మిగతావారు రాపూరు, ఉదయగిరి, నెల్లూరు ప్రాంతాలకు చెందిన వారు. వీరు వెలిగొండ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను చెన్నైకి అక్కడి నుంచి కంటైనర్ల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. మూడు ప్రాంతాల్లోనూ పోలీసులు స్మగ్లర్లను పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు స్మగ్లర్లు కర్రలు, రాళ్లతో దాడికి ప్రయత్నించారు. పోలీసుల అదుపులో ఉన్నవారితో సంబంధాలున్న స్మగ్లర్ల కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఎర్రచందనం స్మగ్లర్ల కదలికలపై గట్టి నిఘా ఉంచి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి ఆస్తులూ సీజ్ చేయనున్నట్లు ఓఎస్‌డీ విఠలేశ్వరరావు తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారి జాబితా తయారుచేసి వారి కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, జిల్లాలో గతేడాది 34 ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు నమోదు చేసి 481 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 45 వాహనాలను సీజ్ చేశామన్నారు. మొత్తం రూ.16 కోట్ల విలువైన 16.32 టన్నుల ఎర్రచందనం దుంగలు, రెండు ఎస్బీఎంఎల్, ఒక రివాల్వరు సీజ్ చేశామని తెలిపారు. స్మగ్లర్లను అరెస్టు చేయడంతోపాటు వెలిగొండ పరిధిలోని కొండ క్రింది ప్రాంతాల్లో కూంబింగ్ ఏరియా డామినేషన్ నిర్వహిస్తూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడకుండా ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతున్నా లేదా అసాంఘిక కార్యకలాపాలు గమనించినా జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9390777727 కు మెసేజ్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వారు భరోసా ఇచ్చారు.

టాస్క్‌ఫోర్స్ బృందంపై స్మగ్లర్ల దాడి
గాల్లో రెండ్ రౌండ్లు కాల్పులు

టాస్క్‌ఫోర్స్ తిరుమల శ్రీవారి మెట్టు వద్ద సోమవారం కూంబింగ్ నిర్వహిస్తుండగా దాదాపు 60 మంది స్మగ్లర్లు ఆర్ఐ భాస్కర్ టీమ్‌పై కత్తులతో దాడి చేశారు. దీంతో రెండు సార్లు గాలిలో కాల్పులు జరపవలసి వచ్చింది. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్ హరికృష్ణ కుడిచేతికి గాయం అయింది. స్మగ్లర్లను లొంగిపోవాలని హెచ్చరించడంతో వారు కత్తులు విసరారు. పోలీసులు మరింత ముందుకెళ్లే ప్రయత్నం చేయగా, మరోసారి కత్తులు,రాళ్లు రువ్వుతూ పారిపోయారు. టాస్క్‌ఫోర్స్ బృందం 10 మంది మాత్రమే ఉండటం, స్మగ్లర్లు 60 మంది ఉండటంతో ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. వీరి నుంచి 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు.



కమ్యూనిస్టు ఉద్యమానికి స్ఫూర్తి ఏ.బి.బర్ధన్ : ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : కమ్యూనిస్టు ఉద్యమానికి కామ్రేడ్ ఏ.బి.బర్ధన్ స్ఫూర్తి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో బర్ధన్ 2వ వర్ధంతి సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ బర్ధన్ విద్యార్థి నాయకునిగా, కార్మిక నాయకుడిగా, పార్టీ జాతీయ కార్యదర్శిగా అనేక చారిత్రక పోరాటాలకు నాయకత్వం వహించారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. పార్టీ జాతీయ కార్యదర్శిగా పార్టీ పురోభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. భారతదేశ ఆర్థిక, సాంఘిక, సామాజిక పరిస్థితులపై సమగ్రమైన అవగాహన కలిగిన నాయకునిగా అనేక పోరాటాలను రూపొందించి వాటికి నాయకత్వం వహించారన్నారు. మార్క్సిస్టు మేధావిగా ప్రపంచ వ్యాపితంగా గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఎ.మారుతివరప్రసాద్, సి.ఆర్.మోహన్, కోట మాల్యాద్రి, చవ్వా బాలస్వామిరెడ్డి, షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, గొట్టిముక్కల బాలాజి, జె.వి.శ్రీధర్, భైరాపట్నం రామకృష్ణ, కేసాని కోటేశ్వరరావు, శరణం విజయకుమార్, బూదాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

45 ఏళ్లకే పెన్షన్ ఇస్తాం

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జగన్ భరోసా



విశాలాంధ్ర- వాల్మీకిపురం : వైసీపీ అధికారంలోకి రాగానే 45సంవత్సరాలకే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు 2వేల రూపాయల పెన్షన్ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని వైసీపీ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం ఆయన మదనపల్లె నియోజకవర్గం నుంచి వాల్మీకిపురంలో అడుగుపెట్టారు. ఈ యాత్రకు పీలేరు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు, వికలాంగులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. రాబోయేది మన ప్రభుత్వమేనని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ ప్రజా సంకల్పయాత్రలో వాల్మీకిపురం నుంచి పునుగుపల్లి వరకు భారీ ఫ్లెక్సీలతో స్వాగతం పలికి బుధవారం కలికిరిలో జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రజా యాత్రలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంతరెడ్డి, వైసీపీ నాయకులు హరీష్‌రెడ్డి, నీళ్ళ భాస్కర్, కేశవరెడ్డి, గాంధీపేట రఘు, చింతల శివానందరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాగార్జున, మునిభాస్కర్, జేసీబీ రవి, సర్పంచ్ చంద్రశేఖర్, కుమార్, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మందకృష్ణ మళ్లీ అరెస్టు

దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత : ఇరు వర్గాల తోపులాట



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన ఉపవాసదీక్షా కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. దీక్ష చేపట్టిన వెంటనే పోలీసులు అయన్ను అడ్డుకున్నారు. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలకు పోలీసు లకు మధ్య తోపులాట జరిగింది. మంగళవారం పార్శీగుట్టలో దీక్ష ప్రారంభించిన మందకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. అనుమతి లేకుండా దీక్షలు చేపట్టినందుకే అరెస్టు చేసినట్టు పేర్కొ న్నారు. మందకృష్ణ మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఎంతో ఓపికతో మళ్లీ అరెస్టు అరెస్టు చేసినా దీక్షను విరమించేది లేదని స్పష్టంచేశారు. బుధవారం ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయాల ఎదుట, గురువారం రహదారులపైన శాంతియుతంగా ఆందోళనలు చేయాలని ఆయన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా దీక్షలను విరమించబోమని స్పష్టంచేశారు. ఏ తప్పు చేశామని 307 కేసులు పెట్టారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ దీక్షలకు ఎందుకు అనుమతించడం లేదని నిలదీశారు. అణిచివేత ధోరణితో చిటికిమాటికి కేసులు పెట్టి ప్రజలను, ఉద్యమకారులను భయపెట్టేందుకు ప్రభుత్వం యత్నించడం తగదని మందకృష్ణ తెలిపారు. నిర్బంధాలతో దళితులకు దూరం కావద్దని ఆయన కేసీఆర్‌కు సూచించారు.

స్కీమ్ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి : చలసాని రామారావు



విశాలాంధ్ర,విజయవాడ(గాంధీనగర్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి, పథకాల ప్రైవేటీకరణ నిలిపి వేయాలని ఏఐసీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని రామారావు డిమాండు చేశారు. ఈనెల 23న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే స్కీమ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసే విధంగా స్కీమ్ వర్కర్లందరూ మండల కేంద్రాల్లో ప్రదర్శన, ధర్నాలు చేయాలని స్కీమ్ వర్కర్ల ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం చేసింది. కనీస వేతనం రూ.18 వేలు, రూ.3 వేల పెన్షన్, పీఎఫ్ గ్రాట్యువిటీ, వైద్య సదుపాయం కల్పించి రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలకు నిధులు పెంచాలని ఆయన కోరారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీ స్కీమ్ వర్కర్ల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ సంఘాలతో ఒక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనిలో ముఖ్యవక్తలుగా పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చలసాని రామారావు, ఎస్.వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో పౌష్టికాహార సరఫరా, స్త్రీ, శిశు మరణాల నిరోధం, విద్య, వైద్యం అందించే లక్ష్యాలతో ఏర్పాటు చేయబడిన అంగన్‌వాడీ, ఆశా మధ్యాహ్న భోజనం, వెలుగు, వీఓఏ, సెర్ప్ ఉపాధి హామీ, జాతీయ ఆరోగ్య మిషన్, సర్వశిక్షా అభియాన్, సాక్షర్ భారత్ జాతీయ బాలకార్మిక ప్రాజెక్టు, చంద్రన్న సంచార చికిత్స, 108 ఏపీ పాల్స్ వంటి పథకాలు క్రమంగా నిర్వీర్యం అయిపోతున్నాయన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పథకాలకు సరిపడా నిధులను కేటాయించి లక్ష్యాలను పూర్తి చేయవలసిన ప్రభుత్వమే ఈ పథకాలకు పెద్దఎత్తున కోత పెడుతుందన్నారు. దీనిఫలితంగా లబ్ధిదారులకు అందే సహాయం తగ్గిపోవడంతో పాటు ఈ పథకాల్లో పని చేసే కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. దశాబ్దాల తరబడి పని చేస్తున్న వీరిని గుర్తించడంలేదన్నారు. పార్ట్‌టైమ్, గౌరవ వేతనం, పారితోషికాలు వంటి పేర్లతో కనీస వేతనాలు, పీఎఫ్, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలు వంటి సామాజిక భద్రత కల్పించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు సైతం సమాన పనికి సమాన వేతనం సామాజిక భద్రత అలసత్వం ప్రదర్శిస్తున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఈనెల 23న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారని మనరాష్ట్రంలో కూడా దీనిని విజయవంతం చేసి ప్రభుత్వం కళ్లు తెరిచే విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ (ఏఐటీయూసీ) జె.లలిత, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రియదర్శిని, రాష్ట్ర శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి కె.శైలజ, సీఐటీయూ నాయకులు ఎ.వి.నాగేశ్వరరావు, కె.సుబ్బారావమ్మ, ఆంజనేయులు, డి.రామారావు, యం.రమేష్‌బాబు, కె.ఉమామహేశ్వరరావు, ముజఫర్ అహ్మద్, ఆర్.వి.నరసింహారావు, ఎల్.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిని కోరిన టీఎస్సార్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఇటీవల పెరుగుతున్న ఆందోళనకర ఘటనల నేపథ్యంలో ప్రయాణీకుల భద్రత దృష్ట్యా విచారణ జరిపి తగిన నివారణా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజును రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి కోరారు. వివిధ ఎయిర్‌పోర్టుల్లో జరుగుతున్న ఘటనలపై రాజ్యసభ జీరో అవర్‌లో మంగళవారం టి.సుబ్బరామిరెడ్డి లేవనెత్తారు. ప్రమాదకర ఘటనలు భవిష్యత్తులో జరగకుండా సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్‌తో సేఫ్టీ ఆడిట్ జరిపించాలని టీఎస్సార్ కోరారు.గత ఏడాది నవంబరులో వైజాగ్ ఎయిర్‌పోర్టు రన్‌వే మీద అడవిపందిని ఇండిగో ఎయిర్‌క్రాఫ్ట్ ఢీకొన్న ఘటనను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టేకాఫ్ అయిన తరువాత ఆలస్యంగా పైలట్ ఈ విషయాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో విమాన చక్రం దెబ్బతిందన్నారు. అలాగే గతవారం లక్నో నుంచి సౌదీ అరేబియా విమానం టేక్‌ఆఫ్ అవుతున్న సమయంలో విమానం ముందు టైర్లు ఊడిన ఘటనను ప్రస్తావించారు.ఈ విమానంలో 300 మంది ప్రయాణీకులు ఆ సమయంలో ఉన్నట్లు తెలిపారు. 2017 సెప్టెంబర్‌లో జోహట్-గోహతీ-కోల్‌కతా విమానం అసోంలో స్కిడ్ అయినప్పటికీ 95 మంది ప్రయాణికులు అదృష్టవశాత్తు ప్రమాదం నుంచి బయటపడిన విషయాన్ని వివరించారు. కొంత కాలం కిందట వంద మంది ప్రయాణికులతో ఎయిరిండియా విమానం ల్యాండ్ అయిన తరువాత నెలకొన్న ప్రమాదకర పరిస్థితిని, ఆ తరువాత మంటలను అదుపు చేసిన పరిస్థితిని వివరించారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిని కోరారు.

9లోపు కార్మికులకు జీతాలివ్వాలి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్-బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) కార్మికులపై కంపెనీ యాజమాన్య నిర్లక్ష్య ధోరణిని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హోంమంత్రి, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజన మంత్రి చందూలాల్ ఖండించారు. ఫ్యాక్టరీ మూతపడడం వల్ల రోడ్డున పడిన 750 మంది కార్మికులకు 9వ తేదీలోపు సంక్రాంతి పండగ కోసం కనీసం నెల జీతం చెల్లించాలని కంపెనీ ప్రతినిధికి డెడ్‌లైన్ విధించారు. 9న కార్మికులకు నెల జీతం ఇచ్చి, 10న కంపెనీ సీఈవో సచివాల యంలో జరిగే సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. ఫ్యాక్టరీ మూతపడి రెండేళ్లు గడుస్తున్నా కార్మికుల సమస్యలను తీర్చడం లేదని రేయాన్స్ ఫ్యాక్టరీ యూనియన్ల జేఏసీ మంత్రులను ఆశ్రయించారు. దీంతో ముగ్గురు ఆధ్వర్యంలో సచివాలయంలో యూనియన్ నాయకులు, కంపెనీ ప్రతినిధులతో సంయుక్త సమావేశం జరిగింది. ఫ్యాక్టరీ యాజమాన్య ధోరణిపై మంత్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 32 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, అడిగితే డెడ్‌లైన్లు పెడుతున్నారు తప్ప చెల్లిం చడం లేదంటూ మొరబెట్టుకున్నారు. ఈనెల 9వ తేదీలోపు నెల జీతం ఇచ్చి, మిగిలిన జీతం ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన హామీ ఇచ్చేందుకు 10న జరిగే సమావేశానికి రావాలన్నారు. ఈ రెండింటిలో దేనిలో విఫల మైనా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడేళ్ల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కంపెనీ యాజమన్యం అడిగిన ప్రతి డిమాండును సీఎం మంజూరు చేశారని గుర్తుచేశారు. రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చినా ఫ్యాక్టరీ ప్రారంభించకపోగా, 32 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం మంచిది కాదన్నారు. వీరి తీరు మారకపోతే చట్టపరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు ఏకకాలంలో చేపట్టాల్సి వస్తుందన్నారు. సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్య నాయక్, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, బిల్ట్ ఇండస్ట్రీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్‌పై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫైర్



విశాలాంధ్ర-అమరావతి : తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌పై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఫైర్ అయ్యారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గవర్నర్ నరసింహన్ హైదరాబాద్‌లో ఉన్నందున తెలంగాణ పై ప్రేమ చూపుతూ ఏపీ పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే చట్టసవరణ బిల్లును నెలరోజులుగా గవర్నర్ ఆమోదించలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ఇదే తరహా బిల్లును మూడు రోజుల్లో ఆమోదించారన్నారు. గవర్నర్ తీరు మారకపోతే కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. నాలా చట్టం లేకపోవడం వల్ల ఏపీకి పరిశ్రమలు రావడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీకి పెట్టుబడులు రావాలంటే నాలా చట్టం కీలకమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలా చట్టం ఆమోదం కోసం గవర్నర్‌కు పంపిస్తే కొర్రీలు వేసి వెనక్కు పంపిస్తున్నారని చెప్పారు.అసెంబ్లీలో నాలా చట్టం ఆమోదం పొంది నెల రోజులు గడుస్తున్నదని, అయితే ఇప్పటి వరకు గవర్నర్ ఆఫీస్ నుంచి ఈ చట్టంపై స్పష్టత రాలేదన్నారు. వ్యాపారుస్తులు రోడ్డున పడకుండా అభివృద్ధి చెందడానికి మార్గం సుగమం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

14 మందికి తీవ్రగాయాలు



విశాలాంధ్ర-ఎమ్మినూరుటౌన్/ఎమ్మిగనూరు/ గంగవరం : కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో మంగళవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. 14 మందికి తీవ్రగాయాలయ్యాయి. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కొటేకల్లు గ్రామంలో లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలం కల్లుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. కర్ణాటక నుంచి జేసీబీని తీసుకొని ఎమ్మిగనూరు వైపు వస్తున్న కంటైనర్ కొటేకల్లు గ్రామంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. దానితో ఆటోడ్రైవర్ భీమిరెడ్డితో పాటు కొటేకల్లుకు చెందిన అంజనమ్మ(50), కర్రెమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన 9మందిని చికిత్సకొరకు 108, పోలీసు వాహనాల్లో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఖాదర్‌బాష మృతి చెందాడు. కంటైనర్ డ్రైవర్ నిద్రమత్తులో వుండటంతోనే ప్రమాదంచోటుచేసుకున్నదని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. కంటైనర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసునమోదు చేసినట్లు తెలిపారు. మృతుల బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులతో ప్రభుత్వ వైద్యశాల రోదనలతో మిన్నంటింది. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఐదువేల రూపాయల చొప్పున పరిహారం అందించారు. చంద్రన్న బీమా పథకం కింద మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు అందించేందుకు కృషిచేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి మృతులకుటుంబాలను పరామర్శించి ఒకొక్కరికి రూ.4వేలు అందచేశారు. ఎంపీపీ శంకరయ్య మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కల్లుపల్లి వద్ద ముగ్గురి మృతి

చిత్తూరు జిల్లా గంగవరం మండలం కల్లుపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురిని బలికొంది. మరో ఆరుగురు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం కల్లుపల్లి నుంచి పలమనేరుకు వస్తున్న ఆటోను పుంగనూరు వైపు వెళ్తున్న లారీ కల్లుపల్లి మలుపు వద్ద ఓవర్ టేకింగ్ చేయబోయి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సుబ్రమణ్యం (30), పెయింటర్ అలెక్స్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మున్నాబి(50) అనే మహిళ మృత్యువాత పడింది. షర్మిల(25), షర్వీనా(25), షభానా (25), గజేంద్ర(30), మేనక(30), మల్లిక (25), పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటన జరిగిన వెంటనే సిఐ మధుసూదనరావు, ఎస్ఐ రాజశేఖర్ ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీనియర్ ఐఏఎస్‌ల కినుక ?

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్‌లు కినుక వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లి ఆ తర్వాత వీఆర్ఎస్ తీసుకోవాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న పశు సంవర్ధక కార్యదర్శి జెఎస్‌వి.ప్రసాద్ ఇప్పటికే సెలవుపై వెళ్లారు. తొలుత నెల రోజులు సెలవుపై వెళ్లిన ప్రసాద్ మరో నెలరోజులపాటు సెలవును పొడిగించుకున్నారు. కొంతకాలం క్రితం వరకు దేవాదాయశాఖ కార్యదర్శిగా వ్యవహరించిన ప్రసాద్‌ను ప్రాధాన్యత లేని పశు సంవర్ధకశాఖ కార్యదర్శిగా బదిలీ చేయటంతో నచ్చక ప్రసాద్ సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శిగా ఉన్న మరో సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ, సుబ్రహ్మణ్యం కూడా సెలవులో వెళతారని తెలుస్తోంది. సీనియరైన తనను ప్రాధాన్యత లేని శాఖకు బదిలీ చేయటంపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం.కొద్దిరోజుల క్రితం వరకు ఆర్థికశాఖ, మరో ముఖ్యశాఖ కార్యదర్శిగా వ్యవహరించిన వారికి కూడా ప్రాధాన్యతలేని శాఖల కార్యదర్శులుగా ప్రభుత్వం నియమించింది. ఆ ఇద్దరు కార్యదర్శులు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద పలువురు సీనియర్ ఐఏఎస్‌లు తమ పోస్టింగ్‌లపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇదిలా ఉండగా త్వరలోనే సీనియర్ ఐఏఎస్‌లు, హెచ్ఓడీల బదిలీలు జరుగుతాయని సచివాలయంలో ప్రచారం ప్రారంభమైంది. ఈసారి బదిలీలలోనన్నా తమకు ప్రాధాన్యం ఉన్న శాఖల్లో నియమిస్తారో లేదో చూసి తమకు న్యాయం జరగకపోతే లాంగ్‌లీవ్‌పై వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది.

విశాలాంధ్ర


క్రీడలు

చమటోడ్చిన టీమిండియా



కేప్‌టౌన్: సఫారీ గడ్డపై టీమిండియా కఠోర సాధన చేస్తోంది. మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం కోహ్లి సారథ్యంలోని టీమిండియా ఇప్పటికే దక్షిణాఫ్రికా చేరుకున్న సంగతి తెలిసిందే. వర్షం కారణంగా ఆదివారం ఇండోర్ స్టేడియంలో సాధన చేసిన ఆటగాళ్లు మంగళవారం మైదానంలోనే చెమటోడ్చారు. ప్రధాన కోచ్ రవిశాస్త్రి ఆధ్వర్యంలో ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సాధన చేస్తూ కనిపించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను బీసీసీఐ ట్విటర్ ద్వారా అభిమానులతో పంచుకుంది. టీమిండియా ఇప్పటి వరకు దక్షిణాఫ్రికా గడ్డపై ఒక్క టెస్టు సిరీస్ కూడా కైవసం చేసుకోలేదు. ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానంలో ఉన్న టీమిండియా సఫారీ గడ్డపై సిరీస్ గెలుచుకోవాలన్న కసిగా ఉంది. బౌన్సీ పిచ్‌లపై కోహ్లిసేనకు సవాలు తప్పదని పలువురు మాజీ క్రికెటర్లు తమ అభిప్రాయాలను ఇప్పటికే వెల్లడించారు. బ్యాటింగ్ లేదా బౌలింగ్ విభాగాల్లో నిలకడగా రాణిస్తూ సొంతగడ్డపై వరుసగా టీమిండియా టెస్టు, వన్డే, టీ20 సిరీస్‌ల విజయాలు సాధించింది. ఇప్పుడు విదేశీ గడ్డపై ఎలా రాణిస్తుందన్న దానిపైనే అందరి చూపు. ఆదివారం వర్షం కారణంగా టీమిండియా ఆటగాళ్లు ఇండోర్‌లో ప్రాక్టీస్ సెషన్ నిర్వహించారు. ఇప్పుడు వర్షం తగ్గడంతో మంగళవారం ఉదయం కోహ్లిసేన మైదానంలో ప్రాక్టీస్ చేస్తూ కనిపించింది. ఆటగాళ్ల ప్రాక్టీస్ ఫొటోలతో పాటు వీడియోను బీసీసీఐ ట్విటర్ ద్వారా అభిమానులతో పంచుకుంది. ఈ పర్యటనలో భారత్ ఆతిథ్య దక్షిణాఫ్రికాతో మూడు టెస్టులు, 6 వన్డేలు, 3 టీ20లు ఆడనుంది. జనవరి 5న కేప్‌టౌన్‌లో ఇరు జట్ల మధ్య తొలి టెస్టు జరగనుంది.





టీమిండియా కోచ్‌గా మిథాలీ..?

ముంబై : అదేంటీ మిథాలీ రాజ్ భారత మహిళల క్రికెట్ జట్టు సారథి కదా. ఇప్పుడు కోహ్లిసేనకు కోచ్ ఏంటి అని అనుకుంటున్నారా! ఏమీ లేదండీ బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ తాజాగా మిథాలీ రాజ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ నేపథ్యంలో మిథాలీని భారత పురుషుల జట్టు ప్రధాన కోచ్‌గా చూడాలనుకుంటున్నాం అని అన్నాడు. ఇంతకీ ఈ ప్రశ్నకు మిథాలీ ఏమని సమాధానం ఇచ్చి ఉంటుందో తెలుసా... తాజాగా షారుక్‌ఖాన్-మిథాలీరాజ్ స్టార్ ప్లస్‌లో ఓ కార్యక్రమం కోసం బుల్లితెరను పంచుకున్నారు. ఈ నేపథ్యంలో షారుక్ అడిగిన కొన్ని ప్రశ్నలకు మిథాలీ బదులిచ్చారు. 'మైదానంలో తాము ఆడుతున్నంతసేపు.. మన జట్టు ట్రోఫీతో తిరిగి వస్తుందని ప్రతి ఒక్కరూ భావిస్తుంటారు. అందుకే క్రీజులో ఉన్నంతసేపు ఆటపైనే దృష్టి అంతా. మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికే చూస్తాం' అని మిథాలీ ఓ ప్రశ్నకు బదులు ఇచ్చింది. అనంతరం షారుక్.. మిథాలీని టీమిండియా పురుషుల జట్టు ప్రధాన కోచ్‌గా చూడాలనుకుంటున్నాం అని అనగా.. 'నేను ఎప్పుడూ నా బెస్ట్ ఇవ్వాలనే కోరుకుంటాను' అని బదులిచ్చింది. గత ఏడాది ప్రపంచకప్‌లో మ్యాచులు జరుగుతున్న సమయంలో మిథాలీ ఏదో ఒక పుస్తకం చదువుతూ మనకు ఎన్నోసార్లు కనిపించింది. దీని గురించి అడగ్గా.. 'ఒత్తిడిని అధిగమించడానికే పుస్తకాలు చదువుతా. పుస్తకాలు మనల్ని ప్రోత్సహించడంలోనూ ఎంతో సాయం చేస్తాయి' అని బదులిచ్చింది. 'టెడ్ టాక్స్ ఇండియా నయీ సోచ్' కార్యక్రమానికి షారుక్‌ఖాన్ వ్యాఖ్యాతగా నిర్వహిస్తున్నారు. మిథాలీరాజ్‌ను ఇంటర్వ్యూ చేసిన ఈ ఎపిసోడ్ ఈనెల 7న ప్రసారం కానుంది.



చెత్త పిచ్ ఎంసీజీ

మెల్‌బోర్న్: ఊహించినట్లుగానే మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) పిచ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇక్కడ ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ జరిగిన ఈ పిచ్‌ను నాసిరకం(పూర్)గా పేర్కొంటూ ఐసీసీ నివేదిక ఇచ్చింది. ఈ మేరకు పిచ్‌కు సంబంధించి రెండు వారాల్లో నివేదికను అందజేయాలని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ)కు స్పష్టం చేసింది. టెస్టు మ్యాచ్ ముగిసిన తరువాత మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగలే తన నివేదికను ఐసీసీకి అందజేశారు. పిచ్, అవుట్ ఫీల్డ్ నిర్వహణకు సంబంధించి నివేదిక ఇచ్చిన మదుగలే ఆందోళన వ్యక్తం చేశారు. అసలు ఈ పిచ్ ఐదు రోజుల ఆటకు ఎంతమాత్రం యోగ్యం లేదని నివేదికలో పేర్కొన్నట్లు ఐసీసీ ప్రకటించింది. ఇక్కడ బౌన్స్‌లో చాలా తేడాలు ఉండటంతో పాటు సీమ్ గమనం చాలా ఎక్కువగా ఉన్న విషయాన్ని మదుగలే వివరించినట్లు తెలిపింది. దానిలో భాగంగా పిచ్ రూపకల్పనపై ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డును నివేదిక కోరింది. తుది సమీక్షలో మెల్‌బోర్న్ పిచ్ కనీస ప్రమాణాలను పాటించలేదని తేలితే భారీగా జరిమానా పడే అవకాశం ఉంది. ఇదిలా ఉంచితే, ఆస్ట్రేలియాలో టెస్టు వేదికల పరంగా చూస్తే ఈ తరహా తక్కువ రేటింగ్ వచ్చిన తొలి పిచ్ ఇదే కావడం గమనార్హం.

ఆరు రకాలుగా విభజన...

- అంతర్జాతీయ పిచ్‌లను నాసిరకం (పూర్)గా గుర్తించే ముందు ఐసీసీ కొన్ని ప్రమాణాలు పాటిస్తుంది. టెస్టు మ్యాచ్ పిచ్‌కు రేటింగ్ ఇవ్వడంలో ఆరు రకాల కేటగిరీలు ఉన్నాయి. వెరీ గుడ్, గుడ్, అబోవ్ యావరేజ్, బిలో యావరేజ్, పూర్, అన్‌ఫిట్ అనే కేటగిరీలు ఉన్నాయి. ఇందులో పిచ్ ప్రమాదకరంగా ఉంటే అన్‌ఫిట్‌గా తేలుస్తారు. ఇప్పుడు మెల్‌బోర్న్ పిచ్‌ను ఐసీసీ పూర్ కేటగిరీలో చేర్చింది. ఇందుకోసం నాలుగు అంశాలు ప్రామాణికంగా ఉంటాయి.
- మ్యాచ్‌లో ఏ దశలోనైనా బంతి సీమ్ గమనం చాలా ఎక్కువగా ఉండటం.
- మ్యాచ్‌లో ఏ దశలోనైనా పిచ్‌పై బౌన్స్‌లో తేడాలు చాలా ఎక్కువగా ఉండటం.
- మ్యాచ్ ప్రారంభంలోనే పిచ్ స్పిన్ బౌలర్లకు చాలా ఎక్కువగా సహకరించడం.
- మ్యాచ్‌లో ఏ దశలోనైనా పిచ్‌పై అసలు ఏమాత్రం బంతి సీమ్, టర్న్ కాకపోవడం లేదా అసలు బౌన్స్ లేకపోవడం. ఈ రకంగా బ్యాటింగ్, బౌలింగ్ మధ్య సమతూకాన్ని ఏ మాత్రం పాటించకపోవడాన్ని పూర్ పిచ్‌గా నిర్ధారిస్తారు.

గీతంలో టెన్నిస్ పోటీలు ప్రారంభం

39 వర్సిటీల నుంచి హాజరైన క్రీడాకారిణులు

విశాలాంధ్ర-మధురువాడ(విశాఖ) : దక్షిణాది రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయు) పర్యవేక్షణలో నిర్వహిస్తున్న దక్షిణ మండల మహిళా టెన్నిస్ పోటీలు మంగళవారం గీతం విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాష్ట్రాల నుంచి 39 విశ్వవిద్యాలయాల జట్లు ఈ పోటీలకు హాజరయ్యాయి. తూర్పు కోస్తా రైల్వే డివిజనల్ మేనేజర్ ముకుల్ శరణ్ మాథుర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంఎస్ ప్రసాదరావు, ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ఎం.పోతరాజు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు పాల్గొన్నారు. గీతం టెన్నిస్ కోర్టులో జరిగే ఈ పోటీలలో దాదాపు 70 మంది టెన్నిస్ క్రీడాకారిణులు పాల్గొననున్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఎంపికచేసి జనవరి 4వ నుంచి జరిగే అఖిలభారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.

తొలిరోజు ఇలా..

మొదటి రోజు జరిగిన పోటీల్లో మణిపాల్ విశ్వవిద్యాలయంపై ఎంజీ విశ్వవిద్యాలయం, కేఎల్‌యూ జట్టుపై కాకినాడ జేఎన్‌టీయూ, అన్నామలై యూనివర్సిటీ జట్టుపై రాయలసీమ జట్టు, భారతీదాసన్ యూనివర్సిటీ జట్టుపై కాలికట్ యూనివర్సిటీ జట్టు విజయం సాధించాయి.



కోర్టులోనే కుప్పకూలిన ముగురుజా



బ్రిస్బేన్: వెనిజులా క్రీడాకారిణి గార్బైన్ ముగురుజా అనూహ్య పరిణామాల నడుమ బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించారు. తీవ్ర వేడిమిని తట్టుకోలేక మ్యాచ్ మధ్యలోనే ఆమె కోర్టులో కుప్పకూలిపోయారు. మంగళవారం సెర్బియా క్రీడాకారిణి అలెక్జాండ్రా క్రునిక్‌తో రెండో రౌండ్‌లో గార్బైన్ తలపడింది. మ్యాచ్ మధ్యలో వేడిమి తట్టుకోలేక ఆమె అస్వస్థతకు గురయ్యారు. అయితే ఆమెకు చికిత్స అందజేయగా.. మళ్లీ మ్యాచ్ కొనసాగింది. తర్వాత 2-1 తో సెట్స్ గెలుచుకున్న గార్బైన్.. మూడో సెట్ హోరాహోరీగా జరుగుతున్న సమయంలో మళ్లీ కుప్పకూలిపోయింది. ఈసారి కోలుకునే అవకాశాలు కనిపించకపోవటంతో ఆమె ఓటమిని అంగీకరించింది. దీంతో క్రునిక్‌ను విజేతగా ప్రకటించారు. క్వార్టర్ ఫైనల్‌లో క్రునిక్ సొరానా కిర్‌స్టియా లేక అనస్తాసిజా సెవాస్తోవాలో ఎవరో ఒకరితో తలపడనుంది. ఇక ప్రపంచ ర్యాంక్ 2 క్రీడాకారిణి అయిన ముగురుజా టోర్నీ నుంచి నిష్క్రమించటంతో.. నంబర్-1 ర్యాంకు సాధించాలన్న ఆమె కల క్లిష్టతరంగా మారింది. త్వరలో ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీ ఉన్న నేపథ్యంలో.. రిస్క్ చేసే ఉద్దేశం లేకనే వైదొలగినట్లు ముగురుజా ప్రకటించారు. కాగా, జనవరి 15 నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభం కానుంది.

నేటి నుంచి సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్

ఐదు రాష్ట్రాల నుంచి 98 జట్లు



వివరాలు వెల్లడిస్తున్న వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం రెండున్నర దశాబ్దాల కాలం తరువాత సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ (మెన్స్) టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. రఘు ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో 3 నుంచి 12 వరకు పోటీలు జరగనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదు రాష్ట్రాల నుంచి 98 జట్లు ఈ పోటీలకు హాజరవుతున్నాయి. 1900 మందికి పైగా క్రీడాకారులు, జట్ల సిబ్బంది, కోచ్‌లు, మేనేజర్లు ఈ పోటీలకు విశాఖ నగరానికి వస్తున్నారన్నారు. బుధవారం ఉదయం 9.30కి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారు. నాకౌట్ విధానంలో పోటీలను నిర్వహించనున్నామని నాగేశ్వరరావు తెలిపారు. క్రీడా జట్లను నాలుగు పూల్స్‌గా విభజించామనీ, గతేడాది సెమీ ఫైనల్స్‌కు చేరిన జట్లు నేరుగా సూపర్ క్వార్టర్స్‌లో పాల్గొంటాయని తెలిపారు. బీసీసీఐ, ఏసీఏకు చెందిన ఎంపైర్లు మ్యాచ్‌లను నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్ స్కోరింగ్ విధానాన్ని ఈ టోర్నమెంట్‌కు అమలు జరుపుతున్నామన్నారు. దీనిని తొలిసారిగా ఇంటర్ యూనివర్సిటీ క్రీడాపోటీలకు అమలు చేయడం జరుగుతోందన్నారు. రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలసి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, ఏయూ క్రీడా విభాగ సంచాలకులు ఆచార్య ఎన్.విజయ మోహన్ పాల్గొన్నారు.



బౌలింగ్ కోచ్‌గా నెహ్రా..!

బెంగళూరు: కొద్ది నెలల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించి కామెంటేటర్‌గా స్థిరపడిన టీమిండియా మాజీ ఆటగాడు ఆశిష్ నెహ్రా త్వరలో బౌలింగ్ కోచ్ అవతారమెత్తనున్నాడు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్లు అన్ని పూర్తయ్యాయి. ఇక బాధ్యతలు స్వీకరించడమే తరువాయి. ఇంతకీ నెహ్రా ఏ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నాడనేగా మీ అనుమానం. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈ ఏడాది సీజన్ కోసం ఆశిష్ నెహ్రాను బౌలింగ్ కోచ్‌గా ఎన్నుకుంది. అలాగే మెంటార్‌గానూ అతడు బాధ్యతలు నిర్వహించనున్నాడు. ఐపీఎల్‌లో నెహ్రా చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ డేర్‌డెవిల్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు గ్యారీ కిర్‌స్టన్‌కు ఆర్‌సీబీ బ్యాటింగ్ మెంటార్, కోచ్ బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం గ్యారీ బిగ్‌బాష్ లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. గత మూడు ఐపీఎల్ సీజన్లలో గ్యారీ ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు కోచ్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఆర్‌సీబీకి డానియల్ వెటోరీ ప్రధాన కోచ్‌గానే కొనసాగనున్నాడు. జనవరి 27, 28న ఈ ఏడాది ఐపీఎల్ ఆటగాళ్ల వేలం బెంగళూరులో జరగనుంది. ఈ వేలం కోసం అభిమానులు పెద్ద సంఖ్యలో ఎదురుచూస్తున్నారు.

ఛాలెంజ్‌కు సిద్ధమా..!

కేప్‌టౌన్: ఈనెల 5 నుంచి టీం ఇండియా జట్టు దక్షిణాఫ్రికాతో జరిగే ప్రతిష్టాత్మక టెస్ట్ సిరీస్ కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. కేప్‌టౌన్ చేరుకున్న కోహ్లిసేన ఈ ఏడాదిని విజయంతో స్వాగతించాలని కృషి చేస్తోంది. దీని కోసం ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్న విరాట్ అండ్ కోకు ఊహించని ఛాలెంజ్ ఎదురైంది. దక్షిణాఫ్రికా టూరిజం విరాట్ కోహ్లిని హెర్మనస్‌లోని షార్క్ డైవింగ్ చేయాలని ఛాలెంజ్ చేసింది. 'హే విరాట్, మేం ఓ ఉత్కంఠభరిత క్రికెట్ కోసం ఎదురుచూస్తున్నాం. అయితే మైదానంలో యాక్షన్‌కి ముందు, ఓ చిన్న సాహసం చేస్తే ఎలా ఉంటుంది. ఒకసారి వచ్చి హెర్మనస్‌లోని ఉత్సాహవంతమైన 'షార్క్-డైవింగ్' చూడండి. మరి మెన్-ఇన్-బ్లూ ఈ ఛాలెంజ్‌కి సిద్ధమా' అని సౌతాఫ్రికా టూరిజం ట్వీట్ చేసింది. మరీ ఈ ఛాలెంజ్‌పై విరాట్ కోహ్లి అండ్ టీం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

బ్రిస్బేన్ టోర్నమెంట్ నుంచి ముర్రే అవుట్



బ్రిస్బేన్ : బ్రిస్బేన్ ఇంటర్‌నేషనల్ టోర్నమెంట్ నుంచి మాజీ వరల్డ్ నంబర్ వన్ ఆండీ ముర్రే వైదొలిగాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ తరువాత ఫాంలోకి వచ్చాడని అంతా అనుకున్నారు. అయితే 2017 కుడివైపు తుంటి గాయం కారణంగా వింబుల్డెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో అమెరికా ఆటగాడు శామ్ క్యూరీ చేతిలో ఓటమి చవిచూశాడు. అయితే తాను కోలుకున్నాననీ, బ్రిస్బేన్ టోర్నమెంటులో ఆడతాననీ అంతకుముందు ప్రకటించాడు. కానీ మంగళవారం మాత్రం తాను టోర్నమెంటు నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించాడు. ఈ టోర్నమెంటు నుంచి వైదొలగడం తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పాడు. ఈ ఏడాది అభిమానుల ఆశలకు తగ్గట్లుగా ఆడదామనుకున్నాననీ, వారందరినీ నిరాశకు గురిచేశానని తెలిపాడు.



ఢిల్లీ సీపీఐ కేంద్ర కార్యాలయంలో పార్టీ అగ్రనేత కామ్రేడ్ ఏబీ బర్ధన్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ధరేంద్ర శర్మ, ప్రొఫెసర్ దినేష్ వర్షిణి, ఎస్ఎస్ సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ కన్నా పీఎస్ఎల్ మిన్న

కరాచీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) కంటే పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) ఆడటమే మిన్న అని అంటున్నాడు పాక్ మాజీ క్రికెటర్ అబ్దుల్ రజాక్. పీఎస్ఎల్ రెండు సీజన్లు ముగించుకుని ఈ ఏడాది మూడో సీజన్‌కు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో పాక్ మాజీ ఆటగాడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ..'పీఎస్ఎల్ టోర్నీ ఎంతో నాణ్యమైనది. నా వరకు ఇది ఐపీఎల్ కంటే మెరుగైన టోర్నీ. అంతర్జాతీయ క్రికెటర్లతో కలిసి ఆడాలనుకున్న వారికి ఈ వేదిక చాలా అనువైనది. పీఎస్ ఎల్‌లో ఆడాలని నాకూ ఉంది. ఫిట్‌నెస్‌ను బాగా మెరుగుపరుచుకుని వచ్చే ఏడాది పీఎస్ఎల్‌లో ఆడేందుకు సిద్ధమవుతా' అని రజాక్ తెలిపాడు. పీఎస్ఎల్-3 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 25 వరకు జరగనుంది.

చెన్నై బౌలింగ్ కోచ్‌గా బ్రెట్‌లీ

న్యూఢిల్లీ : ఆసీస్ మాజీ బౌలర్ బ్రెట్ లీ ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల నిషేధాన్ని ముగించుకుని చెన్నై, రాజస్థాన్ తిరిగి ఈ ఏడాది ఐపీఎల్‌లోకి అడుగుపెట్టబోతున్నాయి. స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యంలో ఈ రెండు జట్లపై 2015లో నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బలమైన జట్టుగా టోర్నీలో అడుగుపెట్టాలని చెన్నై భావిస్తోంది. ఇందులో భాగంగా బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకోవాలని ఆసీస్ మాజీ బౌలర్ బ్రెట్ లీతో చెన్నై సూపర్‌కింగ్స్ యాజమాన్యం సంప్రదింపులు జరపగా.. అతడు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. R.No.32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.